
# కవిత్వం - సమాజం

## క్రిస్టోఫర్ కాడ్వెల్ విశ్లేషణ



335.43092
మ. కవి
903

కేతవరపు రామకోటి శాస్త్రి

శ్రీమతి అబ్బూరి ఛాయాదేవి గారికి
నమస్సులతో
కాత్యాయని
27/11/98

# కవిత్వం-సమాజం

## క్రిస్టోఫర్ కాడ్వెల్ విశ్లేషణ

PRESENTED BY
ABBURIS

రచన

కేతవరపు రామకోటిశాస్త్రి

కూర్పు : కాత్యాయనీ విద్మహే

ప్రజాశక్తి బుక్‌హౌస్

ప్రచురణ సంఖ్య 522
ప్రచురణ : అక్టోబర్, 1998
ప్రతులు : 2000

335.43092
రామ - క్రోటి

వెల : రు. 10.00

c15887
ACC. NO. 3962
AC No. 903

డి.టి.పి : ప్రజాశక్తి
ముద్రణ : యుగంధర్ ఆఫ్‌సెట్ ప్రింటర్స్,
విజయవాడ - 3

ప్రతులకు : ప్రజాశక్తి బుక్‌హౌస్

- కారల్‌మార్క్స్‌రోడ్, విజయవాడ-500 002, ఫోన్ 432792
- 1-8-522, శ్రీరామకాంప్లెక్స్, చిక్కడపల్లి, హైదరాబాద్ - 500 020, ఫోన్ 7608107
- 5, ఏ జి కె కాంప్లెక్స్, గాంధీరోడ్, తిరుపతి - 517 501
- 11-2-53, బాలాజీనగర్, సుందరయ్యభవన్, ఖమ్మం - 507 001
- 6 2-250, విజయటాకీస్‌రోడ్, చౌరస్తా, హన్మకొండ - 506 011

# మామాట

మార్క్సిస్టు దృక్పథంతో సాహిత్యాన్ని, మరీముఖ్యంగా కవిత్వాన్ని అద్భుతమైన రీతిలో పరిశీలించిన వాడు క్రిస్టోఫర్ కాడ్వెల్. సామాజిక జీవనాన్నుంచి కవిత్వాన్ని వేరుపరచి ఛందస్సు, లయ, వస్తువు, అలంకారాలు అంటూ పరిశీలనలు, విశ్లేషణలు చేసినవారు చాలామంది వుంటారు. కాని సామాజికార్థిక రాజకీయ పరిణామాల పూర్వరంగంలో కవిత్వతత్వాన్ని సమగ్రంగా విశ్లేషించటం కాడ్వెల్ విశిష్టత. ఆయనకుముందు ఇలాంటి ప్రయత్నాన్ని ఇంత సమగ్రంగా చేసినవారు అరుదు. తదనంతరకాలంలో వచ్చిన సాహితీ విమర్శకులకు ఆయన మార్గదర్శి అయ్యాడు. కవిత్వ మూలాలగురించి దాని పరిణామం గురించి వివరిస్తూ కాడ్వెల్ రచించిన ఇల్యూషన్ అండ్ రియాలిటీ అన్న గ్రంథం సులభగ్రాహ్యమైనదికాదు. మౌలికమైన ప్రతిపాదనలతోనూ, నిర్ధారణలతోనూ కూడుకొని అత్యంత సంశ్లిష్టమైన రీతిలో వుంటుంది. ఇది పన్నెండు అధ్యాయాల పుస్తకం. తొలి మూడు అధ్యాయాలను కేతవరపు రామకోటిశాస్త్రిగారు తాత్పర్యార్థంగా స్వేచ్ఛానువాదం చేశారు. సాహిత్యం పట్ల మక్కువ వున్న ప్రతివారికి ఇది అవశ్యపఠనీయం. ముఖ్యంగా సాహిత్య, కళారంగాలకు చెందిన వారికి ఇది ఒక పెద్దబాలశిక్షవంటిది. శాస్త్రిగారి రచనకు తోడుగా వారి కుమార్తె కాత్యాయనీ విద్మహేగారు కాడ్వెల్ రచనలగురించి మరిన్ని వివరాలను జతచేశారు. వాటిని గ్రంథాంతంలో చూడవచ్చు. 'ప్రజాశక్తి బుక్‌హౌస్' ప్రచురణగా వెలువడుతున్న యీ పుస్తకాన్ని పాఠకులు ఆదరించగలరన్నదే మా విశ్వాసం.

-ప్రచురణకర్తలు

# కృతజ్ఞతలు

సాహిత్య అధ్యయన అధ్యాపనాలంటే ప్రాణం పెట్టే మా నాన్న కేతవరపు రామకోటిశాస్త్రిగారు 1991 అక్టోబర్ 28న రోడ్డు ప్రమాదంలో మరణించే వరకు కొత్త పుస్తకాలు తెప్పిస్తూనే వున్నారు చదువుతూనే వున్నారు పాఠంచెప్పాలన్నా పరిశోధన చేయించాలన్నా ముందు తాను చదవటం, వ్రాయటం ఆయన అలవాటు అట్లా ఆయన వ్రాసి వదిలివెళ్ళిన విషయాలను అచ్చువేసి ఆలోచనాపరులకు అందుబాటులోకి తీసుకుని రావాలనుకున్నాం 1992 నుండి ఇప్పటికి ఆరు పుస్తకాలు అచ్చువేశాం *మళ్ళీ కన్యాశుల్కం గురించి* (1992) చరిత ప్రచురణ కాగా, *అభ్యుదయవాద సాహిత్య విమర్శన దృక్పథం* (1997) విశాలాంధ్ర ప్రచురణ *నాటక విశ్లేషణ* (1993), *విశ్వనాథ వైఖరి* (1994), *మహిళా సమాజవాద సాహిత్య వ్యాసాలు* (1995), *ఒకే ఇద్దరము* (1996) జిజ్ఞాస ప్రచురణలుగా వచ్చాయి జిజ్ఞాస ప్రచురణలు చేపట్టి మా చేత నాన్న పుస్తకాల పనిచేయిస్తూ వచ్చిన మా అమ్మ కేతవరపు ఇందిరాదేవి కూడా 1997లో మమ్మల్ని వదిలి వెళ్ళిపోయింది

అమ్మకు షష్టిపూర్తి కానుకగా వేసిన *ఒకే ఇద్దరము* కావ్య ఆవిష్కరణ సభ 1996 అక్టోబర్ 28న కాకతీయ విశ్వవిద్యాలయం మానవీయ విజ్ఞాన భవనం సెమినారు హాలులో జరిపాం అప్పటి తెలుగు శాఖాధ్యక్షులు డాక్టర్ అనుమాండ్ల భూమయ్య ఆ సభకు అధ్యక్షత వహించారు కాకతీయ విశ్వవిద్యాలయానికి అప్పటి వైస్ ఛాన్సలర్ ఆచార్య వై వైకుంఠంగారు కావ్యాన్ని ఆవిష్కరించారు పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం మాజీ వైస్ ఛాన్సలర్ పేర్వారం జగన్నాథంగారు, కోవెల సంపత్కుమారాచార్యగారు ఆ సభలో మాట్లాడారు

*అభ్యుదయవాద సాహిత్య విమర్శన దృక్పథం* పుస్తకావిష్కరణ సభ 1997 అక్టోబర్ 28న జిజ్ఞాస వేదిక పక్షాన వరంగల్ జిల్లా కేంద్ర గ్రంథాలయంలో జరిగింది విశాలాంధ్ర పబ్లిషింగ్ సంస్థ మేనేజర్ రాజేశ్వరరావు గారు సభకు అధ్యక్షత వహించారు చేకూరి రామారావుగారు పుస్తకావిష్కరణ చేశారు కేతు విశ్వనాథరెడ్డిగారు, ఆచార్య ఎన్ భక్తవత్సలరెడ్డిగారు ఆ సభలో మాట్లాడారు

ఇప్పుడీ సంవత్సరం నాన్న పుస్తకం *కవిత్వం - సమాజం, క్రిస్టోఫర్ కాడ్వెల్ విశ్లేషణ* ప్రజాశక్తి బుక్‌హౌస్ వారి ప్రచురణగా వస్తున్నది ఈ పుస్తక ప్రచురణ కోసం

ప్రజాశక్తి బుక్‌హౌస్ వారిని సంప్రదించమని చెప్పింది మహీధర రామ్మోహనరావుగారు. వారంతట వారే ఒకసారి ఫోన్ చేసి 'మీ నాన్న కాడ్వెల్ గురించి వ్రాసిన వ్యాసాలు జనధర్మలో చూసినట్లు గుర్తు ప్రజాశక్తివారు కాడ్వెల్ మీద ఏదైనా పుస్తకం వేయాలన్న ఆలోచనలో వున్నారు. వాళ్ళతో మాట్లాడమని మహీధరవారు చెప్పిన మాటలు. ఇచ్చిన ప్రోత్సాహంతో 'ప్రజాశక్తి'జనరల్ మేనేజర్ క్రిష్ణయ్యగారికి ప్రెస్ కాపీ పంపడం. వారీ పుస్తక ప్రచురణకు అంగీకరించడం చకచకా జరిగిపోయాయి.

పుస్తక ప్రచురణ బాధ్యతను స్వీకరించి మేము చేపట్టిన నాన్న పుస్తకాల ప్రచురణ ప్రాజెక్టుకు తమవంతు సహకారాన్నందించిన ప్రజాశక్తి బుక్‌హౌస్ క్రిష్ణయ్యగారికి. అన్నే భాస్కర్ గారికి. నిరంజన్‌గారికి, మాకీ సలహా ఇచ్చి మా పని సులువు చేసిన మహీధర రామ్మోహనరావుగారికి మేము ప్రత్యేకంగా కృతజ్ఞతలు చెప్పుకుంటున్నాం ఈ పని క్రమంలో ఎప్పటికప్పుడు తోడ్పడుతూ వచ్చిన వరంగల్ ప్రజాశక్తి బుక్‌హౌస్ బ్రాంచి బాధ్యుడు వేణుగోపాల్‌ను అభిమానంతో అనుకుంటాం

'కాడ్వెల్ కవితాతత్త్వం' అనే పేరుతో దీనిని 1969 మార్చి నుండి 1969 సెప్టెంబర్ వరకు నాలుగు సంచికలలో ధారావాహికంగా ప్రచురించింది జనధర్మ ద్వైమాసిక పత్రిక గ్రాంధికంలో వున్న ఈ విషయాలను వస్తువుకు తగిన ప్రజాస్వామిక వ్యావహారిక వచనంలోకి పుస్తక ప్రచురణ కోసం 1970లలోనే వ్రాసి పెట్టారు ముదిగొండ వీరభద్రయ్యగారు. ఈ సందర్భంగా వారందరికీ కృతజ్ఞతలు.

జనధర్మ పత్రికకు సంపాదకులు ఎం శ్రీనివాసాచార్యగార్లు, కోవెల సుప్రసన్నాచార్యగారు జనధర్మ పత్రికకు గౌరవ సంపాదకులు. ఇప్పుడీ పుస్తక ప్రచురణకు కాపీ సిద్ధం చేసేటప్పుడు తమ దగ్గరున్న జనధర్మ పాత సంచికలు ఇచ్చి తోడ్పడ్డారు వారికి కృతజ్ఞతలు చెప్పడం మా విధి.

ఈ పుస్తకం పనిలో చేదోడువాదోడుగా వున్న డాక్టర్ జి కిషన్ ప్రసాద్, మార్క్ యాదయ్యలకు డాక్టర్ టి జ్యోతిరాణికి స్నేహపూర్వక కృతజ్ఞతలు

అతి తక్కువ సమయంలో పుస్తకాన్ని చక్కగా ముద్రించిన ప్రజాశక్తి బుక్‌హౌస్ మేనేజ్‌మెంట్ వారికి, అక్షరాలు కూర్చిన సాంకేతిక నిపుణులకు, ప్రెస్ కార్మికులకు కృతజ్ఞతలు.

'పశ్యంతి'

4-10-1998

**కాత్యాయనీ విద్మహే**

**మైథిలీ ధీమహి**

**శ్రీ గౌరీ ప్రచోదయాత్**

# విషయ సూచిక


| | |
|---|---|
| కాడ్వెల్ జీవిత విశేషాలు | 1 |
| ప్రవేశిక | 3 |
| కవిత్వం-సమాజం | 7 |
| కాడ్వెల్ ప్రాపంచిక దృక్పథం గురించి | 39 |
| పాదసూచికలు | 53 |

# కాడ్వెల్ జీవిత విశేషాలు

క్రిస్టోఫర్ కాడ్వెల్ 1937 ఫిబ్రవరి 12వ తేదీన స్పెయిన్‌లో మరణించాడు. రెండో ప్రపంచ యుద్ధానికి పూర్వరంగంగా నాజీ ఫాసిస్టులు సృష్టించిన అంతర్యుద్ధాన్ని స్పెయిన్ రిపబ్లికన్ ప్రభుత్వం ఎదుర్కోవలసి వచ్చింది ప్రభుత్వం పక్షాన అంతర్జాతీయ సైనిక విభాగంలో చేరి ఎర్రసైనికోత్సాహంతో విజృంభించి కాడ్వెల్ వీర మరణాన్ని పొందాడు. అప్పటికతని వయస్సు - 1907 అక్టోబర్ 20న పుట్టాడు గనుక - సరిగ్గా 29 సంవత్సరాల మూడు నెలల పన్నెండు రోజులు.

1933 వరకు కాడ్వెల్ మార్క్సిజం దగ్గరకు పోలేదు. 1934, 35 సంవత్సరాల్లో మార్క్సిస్టు ప్రపంచ జీవిత తాత్వికతను అధ్యయనం చేసి ఆ అవగాహనతో కవిత్వము యొక్క ఉత్పత్తి పరిణామాల మౌలిక సామాజిక స్థితిగతులను గురించి ఇల్యూషన్ అండ్ రియాలిటీ అన్న గ్రంథం చిత్తుప్రతిని రచించాడు. 1935 డిసెంబర్‌లో పార్టీలో సభ్యుడై మరింత విజ్ఞానాన్ని అనుభవపూర్వకంగా పొందాలని పారిస్ వెళ్ళాడు అక్కడ పొందిన ఉత్సాహశక్తితో ఆ గ్రంథాన్ని కాడ్వెల్ మరింత పకడ్బందీగా తిరుగవ్రాశాడు స్టడీస్ ఇన్ ఎ డయింగ్ కల్చర్ అన్న పేర తరువాత ప్రచురించిన పుస్తకంలోని వ్యాసాలనప్పుడే పూర్తి చేశాడు ది క్రైసిస్ ఇన్ ఫిజిక్స్ అనే రచన మొదలు పెట్టాడు 1936 నవంబర్‌లో అంతర్జాతీయ సైనిక విభాగంలో చేరటానికి పోయేటప్పటికి ఇల్యూషన్ అండ్ రియాలిటీ అన్న ఈ గ్రంథం అచ్చులోవుంది ఆ పోయిన కాడ్వెల [illegible]గే పోవలసి వచ్చింది

నిజానికతని పేరు కాడ్వెల్ కాదు సెంట్ జాన్ స్ప్రిగ్గ్. యుద్ధంలో కొండల మీద మరణించింది జాన్ జాన్ బ్రతికివుండగా పుస్తకాలు రచించింది కాడ్వెల్. జాన్ స్ప్రిగ్గ్ తల్లిపేరు జెస్సి మేరీ కాడ్వెల్ ఆ తల్లి పేరునే తన కలంపేరుగా పెట్టుకొన్నాడు తల్లిదండ్రులు పెట్టిన పేరు జాన్ మార్క్సిస్టు తాత్విక రచయిత అవుతూ తాను పెట్టుకొన్న పేరు కాడ్వెల్ ఆ వైజ్ఞానిక సంకేతమే నిలబడింది

మార్క్సిస్టు ఆలోచనా పరుడూ ఆచరణ శీలుడూ కాకముందు కాడ్వెల్ యొక్క జాన్ జీవితం అనేకచిత్రం పదహారేళ్ళదాకా చదువుకొన్నాడు. తరువాత మూడేళ్ళపాటు యార్క్ షైర్ అబ్జర్వర్ పత్రికకు విలేఖరిగా పనిచేశాడు అప్పుడు లండన్‌లోని ఒక విమాన విజ్ఞాన ప్రచురణ సంస్థలో సంపాదకుడుగా చేరి దానికి డైరెక్టరైనాడు అప్పుడే విలువైన యంత్రవిభాగాలను స్వయింకృషి చేత కనిపెట్టాడు విమాన విజ్ఞాన శాస్త్రవిషయాల్లో అయిదు పాఠ్యగ్రంధాలను వ్రాశాడు అపరాధ పరిశోధక నవలలొక ఏడు రచించాడు పద్యాలూ, చిన్న కథలూ సరేసరి. ఇదంతా జరిగింది ఇరవై అయిదేళ్ళలోపుగానేనంటారు. నిజంగా కూడా అంతే 1934 నుండి మార్క్సిస్టు ఆయన

మే. 1935లో దిస్ మై హాండ్ అన్న నవలకు రచయితగా తన పేరును క్రిస్టోఫర్ కాడ్వెల్ అని వేసుకొన్నాడు ఆ వరుసలో చూస్తే కాడ్వెల్ రచనలు. 1. This My Hand(1935) 2 Illusion and Reality (1937) 3. Studies in a Dying Culture (1938) 4. The Crisis in Physics (1939) 5.Further Studies in a Dying Culture (1949) - ఇలా వుంటాయి. నవలలు, పాఠ్యగ్రంధాలు తప్పిస్తే మిగిలిన కాడ్వెల్ రచనలన్నీ అతని మరణానంతరం అచ్చయినవే. 1939లో మొదటిసారి అచ్చయిన అతని కవితలు 1965లో పునర్ముద్రణలో వచ్చాయి ఆ సంవత్సరమే Studies - Crisis in Physics అనే రెండు పుస్తకాల మొత్తంగా The Concept of Freedom అనే గ్రంధమొకటి వచ్చింది.

కాడ్వెల్ కమ్యూనిస్టుగా బ్రతికి, చావడం కూడా కమ్యూనిస్టుగానే చావడం అతనిది పూర్ణజీవిత మనటానికి నిదర్శనం

ఈ శతాబ్దిలో సాంస్కృతిక సాహిత్య కళారూపాల అధ్యయనంలో తన పూర్వీకులను మించిపోయినవాడు కాడ్వెల్ అంటే సాంస్కృతిక సాహిత్యకళా రూపాలు మహాజనం యొక్క మనస్సులను తమ అంతర్యానికభిముఖంగా మార్చుకొని, వాళ్ళచేత ప్రపంచాన్ని మార్పుచేయిస్తాయన్న చారిత్రక వాస్తవికతను తెలిసి విశదీకరించి సాహిత్య అధ్యయన దృక్పథాన్ని మార్చిన వాడన్నమాట.

# ప్రవేశిక

కవిత్వాన్ని గురించీ, కవిత్వ ఉత్పత్తి మాతృకాస్థానాల గురించీ మాట్లాడుతున్నామంటే మనం ఇంకా చాలావాటిని గురించి మాట్లాడటానికి సిద్ధపడ్డామన్నమాట అవేమిటంటే కవిత్వమనేది ఏదో ఒక బాషలో గదా వుంటుంది। అప్పుడు భాషల ఉత్పత్తి విషయం కూడా మనపరిధిలోనిదే. అన్ని భాషలూ ఆయా సమాజాల సమష్టి ఉత్పత్తులు ఆ సమాజంలోని మనుషులంతా తాము ఒకరితో ఒకరు సంబంధించి వ్యవహరించుకోవడం అవసరమై కూర్చుంటే ఆ అవసరం తీర్చే సాధనంగా అందరూ కలిసి యథాశక్తి ఆ భాషను సృష్టించుకున్నారు. అది సమష్టిమీద ఉత్పత్తి చేసినది గనుక అది సమాజం సొత్తు. ఆ సామాజిక సంపదయైన భాషను ఆశ్రయించి ఆ రూపంతోనే తాను వ్యవహారంలోకి వస్తున్నది కవిత్వం ఆ భాష తన రూపాన్నిచ్చి సహకరించకపోతే కవిత్వం లేదు. లేదని ఎందుకనాలి? ఉన్నదనే అందాం. వున్నా అది ఉన్నట్లు తెలియకుండా మాత్రమే వుంటుంది. తెలియాలంటే భాషారూపాన్ని ధరించక తప్పదు. భాష తనకు రూపమిచ్చి తన ఉనికికి తోడ్పడుతున్నది గనుక, కవిత్వం అందుకు కృతజ్ఞతగా భాషా లక్షణాలను తాను సంతరించుకుని త్వమేవాహమన్నట్లుగా వుంటుంది భాషయొక్క ప్రధాన లక్షణమేమనుకొన్నాం? అది సమష్టి సామాజిక చైతన్యలక్షణలక్షితం సరిగ్గా దాన్నే కవిత్వం కూడా సంతరించుకుంటుంది. అందువల్ల కవిత్వాన్ని గురించి విచారించడం మొదలు పెట్టామంటే దాని ప్రాథమికమైన స్వరూప స్వబావాలకు సంబంధించిన సమష్టి సామాజిక చైతన్య మూలమైన సాంఘిక అస్తిత్వరూప ఆర్థిక రాజకీయ వ్యవస్థల స్థితిగతుల దగ్గర మొదలు పెడుతున్నామన్నమాట

ఇలా మొదలు పెట్టడాన్ని పాతవాళ్ళెవరూ ఒప్పుకోరు సాహిత్యాన్ని, సాహిత్యంగానే విమర్శించాలంటారు ఉత్పత్తి స్థానాలతో సంబంధం కలిపి విచారించడం పద్ధతి కాదంటారు కవిత్వం కవిత్వంలాగుండాలిగానీ మరొకలాగా అది వుండకూడదంటారు. కవిత్వాన్ని కవిత్వంగానే చూచి విమర్శించాలంటారు. ఇదంతా నిజమే. ఎప్పుడు నిజం? పదార్థ పరిశీలనలో, పరిశోధనలో విడివిడిగా దేనికది స్వయం సంపూర్ణమనుకునే అజ్ఞానమే విజ్ఞానంగా మనిషి ప్రవర్తించిన కాలంలో నిజం అప్పుడు కవిత్వానికి మరొక దానితో సంబంధం లేదు దాన్ని దానిగానే చూచేవాళ్ళు అలాగే వ్యాకరణశాస్త్రం వేరు. తర్కశాస్త్రం వేరు. బాటనీ జువాలజిలు కూడా వేరు వేరే ఫిజిక్స్, కెమిస్ట్రీలు సరేసరి. మరిప్పటి పరిస్థితి వేరు. విజ్ఞాన శాస్త్ర పరిశోధనలు రోజురోజుకూ అవన్నీ పరస్పర ప్రభావ ప్రసరణకు

లోనవుతున్నాయని రుజువు పలుకుతున్నాయి. ఈ సంఘర్షణలో మేలుకలయికను సంతరించుకొన్నవి కొత్తరూపాలతో విజ్ఞాన రంగంలో అవతరిస్తున్నాయి. ప్రకృతి విజ్ఞాన శాస్త్రాలీవిధంగా కొత్త కొత్త సత్యాలను కనుగొనడటం వల్లనే భౌతిక తాత్విక దృక్పధం గతితార్కిక చారిత్రక భౌతిక తాత్వికతగా రూపొందింది. దాని నిరూపణకు నిలబడ్డవాడు మార్క్స్ గనుక అది ఆయన పేరుమీద మార్క్సిజంగా ప్రసిద్ధమైంది. అంటే మార్క్సిజం దేన్నీ మరొకదానితో సంబంధం లేని స్వతంత్ర ప్రతిపత్తితో వున్నట్లనుకోదు కర్తకర్మల సంబంధం క్రియాన్వయ సాపేక్షంగానే సార్ధకంగా అవుతున్నట్లు చెబుతున్న వ్యాకరణ తత్వాన్ని జీవితానికి అన్వయించి వివేకాన్ని పెంచడంలో అందరికంటే మార్క్సిస్టులదే ముందడుగు. కర్మార్థాల విషయంలో క్రియాచరణ శీలుడు కావడం వల్లనే మనిషి నిశ్చయజ్ఞానం పొందగలుగుతున్నాడు. పొందటమంటే ఏమిటి? మరొకదాన్ని దేన్నో పొందగలగటమే కదా! దేన్ని గురించిన జ్ఞానమైనా మనిషికి తాను ప్రకృతి శక్తులతో కుస్తీలు పట్టడం వల్లనే కలుగుతుంది. మనిషికర్త. ప్రకృతి శక్తులు కర్మార్థాలు.

కానీ వర్గ సమాజంలో బౌద్ధిక శ్రమ తాను వేర్పడి శారీరక శ్రమ ఫలితాలయిన కర్మలను తాననుభవించడానికి అలవాటుపడుతుంది. దీని ఫలితంగా రూపుగట్టుకున్నదే ఆనందానుభవం పరమాత్మదనీ, సుఖదుఃఖాలను ప్రసవించే కర్మ సంబంధం ఆయనకు లేదనీ, సుఖ దుఃఖాలననుభవించడం అది జీవాత్మ ధర్మమనీ చెప్పే వేదాంతం. బుద్ధి జీవులూ, శ్రమ జీవులూ తెలిసి ఒకరు తెలియకుండా ఒకరు దోస్తూ దోచుకోబడుతూ కలిసి బతుకున్న సమాజంలో సాంఘిక వాస్తవికత-జ్ఞానమూ, ఆచరణగా విడివడివున్నది. దాన్ని బట్టే చైతన్య పరిధుల్లో జీవాత్మ పరమాత్మలు వేర్వేరుగా గుర్తింపబడుతున్నారు. వాస్తవిక సాంఘిక జీవితానుభవాలనుండి సముత్పన్నాలయిన అన్ని విషయాల అవగాహనకూ, మొదట సాంఘిక వాస్తవిక అస్తిత్వం గురించిన వివేకం యొక్క ప్రాధాన్యాన్ని మార్క్సిజం గుర్తించింది. అలా ఉత్పన్నమైన విషయాలలో ముఖ్యమైంది తాత్వికదర్శనమే అదే ప్రపంచ దృక్పథం. అందువల్ల మొదట దాన్ని సాంఘిక వాస్తవికతకు సంబంధించినదిగా విచారించడానికి మార్క్సిజం పూనుకున్నది. సాంఘిక వాస్తవికత అన్నది ఆ సమాజంలోని మనుషుల భిన్నభిన్న జీవితాల యొక్క మొత్తంగా వుంటుంది. అది అనేక రకాలయిన శీఘ్రగతి మార్పులకు లోనవుతూ వుంటుంది. సమాజంలోని మానవ సంబంధాల లక్షణ జ్ఞానమే సామాజికవిజ్ఞానం. ఒకానొక నిర్దిష్ట యుగ రూపమైన కాలపరిమితుల్లో మానవ సంబంధాలను నిర్ణయించగల సాంఘిక అస్తిత్వ వివేకమూ, ఒక యుగాన్నుండి మరొక యుగానికి పోయేటప్పటికి ఆ సంబంధాలు మారడానికి వీలిచ్చిన అప్పటి సాంఘిక అస్తిత్వ పరిస్థితుల వివేకమూ కలిసి చారిత్రక భౌతిక వాద సిద్ధాంతాన్ని చేస్తున్నాయి.

యాంత్రిక భౌతికవాదంగానీ, భావవాదంగానీ ఒక్క తాత్విక దర్శనానికి మాత్రమే సంబంధించినవని అనుకోకూడదు. అవి శాస్త్రవిజ్ఞానంలోనూ వున్నాయి

మానవజాతి చరిత్రలోనూ ఉన్నాయి. వట్టియాంత్రిక భౌతిక దృక్పథంగలిగిన మనోవైజ్ఞానికునకు కవిత్వమంతా అదొకరకమైన ప్రవర్తనావిధానంగా కనిపిస్తుంది అదే విధంగా వచ్చిన తాత్వికునకు మానవ శరీరంలో విడిదిచేసిన జీవాత్మనకు స్వభావ సిద్ధంగా ఉన్న రసానుభవగుణానికి విషయంగా కనిపిస్తుంది భావవాద దృక్పథం కవిత్వానికి ఎంతో అనుకూలంగా వుంటుంది ఎందుకంటె భావవాదం చెప్పే సత్యశివసుందరత్రయంతో కవిత్వాన్ని వ్యాఖ్యానించవచ్చు యాంత్రిక భౌతికవాద కళా దృక్పథం కర్త్రర్థకమైన కళాకారుని సామాజికజీవితంతో సంబంధాన్ని తెగదెంపులు చేసి కళారూపాన్ని వట్టి కర్మార్థకంగా చూస్తుంది అప్పుడు కళారూప మొక్కటే చూపుకు విషయమవుతుంది గనుక, అందువల్ల రూపరచనా శిల్పంగురించి మాత్రమే తెలియవస్తుందిగనుక, ఆ తెలిసినదాన్ని బట్టే కళానిరూపణ సిద్ధాంతాన్ని తయారుచేస్తుంది అందులో కళాకారుని ఉనికిని గమనింపవలసిన అవసరంలేని కళారూపంలో కనిపించే రచనా శిల్ప విశేషాలను వర్ణించటం తప్పమరేమీ వుండదు ఇదే నిర్మాణ శిల్పసిద్ధాంతం

తాత్వికవిచారణలో యాంత్రిక భౌతిక వాదమెంతో, కావ్యకళావివేక విచారణలో నిర్మాణశిల్ప సిద్ధాంతమంత భావవాద కళాదృక్పథం కళారూపాన్ని ఆత్మాశ్రయంగా చూస్తుంది అంటే అది కళాకారుని మనోభావరూపమన్న మాట. అనుభవించేవాని విషయంలో కూడా అది అలాంటిదేనన్నమాట. తన చూపుకు ఆనినదాన్ని పట్టుకొని దానిమీద కళానిరూపణ సిద్ధాంతాన్ని తయారు చేయటా నికి భావవాద దృక్పథం ప్రయత్నిస్తుంది రసావేశరూపాలయిన మనోభావాలు అవి స్వభావసిద్ధాలై వుంటాయి గనుక ఇక వాటిని గురించి విచారించటాని కేముంటుంది? వాటి మంచిచెడ్డలు ఆత్మారామునికి తెలుస్తూనేవున్నాయి. అందువల్ల ఏరకమైన శిల్పకళా విశేషాలను గురించి ఎవరు విమర్శించినా అదివారి వైయక్తిక అనుభవ లక్షణం తప్పమరేమీ కాదు.ఇదంతా రసభావావేశ సిద్ధాంతం ఈ విధంగా అటుయాంత్రిక భౌతిక వాదమూ, ఇటు భావవాదమూ కూడా అశాస్త్రీయాలయిన ఆలోచనా ధోరణులతో తలక్రిందు సిద్ధాంతాలను సాహిత్యకళారంగాల్లో ప్రవర్తింపజేశాయి, చేస్తున్నాయి ఈ రెండింటికీ తోడు ఇంకా అనేకరకాలయిన ఉదారవాదమనీ, కళకళకోసమేననీ చెప్పుకునే సిద్ధాంతాలు కూడా ఆధునిక సాహిత్యకళావిమర్శనా భూముల్లో ప్రవర్తిస్తున్నాయి. ఇంత కలగాపులగంగా సాహిత్య కళా విమర్శనరంగాలున్నాయంటే మన ఆలోచనా విధానాన్నీ అందుకు మూలమైన అస్తిత్వాన్నీ పరీక్షించుకోవలసిన సమయమాసన్నమైనదనే అర్థం

సాహిత్య అధ్యయనంలో ముఖ్యంగా కావ్యశిల్పకళాధ్యయనంలో మనం కేవలం నిర్మాణ శిల్పసిద్ధాంతాన్నీ, రసభావావేశ సిద్ధాంతాన్నీ రెండింటినీ కూడా ఆ విధంగా అంగీకరించం మేమంగీకరిస్తామని ఎవరైనా అంటే మనకభ్యంతరంలేదు వాళ్ళు మేము కవులమనీ, సహృదయులమనీ మరేమని అయినా అనుకోవచ్చు

విమర్శకులమని మాత్రం అనుకోకూడదు. ఆ పనిచేయటానికి రాకూడదు. ఎందుకంటే అలా అనేవాళ్ళెప్పుడూ కావ్యకళాగర్భంలోనే కండ్లు మూసుకొని పుట్టని శిశుపిండాలుగా తిరుగుతుంటారు. కవైనా అంతే, సహృదయుడైనా అంతే ఆ దశలు దాటి బయటపడితే అప్పుడు కదా విమర్శనానికి అధ్యయనమూ విమర్శనమూనూ! అప్పుడు కావ్యకళాశిల్పఖండాలను వెలుపలినుండి చూడటానికి వీలవుతుంది. కావ్యకళారూపాలకు వెలుపల ఏమున్నది? సామాజిక చైతన్యమున్నది. వెలుపల నుండి చూడటమంటే ఈ చైతన్యం నుండి చూడటం. సామాజిక చైతన్యం ఒక్క కావ్యకళారూపాలనె ఉత్పత్తి చేస్తున్నదా? లేదే ఆర్థిక రాజకీయాలనూ, మత తాత్వికతలనూ, చరిత్రనూ, విజ్ఞాన శాస్త్రాలనూ కూడా ఆ చైతన్యమే సముత్పాదిస్తున్నది సామాజిక చైతన్యసంప్రదాయారూపాల ద్వారా మాత్రమే గ్రహించటానికి వీలుగా వుంటుంది. మరో రకంగా వుండదు. అందువల్ల కావ్య శిల్ప కళారూపాల విమర్శనకు తదితర సామాజిక చైతన్య రూపాల సంబంధ విజ్ఞానం అనివార్యమైన అవసరమే అలాగని ఆయా ఇతర విషయాలను తెచ్చి కావ్యకళా విషయాలను కప్పి వేయకూడదు ఆ అవసరాన్ని గుర్తించి అనుగుణంగా ప్రవర్తించే అచ్చమైన స్వాతంత్ర్యాన్ని విమర్శకుడు తనంతట తాను సంపాదించుకోవాలి. అది ఒకరిస్తే మరొకరు తీసుకోవటానికి వీలైంది కాదు. అలా వ్యక్తులు స్వతంత్రంగా స్వాతంత్ర్యాన్ని సంపాదించుకోవటానికి అవకాశమిచ్చే విజ్ఞానం చారిత్రక భౌతిక దర్శనం.

సామాజిక చైతన్య రూపాలు ఒక దానిమీద మరొక దాని ప్రభావాన్ని ఎలా ప్రసరింపచేసు కుంటాయో, ఆ చైతన్య రూపాల మొత్తం మీద సాంఘిక వాస్తవ జీవన అస్తిత్వప్రభావం ఎలా పడుతున్నదో, ఆ ఉపరితలం మీద ఈ పునాది నిర్మాణ ప్రభావంపడ్డట్లే, ఉపరితల చైతన్య ప్రభావం పునాది మీద కూడా ఎలా పడి మార్పుకు కారణమౌతున్నదో మనకు స్పష్టంగా గతితార్కిక చారిత్రక భౌతికవాద వివేకం విశదపరుస్తుంది. అందువల్ల దాని సిద్ధాంత బలం మీదనే మనం చైతన్య కళారూపాలన్నింటినీ సాంఘిక అస్తిత్వ సంబంధంతో విచారించాలి అది నిజమే అయినా అన్ని చేయలేం గనుక చేతనైన దొక్కటే చేస్తే చాలు. కవితా కళాతత్వం గురించి అలా శాస్త్రీయమైన విచారణ చేద్దాం ఎందుకంటే అది ఎంతో ప్రాచీనమైన గొప్ప చరిత్ర కలిగింది. అదెందుకో చచ్చుబడ్డ దానివలె ఈ కాలంలో చాలా వెనుకబడిపోతున్నది. అది అనేక రకాల మార్పులకు లోనవుతూ వున్నది. ఈ మార్పులన్నీ కవిత్వ కళయొక్క ప్రాచీన చరిత్ర గౌరవ మర్యాదలకు వ్యతిరేకంగా పోతున్నట్లు, అనేక సమస్యలను సృష్టిస్తున్నట్లు, అభివృద్ధి లక్షణానికీ, అభివృద్ధి లక్షణం కాని దానికీ భేదమే లేకుండా పోతున్నట్లూ, కవిత్వ కళాకారుల్లోనూ, విమర్శకుల్లోనూ విద్వాంసుల్లోనూ కనిపించే అలజడి తొలగటానికి కావలసిన అవగాహన నిమిత్తం కవితా కళాతత్వం గురించి చారిత్రక భౌతిక దృక్పథంతో కొంత విచారణ చేద్దాం

# కవిత్వం-సమాజం

## 1

కవిత్వమంతా భాషామయం. భాష సమూహం నుంచి సంఘం ద్వారా ఉనికిలోకివచ్చింది కవిత్వానికి భాష, భాషకు సమాజం మూలాధారాలు. అంటే కవిత్వానికి సమాజం మూలాధారమౌతోంది. కాబట్టి కవిత్వమర్థం కావాలంటే దాని పుట్టుకకు మూలమైన సమాజం అర్థంకావాలి. అసలా రెండూ రెండన్న చూపుతో చూడదగ్గవి కావు కానీ కావ్యవిమర్శన మన్నప్పుడు సాధారణంగా మూలాధారతత్త్వ విచారంతో దానికి సంబంధం లేదనుకోవడమే మనకలవాటు. కావ్యం అంటే కావ్యమే తప్ప మరేమీకాదు దానికి సమాజంతో పనిలేదు. ఆ ఆలోచనే అనవసరం అనవసరమేకాదు-అసందర్భంకూడాను-అని మనలో కొందరు భావించేవాళ్ళున్నారు వాళ్ళు కేవలం కావ్యరసాన్ని మాత్రమే ప్రశంసించదల్చినవాళ్ళు అంత వరకు బాగానే వుంది కానీ వాళ్ళు కావ్యార్థవివేచన రూపంతో విమర్శ మొదలు పెట్టినప్పుడు తమతలంపును మరచి, కావ్య కళాభూములకు చెందని చారిత్రక విషయాల్ని, మనస్తత్వశాస్త్ర విషయాల్ని, కవి జీవించినప్పటి బ్రదుకు తెరువుల విషయాల్ని, మొదలైన అనేక విషయాల్ని స్పృశిస్తూ, మధ్య మధ్య ఏమేమో విచారిస్తారు. ఇది మన నిత్యానుభవంలోని విషయమే. వాళ్లు తాము స్పృశించినవాటి ఉచితానుచితాలను సమన్వయంచేసి సమర్థించుకొనిపోవడం అవసరం అని కూడా అనుకోరు అలాంటి వట్టి కావ్యరసవాదులు విమర్శకులే కారు గనుక వాళ్లను మనమంతగా నిలదీయనక్కర్లేదు కేవలం కావ్యరసవాదులు అసలు కావ్యవిమర్శకులు కారు, కావ్యరసాస్వాదన లో మాత్రమే మునిగేచిత్తం వాళ్లది వాళ్లు కవులు కావచ్చును ఇంకాపోతే సహృదయులూ కావచ్చును కావ్యనిర్మాణదశా,

కావ్యరసాస్వాదన దశా అనే రెండింటినీ దాటాక, ఆ మీది దశ విమర్శనారంగం అందులోకి ప్రవేశించిన కవి కవికాడు సహృదయుడు సహృదయుడు కాడు అతడు విమర్శకుడు మాత్రమే అవుతాడు కళాఖండంలోపల వుండడం విమర్శకు పనికిరాదు లోపల నుండి బైటకు రావాలి అనుభవానికి లోపల, విచారణానికి బైటా, సంఘచైతన్యం యొక్క ఉత్పాదక శక్తి కళాఖండాల్ని ఉత్పాదిస్తున్నది కవిత్వం అట్లా ఉద్భవించింది కవిత్వానికి బైటనిలబడ్డం అంటే సంఘచైతన్యంలోకి రావడం 1 కళాఖండం యొక్క వెలుపల ఎప్పుడూ సంఘుచైతన్యం లోపలనే వుంటుంది ఇహ ఇప్పుడు విమర్శ అన్నది వట్టి రసాస్వాదనతో ఎలా భిన్నమైందో మనకు తెలిసివుండాలి కవిత్వంలాగానే విమర్శకూడా సంఘ చైతన్యంలో నుండి పుట్టింది కవిత్వం-విమర్శ-సమాజం-ఇదొక త్రిపుటి సమాజం నానావిధాలు. దాని ఉత్పాదక శక్తి నానావిధాలు, అందులోని ఉత్పత్తులున్నూ నానావిదాలు అంటే ప్రపంచం నానావిధాలు ఈ విధంగా సమాజంతో కవిత్వం ముడిపడిఉంది ఈ రెంటినీ సమన్వయించుకొని చేసే అధ్యయనమే అధ్యయనం కళల,కళా విమర్శనల మర్యాదలను ప్రకాశింపజేయడానికి సాంఘిక శాస్త్రాభ్యుదయ విజ్ఞానం అధికంగా దోహదం చేస్తుంది

## 2

మానవజాతి యొక్క అతి ప్రాచీనమైన రసానుభవ వ్యాపారాల్లో కవిత్వ రచన ఒకటి ఆదిమ మానవ సమాజంలో కవిత్వానికి వేరే ఉనికి (పృధగస్తిత్వం)లేదు ఆనాడు అదొక్కటే వుందనడం ఇంకా ఎక్కువ సమంజసం ఆనాడు మత చారిత్రక ధర్మవిషయాలన్నింటికి అదే వాహిక అది ఆనాడు లిపిరూపాన్ని పొందలేదు ఒక ఛందస్సు, ఒక లయ కల్గివుంటూ సమాజ జిహ్వాంచలాలపై ఉండేది అది మన భారతీయ వేద వాఙ్మయమంతా-చరిత్రకందని రోజులనాటి మన పూర్వ సమాజం సముత్పాదించిన కవితావస్తు సంభారమే అది ఛందోలయలతో కూడివుండడం మూలాన కవిత్వమే అవుతోంది ఇట్లాగే గ్రీకు, స్కాండినేవియన్, ఆంగ్లోసాగ్జన్, రోమన్, చైనా, జపాన్, ఈజిప్టు మొదలైన జాతులు సంరక్షించుకొన్న వారి ప్రాచీన వాఙ్మయాన్ని చూస్తే అది మన వేద వాఙ్మయంలాగానే ఛందోబద్ధం, లయాన్వితంఅయి, బహుళార్థ విషయవాహకంగా వుండడం గమనించవచ్చును

అట్లా ఛందోబద్ధం,లయాన్వితమూ అయిన దానిని మనం కవిత్వం అంటున్నాం ఆనాటి వాళ్లు దాన్ని ఏమనుకొన్నారో మనకు తెలియదు అది నిత్యవ్యవహారంలో ఉపయోగించే భాషకంటే, ఉదాత్త గంభీరమైనబాష అక్కడ వుండటం చేతనే దాన్ని మనం కవిత్వం అంటున్నాము 2అయితే ఆ భాష(ఉక్తి)

అట్లా ఉదాత్త గంభీరంగా ఎట్లా తయారైంది? ఛందోబద్ధత వల్ల అట్లా తయారైందా? అవును ఛందస్సు చేత, దానితో వచ్చిన లయతాళగతిచేత, యమకాది శబ్దాలంకారాలకు తావివ్వడం చేత, పాదమాత్రల నియమంచేత, యతిప్రాసల లాంటి ప్రత్యేకమైన లక్షణాలననుసరించడం చేత అందులోని బాష ఉదాత్త గంభీరంగా రూపొందింది. అందువల్లే ఆ భాష నిత్యవ్యవహారం నుండి భిన్నమయింది. భిన్నమయ్యింది కనుకే నిత్యవ్యవహారంలోని దానికంటే దానికి సహృదయహృదయాకర్షక శక్తి ఇబ్బడిముబ్బడిగా వుంది. మొట్టమొదట ఛందోలంకారాలకూ, కవిత్వానికీ ఎలాంటి విడదీయరాని సంబంధం వుండిందో ఇప్పుడిక ఆలోచించాలి. ఛందోబద్ధంగా వుండడమే అది కవిత్వంగాగుర్తింపబడ్డానికి హేతువు. ప్రపంచంలోని ప్రాచీన వాఙ్మయాలన్నీ కవితామయాలే- అంటే ఛందోమయాలన్నమాట. మన వాఙ్మయం సంగతి మనకు తెలుసు. ఈజిప్టులో ప్రాచీన ఖగోళశాస్త్ర విజ్ఞానం ఛందోబద్ధమయివుంది. ప్రపంచంలోని మతాలన్నీ తమతమ అవసరాలకు లయతాళగతివున్న భాషనే వాడుకొన్నవి అన్ని మతాలూ భక్తిభావ ప్రచార ప్రబోధాల్ని లయాన్విత భాష ద్వారానే చేసినవి ఉదాత్త గంభీరమైన ఆ భాష ప్రాచీన ప్రపంచ జాతులసంస్కృతీ సంప్రదాయాల్ని నిలబెట్టేభారం వహించింది ఛందస్సువల్లే అది ఆ పని చేయగల్గింది. అది నిత్యవ్యవహారంలో అందని అందాలున్న భాష, అలాంటి భాషామయత్వం వల్ల అది కవిత్వం

లయతాళగతి సాధించడంవల్లకదా భాషను మనముదాత్త గంభీరం చేస్తున్నది సంగీతనృత్యాలకు లయతాళగతులు సంబంధించినవి మరి ఇంతవరకేమో అవి కవిత్వభాషకు సంబంధించి వున్నట్లు మాట్లాడుతున్నాము భాషను విడిచిపెట్టిన సంగీత నృత్యాలు లేవు. అవన్నీ కవిత్వం లాగానే భాషామయాలు.

కవిత్వ సంగీత నృత్యాలకు లయతాళగతులు ప్రాణాలు. ఇవన్నీ భాషామయాలు భాషనుదాత్త గంభీరంగా చేయడం-ఆ ఉదాత్తత ఉట్టి పడేటట్లుగా చదవడం-వాటిని ప్రత్యక్షంగా కల్పించడం-అనే ఈ వరుసలో **కవిత్వం-సంగీతం-నృత్యం-** అనే మూడూన్నూ ఆదిమ మానవ సమాజంలో ఏకరూపంగా కలిసే సాగినట్లు కనిపిస్తున్నవి. అసలవి కలిసి ఏకరూపంలోనే పుట్టినవి. ఆదిమ మానవ సమాజంలో ఉచ్చై స్వరంతో గొంతెత్తడం, చిందులు త్రొక్కడం, మధ్యమధ్య ఈలలు వేసి పొలికేకలు పెట్టడం, కర్రసాము, కత్తిసాముల ప్రదర్శనలలో చప్పుళ్లు చేయడం-ఇవన్నీ వారికవితా సంగీత నృత్యప్రదర్శనాలే.

మానవ సమాజ ప్రాధమిక దశలో సంగీత నృత్యాలతో సంబంధించే కవిత్వ భాష వుంది ఆ కాలంలో ముఖ్యంగా కవిత్వమూ, సంగీతమూ రెండుగా

లేవు. వీటి ఏకరూపత్వం గ్రీకు కావ్య ప్రక్రియల్లో చూడవచ్చు, ప్రాచీన గ్రీకు కవిత్వం సంగీతంతో ముడిపడివుంది. ఆనాడు వాద్యసంగీతం లేనేలేదు. అంతా శాబ్దికమే. సంగీతం కోసమని చెప్పి కవిత్వం కూర్చిన కాలం అది.

దీనినంతా బట్టి మనం గ్రహించాల్సిందిది ఆదిమ సమాజంలోని ఉదాత్త గంభీరమైన ఒక రకం భాష నుండి క్రమంగా అభ్యుదయ పరిణామాల్ని చెంది చెంది నాగరకత వెలసిన సమాజంలో లిఖిత వాఙ్మయం వెలుగులోకి వచ్చింది. ఆయా జాతిజనులు నాగరికులయి, కావ్యతత్వజ్ఞత్వాన్ని పెంచుకొని క్రమంగా ఆ ఉదాత్త గంభీరముద్రవున్న భాషలోని విశేషాల్ని తెలిసికొని, తర్వాత దానిని, దేనికి బడ్తే దానికి వాడకుండా, ప్రత్యేక శ్రద్ధతో కాపాడుకుంటూ దాన్ని ఒక్క కవిత్వానికే ఉపయోగిస్తారు. ఆయా యుగాల్లో ఆ భాష సామాన్య జనుల నిత్యవ్యవహార భాషకి అతీతంగా వుంటుంది. ఆదిమ మానవ సమాజంలో బహుళార్థ సాధకంగా ఉపయోగపడిన గంభీరోదాత్తమయిన భాష క్రమంగా నాగరికత పెరిగిన యుగాలలో ఒక్క కవిత్వ భాషగా మాత్రమే నిలిచిపోతున్నది. అంటే నాగరకయుగంలో ఛందోబద్ధత్వం కవితాలక్షణం అని స్పష్టపడుతోంది. ఇలా నాగరికత ముందుకు సాగిపోతున్న కొద్దీ ఈ ఛందోబద్ధమైన గంభీరోదాత్త భాష పది పనులకి పనికిరాక ఒక్క కవిత్వానికే వాడబడ్తూ సంకుచిత ప్రయోజనం ఉన్నది మాత్రమే అవుతుంది

## 3

అది పుట్టిన దేశకాలాల సాంఘికవ్యవస్థ నుండి కవిత్వాన్ని వేరు చేయడానికి వీలు లేదు. సాంఘికమైన నాగరికత, దాని ఆర్థిక ఉత్పత్తి శక్తిని బట్టి వుంటుంది కాబట్టి కవిత్వం కూడా ఒక రకపు సాంఘిక అర్థసంపదకావాలి అది సమాజంసొత్తు.

ఆదిమ మానవ సమాజంలో మానవులు గుంపులు కట్టి జీవిస్తూ, వారివారి లింగవయో భేదాల కనుగుణమైన సాంఘిక క్రియా కలాపాలల్లో పాల్గొన్నారు. అప్పుడు ఒక్కొక్క వయస్సులో ఉండే స్త్రీ పురుషుల సాంఘికక్రియాకలాపాల్లో భేదం అంత పెద్దగా వుండేది కాదు. అందువల్ల వారివారి నిత్యవ్యవహారాల్లోని భాష, కవిత్వ రచనాపటువైనబుద్ధి, ఆనందించే అనుభవశక్తి-ఈ మొదలైనవన్నీ అలాగే భేదం లేక వుండేవి. కాబట్టి ఆనాడు కవిత్వమెట్లా తన ఉత్పత్తి విషయంలో సమాజపరమో అనుభవం విషయంలో కూడా అట్లాగే సమాజపరం గుణకర్మ విభాగం(శ్రమవిభజన)ఏర్పడ్డాక వ్యక్తుల మధ్య ఆర్థికమైన హెచ్చుతగ్గులేర్పడ్డవి. ఆ హెచ్చుతగ్గుల్నిబట్టే వాళ్లవాళ్ల వ్యక్తిత్వాల్లో తారతమ్యం చోటు చేసుకొంది. ఆదిమ మానవ సమాజంలో ఇట్లాంటి తారతమ్యం లేదు వాళ్ల వ్యక్తిత్వం వాళ్ల ఒడ్డు పొడుగులకు మాత్రమే సంబంధించిందానాడు అది వర్గ రహిత సమాజం కావడం

చేత సామాజికులందరూ కూడా సాంఘిక క్రియా కలాపాల్లోలాగానే ఆలోచనా క్రియా కలాపాల్లో కూడా సమానంగానే పాల్గొనే వాళ్లు, వాళ్లకి ఆలోచనల్లోనూ, అనుభూతుల్లోనూ కర్మల్లోలాగే సామ్యం ఎక్కువ. అలాంటి సంఘంలో వాళ్ళు - పదికాలాలపాటు నిలబెట్టుకోదల్చిన సామూహికమైన విజ్ఞానాన్నీ, అనుభూతుల్నీ గంభీరోదాత్తమైన భాషలోనే వ్యక్తీకరించారు ఆ విధంగా మొదట కవిత్వం నాగరికత వల్ల వర్గ భేదానికి గురికాని సంఘ సామూహిక శక్తి గర్భాన్నుండి సముత్పాదితమయింది గంభీరోదాత్త భాషలో అయింది అలాంటి భాష యుగాల మీద సాగి క్రమంగా పల్చబడి చరిత్రగా, వేదాంత శాస్త్రంగా ధర్మశాస్త్రంగా, భౌతిక శాస్త్రంగా, ఖగోళశాస్త్రంగా అనేక విధాలుగా ఇలావిడిపోతుంది. ఇలా విడిపోయిన ఆయా విజ్ఞానశాఖలు తమ అవసరాల్ని బట్టి కొత్త పదజాలాన్ని సృష్టించుకొంటాయి. అలా సృష్టించుకొన్న పద సముదాయంతో ఉండే భాష నిత్య వ్యవహార భాషలాగా వుండదు

ఇంతవరకూ గంభీరోదాత్తమైన భాష అని మనం అనుకొంటున్నది చందోగతి విశేషంతో వుంటుంది. సహజంగానే నిత్య వ్యవహారంలోని భాషకు లయ తాళ గతి ప్రత్యేకంగా ఉండదు కవిత్వంలో అది ప్రత్యేకంగా ఆపాదితమౌతుంది అలా ఎందుకు ఆపాదితమవ్వాలి? ఛందోలంకారాల వల్ల భాష వికృతమవుతుంది. సహజ సౌందర్యం పోతుంది. ప్రతిబంధకాలు లేని వ్యవహారభాషకంటే కృత్రిమమయిన కవిత్వభాష తేజోహీనంగా కన్పిస్తుంది అయినప్పుడు భాషను ఛందోమయం ఎందుకు చేయాలి? ఇట్లా ఆలోచించడంలోనూ తప్పు లేదు దీనికోరకమైన సమాధానం వుంది ఒక విషయాన్ని సులభంగా జ్ఞాపకం పెట్టుకోవడానికి ఛందస్సు సమకూర్చే లయ సాయపడ్తుంది ప్రాచీన భారతీయ విజ్ఞానమంతా కూడా లిఖిత రూపాన్ని పొందకుండానే విద్వాంసుల జిహ్వాంచలాలమీద కొన్ని వేల సంవత్సరాలు పొల్లుపోకుండా నిలబడి రావడానికి -ఆ విజ్ఞానానికి వాహకమైన భాషఛందోమయమయ్యి లయ తాళగతులు కలది కావడమే హేతువు అంతేకాకుండా శ్రోతల చిత్తాన్ని ఏకాగ్రంగా వుంచడానికిన్నీ భాషలోని లయ తాళ గతి లక్షణం ఎక్కువగా దోహదం చేస్తుందనడం కూడా సత్యమే అన్నింటకంటే ముఖ్యమైన మాట ప్రాచీన కవిత్వాలు చావకుండా ఇంతకాలం బతికి బట్టగట్టి మన దాకా వచ్చినవంటే అందుకు ప్రధాన కారణం ఆ గంభీరోదాత్తమైన లయ తాళ గతి కల భాష దానికి వాహకం కావడమే

మనం ముఖ్యంగా గమనించాల్సిన అంశం ఇంకోటి వుంది ప్రతి యుగంలోనూ సాధారణంగా పరిపూర్ణపక్వబుద్ధులు కాని వారే గొప్ప కవిత్వాన్ని సృష్టిస్తున్నారు వివిధ సాహిత్య ప్రక్రియల్లో పనిచేస్తున్నారు కవిత్వం మానవుని సహజాతమైన వైయక్తికత్వాన్ని విలక్షణంగా ప్రకటిస్తుంది దీనికి నవల విస్తృతమైనంప

మానవుని సాంఘిక వ్యక్తిగా, అంటే సంఘం ఎట్లా గుర్తిస్తుందో అట్లా ప్రకటిస్తుంది. వర్గ సమాజంలో ఆర్థిక తారతమ్యాల మూలంగా వ్యక్తుల అంతస్తులు గుర్తింపబడ్డాయి అట్లాంటి సంఘంలో కవిత్వం వెనుకబడి నవలముందుకు వస్తుంది అందువల్లే ఈ కాలంలో కవిత్వాభిమానం దిగనాసిల్లిపోతోంది. నవలా రచన పుంజుకుంటోంది. కవిత్వం సహజ ప్రకృతిక సమాజశక్తి తేజోగర్భం నుండి వెలువడింది పసిచెడిన ఆధునిక సంస్కృతీ సంప్రదాయాల సమాజపు సంతానం నవల[3]

ఆదిమ మానవ సమాజంలోని గంభీరోదాత్తమైన కవిత్వభాష కాలక్రమాన వికార పరిణామాలకు లోనయి చివర చివరకు వట్టి వచనరీతి భాషగా అయి చరిత్ర, తత్వశాస్త్రం, కథ, నాటకం, నవల ఈ విధంగా సాహిత్యం తయారైంది. ఆదిమ మానవ సమాజంలో లయ తాళ గతికమైన గంభీరోదాత్త భాష ఒక్కటే అన్నింటికీ వాహకమైనట్లు క్రమ పరిణతి చెందిన నాగరక సమాజం పండిన దశలో అన్నింటికి వక్రగతిలేని అచ్చమైన వ్యావహారికాగంధంతో వుండే వచనం వాహకమౌతుంది. ఇది శాస్త్రీయ దృక్పధాన్ని పెంచుకొన్నది. ఆవేశపుటార్భాటపు పొంగులు లేనిది, ఆదిమ మానవ సమాజంలో భావోద్వృత్తి కవిత్వహేతువు. ఆధునిక సమాజంలో వాస్తవికత తీరుతెన్నుల్ని అవగాహన చేసుకోవడం కవిత్వ హేతువు. దీనికి రాగతాళ లయాన్వితమైన భాష అక్కరలేదు ఆవేశాట్టహాసపుటూపుతో సంఘాన్ని ఊపడానికి, పూనకం తెప్పించడానికి అలాంటి భాష కావాలి. విషయాన్ని అవగాహన చేయించా లంటే శ్రోతల్ని ప్రబోధించాలి కార్యోన్ముఖుల్ని చేసి ప్రోత్సహించాలి లాభనష్టాల్ని బేరీజు వేసిచెప్పాలి.అందువల్ల ఆధునిక సమాజంలో కవిత్వం,భాష ఆదిమ సమాజం కన్నా విభిన్నమైంది. అది ఛందస్సుతో పద్యం ఇది ముక్తఛందమైన వచనం

దైనందిన సామాజిక వ్యవహారంలో శబ్దాలకుండే భావ తీవ్రతాభివ్యక్తి లక్షణం మానవానుభవంలో ఉంది అవసరం వచ్చిందన్నపుడు అనుభవాన్ని బట్టి మానవుడు అలాంటి అభివ్యక్తి శక్తి ఉన్న శబ్దాలను ఎన్నిక చేసి తాళలయానుబద్ధంగా వాటినొక క్రమంలో కూర్చి, చదవగల్గిన వాళ్ళు దాన్ని చదవడం చేత శ్రోతలు ఆ భావ తీవ్రతను అనుభవించేటట్లు చేస్తున్నాడు దానికే సంగీతమూ నృత్యమూజోడించినప్పుడు దాని దీప్తి ఇంకా అధికమౌతుంది ఈ విధంగా మొట్టమొదట కవిత్వాన్ని ఛందోబద్ధమైన లయ తాళ గతులతో కూడుకున్న భాష నిలబెట్టింది. సామూహిక భావావేశాల్ని కవితాకళ సక్రమమార్గంలో నడిపించింది పండగల్నీ పబ్బాల్నీ కేంద్రంగా చేసింది. కాకుంటే అవే ఆదిమ సమాజంలో కవిత్వాన్ని తయారు చేసినవని చెప్పినా చెప్పవచ్చును.

*సమాజం*

ఆదిమ మానవ సమాజ కవిత్వం ముఖ్యంగా పాట4. అది దాని రాగతాళ లయల్తో సమూహం మీద సమాజాన్ని భావోద్వృత్తి చైతన్యం కలదాన్నిగా చేసేది ఆ భాషలోని రహస్యమే అది ఆ విధంగా అది తప్పెట్లతో తాళాల్తో పండుగలు పబ్బాలు నడుమ నడుమ తెచ్చే సమధికోత్సాహంతో పాటలుగా పదాలుగా సంగీతంగా నృత్యంగా వందలు వేలు సంవత్సరాలు సాగింది.

ఆదిమ సమాజంలో సమూహం మీద భావోద్వృత్తి చైతన్యం ఎట్లా కల్గింది? ఎట్లా అంటే - పెద్దపులి కన్పించింది. శత్రువు వచ్చాడు. గాలి, గాలివాన ఈడ్చి కొట్టినవి భూమి కంపించింది ఈ అన్నింటికీ ఆయా గుంపులు కట్టిన జనసమూహం గుంపులు గుంపులుగానే భయపడ్డారు. ఆ భయం ఆ గుంపుకంతా సమానమే నాగరికత పెరిగిన సామాజిక జీవితంలో అలాంటి భయహేతువులు లేనప్పుడు దానిని కల్పించడానికి ఒక సాధనముండాలి ఆదిమ మానవుని సమాజపు నిత్యజీవిత సత్యం నుంచి కవిత్వం పుట్టింది నాగరికత పెరుగుతూ సమాజాన్ని సత్యం నుండి మిధ్యాభూములు పట్టిస్తుంది. సమాజాన్ని బట్టి దాని ఉత్పాదనశక్తి, దానినిబట్టి కవిత్వం, మొత్తం ఆ విధంగానే వుంటుంది

ఆదిమ మానవ సమాజం సామూహిక భావోద్వృత్తులు గంభీరమైన భాషలో వ్యక్తమై కవిత్వంగా మార్పు చెందినవి. దానివల్ల ఆనాడు వాళ్ళకు వాళ్ళ పనిపాటలు ప్రీతిపాత్రాలయ్యాయి. శ్రమ అనిపించక వారి మనస్సులు ఆనందించాయి ఆ విధంగా కవిత్వం ఆనాడు ఆ సమాజపు కార్మికశక్తిని ఇనుమడింపచేసింది అది సామూహిక ప్రయోజనం కనుక ఆ కవిత్వం సామూహిక బావోద్వృత్తుల్నే తనకు విషయాలుగా చేసికొంది. కామక్రోధాది భావావేశ ప్రవృత్తుల్ని సమాజానికి శ్రేయోదాయకాలుగా చేసి కవిత్వం చూపింది దాని ప్రయోజనం అది పరంపరగా అట్లా కవిత్వం సమాజం యొక్క ఆర్థిక స్థోమతను పెంచే సాధనమౌతుంది.

## 4

శ్రమ విభజన ఎక్కువౌతున్నకొద్దీ కవిత్వం వాస్తవ జీవితం నుంచ దూరమౌతున్నది. వాస్తవజీవితం వట్టి పని పాటలతో నిండి ఉంటుంది. అప్పుడు కవిత్వానికి పనిపాటలతో సంబంధం వుండదు - అది జీవిత విశ్రాంతి కాలంతో సంబంధం పెట్టుకొంటుంది. అలాంటి సమాజంలో కవి సామాజికుడు కాడు ఏకాకి ఆ ఒంటరితనంలో అతడు రాసే కవిత్వం భావగీతాలవరకే మితిమీరిన శ్రమవిభజన పద్ధతి సమాజానికి సోమరితనాన్ని అలవాటు చేస్తుంది సోమరిపోతులు బ్రతుకుతున్న సమాజంలో ఉత్పత్తి అవుతున్న కవిత్వం శ్రమజీవనానికి దూరమైంది

అది అట్లాకావడంవల్ల అటు కవితా కళకూ ఇటు శ్రమజీవనానికీ - రెండింటికీ నష్టమే. కాని ఇక్కడో చిత్రం వుంది. అట్లా కవిత్వం సాంఘిక ప్రయోజన శూన్యమై నష్టపోయే కాలంలో దాని రచనా శిల్పం మాత్రం చిత్రాద్భుతాపాదకమయ్యి అపూర్వశోభతో మనోజ్ఞమవుతుంది.

సమూహంమీద అనుభవించిన భావోద్వృత్తులు ఒంటరితనంలో మానవుని విడిచిపెట్టక అంటిపెట్టుకునే ఉంటాయి. అందువల్ల ఏకాంతంలో భావగీతాలాలపిస్తున్న కవి ఎప్పుడోతాననుభవించిన సమసమాజం యొక్క అనుభూతుల్నే నెమరువేస్తున్నాడనుకోవాలి. ఆవిధంగా కవి తన సోదర జనసమాజంనుంచి కళా ప్రపంచంయొక్క ఏకాంతభూముల్ని ప్రవేశించటం, ఇంతకుముందుకంటే తన జాతి జనులతో ఇంకా ఎక్కువ సన్నిహితంగా ఉండాలని కోరే చేస్తాడు. రతి విషయం, ఋతు శోభ, సూర్యచంద్రోదయాస్తమయాదులు, కోకిలపాటలు, మందమారుతం, కొలనులు, పద్మాలు, తుమ్మెదలు - మొదలైన వాటికన్నింటికీ సంబంధించినట్టి సమసమాజం యొక్క అనుభూతులు, తరతరాలుగా అనుభవింపబడ్తూ ఆ చారిత్రక భావోద్వృత్తుల యొక్క ఇప్పటిమన ఛాయానుభూతుల్ని ఇంకా ప్రేరేపిస్తున్నవి.

శ్రమ విభజన ఫలితంగా సమాజం వర్గాలుగా, వర్ణాలుగా విడిపోయింది. పాలకులు-పాలితులు అనే రెండు వర్గాలు మొట్టమొదట ఏర్పడ్తవి వీటితోపాటు కీలకస్థానాన్ని ఆక్రమిస్తూ పురోహిత వర్గం లేస్తుంది ఈ సమాజంలో కవిత్వం రాజుల్నీ, దేవతల్ని, దైవాంశ సంభూతుల్నీ, అవతార పురుషుల్నీ ఆశ్రయిస్తుంది. ఇదే పురాణేతిహాసాల రచన జరిగే కాలం ఆ ప్రభావంతో కొన్ని వందల సంవత్సరాలు సాగుతవి, అనేక విధాలైన మార్పులు వస్తవి అలా అది భావగీతాలవరకు వస్తుంది ఆ భావగీతం ఆదిమ మానవసమాజంలోని కవిత్వానికి భిన్నమైంది అదేమో సాంఘికుల యొక్క సాధారణభావాభివ్యక్తి ఇదేమో వైయక్తిక భావాభివ్యక్తి.

సంఘంలోని సామూహిక భావోద్వృత్తే ప్రపంచం కళా ప్రపంచంలో బావోద్వృత్తి శబ్దచిత్రాలతో వుంటుంది ఆ శబ్ద చిత్రాలు నిత్యజీవిత అనుభవంచేత కల్గుతవి ఆ అనుభవాలు సర్వసాధారణాలు అనేక రకాల అనుభవాలు కలవడం అనేది సంఘజీవిత విధానం విస్తరించడాన్ని బట్టే జరుగుతుంది. సంఘజీవన అభ్యున్నతిని అనుసరిస్తూ సర్వసాధారణంగా ఉన్న భావోద్వృత్తులు మారుతవి మానవుడు తాను ప్రకృతి మార్పుల్తో సర్దుకొని పోవడానికి సాంఘికంగా తనని తాను మార్చుకొంటాడు పరిసర ప్రకృతి వాతావరణంతో ఇమిడి బ్రదకడానికి తాను కొట్టుమిట్టాడ్తున్నప్పుడు మానవుని కవితావేశం అతని బ్రతుకుతెరువుని అంటిపెట్టుకొనే వుంటుంది అలా ఉండే కాలంలో కవిత మానవుని ఇహలోక కవాటాన్ని బద్దలు

కొట్టి ప్రవేశిస్తున్నది ఆ లోకం - దిన దినగండమైన ఈ లోకంకంటే శ్రేష్టమైంది. ఇంతకంటే కూడా ఇంకా సత్యమైంది నిజానికి దాని సంగతి మనకు తెలియదు. తెలిసికోవడానికి ఈ మాయా మోహనమైన కవిత్వమే ద్వారం. దీనిద్వారా ప్రవేశిస్తేనే ఆ సత్యం దర్శనీయమౌతుంది. ఆటపాటల్లో అందులోని శ్రమానుభవాన్ని కప్పిపుచ్చకపోతే అసలా కోతపనులకూ, నాట్ల పనులకూ జనం మొగ్గేవారేకాక పోవచ్చును ఆ పాటలవల్ల మనస్సులు తేలికపడి పనులుకూడా సులభ సాధ్యాల యినవి అంటే కవిత్వం. ముందు ఒక సత్యాన్ని ప్రదర్శించడం ద్వారా, దాని వెనుక మరో సత్యాన్ని ప్రాదుర్భవింపజేస్తుందన్నమాట. నిజానికి అది వరుసక్రమంలో రెండవదయినా పరమార్థం దృష్ట్యా అది అద్వితీయమైంది. దుర్గమమైంది సంఘ సామూహిక భావోద్వృత్తి లక్షణాన్ని ప్రకృతి వాతావరణంతో సంబంధించి కిందిమీద బడే ఎప్పుడూ కవిత్వం వర్ణిస్తుంది అత్యంత సూక్ష్మంగా వ్యక్తీకరిస్తుంది మనిషి గుడ్డిగా ప్రవర్తించే విషయాలు కవిత్వానికి విషయాలు కావు తెలిసి ప్రవర్తించే అర్థ సంపాదక విషయాలే కవితా విషయాలు ఇది ఇదీ అని చెప్పడానికి వీలుకాని అవ్యక్త మధురవిషయాలు కవితా విషయాలు కావు. తెలిసీ తెలీని ఏదో మగతలో పారకుణ్ణి వదలడం కవిత్వలక్షణంకాదు. దాని ప్రధమ లక్షణం స్పష్ట ప్రతిపత్తి. అది సంఘసామూహిక భావోద్వృత్తి చైతన్యానికి ప్రతిబింబం. సంఘం బింబము చేతనలో ప్రతిఫలించిన ప్రతిబింబమే కవిత్వం బింబం సత్యమైంది. ప్రతిబింబము మాయామోహము సంఘం బింబము. సంఘశక్తి పేరు చైతన్యం చైతన్యంలో సంఘం యొక్క సామూహిక భావ ప్రతిబింబమే కవిత్వం.

## 5

మతాలు పుట్టుకొచ్చాయి భౌతిక ప్రపంచం కంటే మత ప్రపంచం భిన్నమయింది. సంఘం యొక్క సామూహికమైన కవితా రసాస్వాదన మోహం క్రమంగా వ్యక్తి నిష్ఠమౌతుంది సాలెగూడులాగా అల్లుకొని ఏర్పడే సంఘ గర్భంలోనే ఆ మోహలక్షణ రహస్యం బీజరూపంలో వుంది క్రమంగా అది ఇంకా మతాన్ని చుట్టుకొని విపరీతంగా - విస్తారంగా- పెరుగుతుంది

మానవుని స్వాత్మ(సామాజిక) చైతన్యమే కవిత్వం[5] ఆ చైతన్యం కేవలం వ్యక్తి నిష్ఠమైందికాదు సర్వసాధారణమైన భావోద్వేగ ప్రపంచంలో మిగిలిన అందరితోబాటు తానున్నూ ఒక భాగస్వామి కాగల్గేవాని అంతస్సత్వ చైతన్యం- అది సంఘంలోని సామూహికోద్రేకం పిడుగుపాటు, గాలివాన మొదలైనవాటివల్ల కల్గుతున్నది అందువల్ల అది భౌతికసత్యం.

అయితే ఆదిమ మానవ సమాజంలో భావోద్రేకం, భౌతిక సత్యమేనా? లేక మాయతో కూడుకొన్న ఒక ఆదర్శమా? నిజానికి అది అక్కడ ఈ రెండున్నూ కాదు

అది ఒట్టి సాంఘిక సత్యం మాత్రమే. మానవ సహజాతాలైన కామక్రోధాది రజస్తమో గుణాత్మక భావాలకున్న సాంఘికమైన చెలామణికి ఆనాటి భావోద్రేకం నిదర్శనం కావ్యకల్పనం సాంఘిక ప్రతిబింబము

కవి సృష్టించే కాల్పనిక ప్రపంచంలోని అన్ని సాహిత్య ప్రక్రియలున్నూ - పురాణ, ఇతిహాస, కావ్య, నాటకాలు - మొత్తంమీద ఒక సాంఘిక సత్యాన్నే పరమార్థం చేసి చెపుతవి. సాంఘిక సత్యం అంటే ఇంతకుముందు సూచించిన సహజాతాలకూ సంఘానికీ ఉన్న సంబంధమేనని అర్థం చేసుకోవాలి. అది ఇంకా కూడా వైయక్తికం కాకుండా సమసామాజికం కావాలి. సమసామాజికం కావడం కోసరమే ఆ సంబంధం లయాన్వితమైన ఉదాత్త గంభీరభాషలో అభివ్యక్తంకావటం. కాని అభివ్యక్తమైనంత మాత్రంలో అది కవిత్వంకాదు. పిల్లనగ్రోవి వెదురుబొంగుకు రంధ్రాలు వేశారు. రంధ్రాలే సంగీతంకాదు గాలినూది వాయిస్తుంటే శ్రోతకు ఏది అనుభవానికి వస్తుంటుందో అదే సంగీతం. అట్లాగే ఎంతటి భావోద్రేకాలు ఎంతటి భాషలో ఎంత జాగ్రత్తగా పొదగబడినా[6] - నిజం మాట్లాడ్తే- అప్పుడది కవిత్వం కాదు. దాన్ని ఉచ్చారణ దక్షుడైనవాడు చదివి చూడాలి అప్పుడు దాన్లోని కావ్యసౌరభాలు గుబాళిస్తాయి. చదువుతూన్నప్పుడే కావ్యం జీవిస్తుంది. చదవడం అంటే పైకి చదవడమనే అర్థం.

సంఘాన్ని గూర్చి, దాన్తో తనకున్న సంబంధాన్ని గూర్చి మానవుడికి వుండే వ్యాకులమైన విజ్ఞానమే ఆదిమ సమాజంలో కవిత్వం.

భావోద్వృత్తులు స్వాత్మగతాలు కావడం వల్ల అవి మానవుడికి తన అదుపులో వున్నట్లే అగుపడ్తాయి. అందువల్లే భావోద్వృత్తుల మూలతత్వం ద్వారా మానవుడు బాహ్య జగత్తు మీద అధికారం చేయగల్గుతున్నాడు. మానవుడు తన వ్యష్టి సంకల్ప బలంచెత భౌతిక సత్యం ఐన ప్రకృతిని నియమించగల్గుతున్నాడు మంత్రతంత్ర క్రియాదులచేత. ప్రయోగాదులచేత తాను సంకల్పించినదానికి అనుగుణంగా భావోద్రిక్తతల్ని ప్రేరేపించి తన పని ఈడేరింది (ఫలించింది) అనుకొంటున్నాడు. అందువల్లే అతడికి-అంతర్ముఖత్వాన్ని పెంచుకొంటే భౌతిక సత్యాలైన ప్రకృతిని అదుపులొ వుంచి నడిపించగల్గుతాను- అని ఇంకా అనిపిస్తోంది ఈ ఆలోచన సశాస్త్రీయమయి, ప్రవృత్తి కర్మకు మార్గదర్శకమైనదయినప్పుడు మానవుడు నిజంగా అంత పనినీ చేసి తీర్తాడు.

సంఘమంటే వ్యక్తిని చుట్టుకొని వున్న వాతావరణం. ఆ వాతావరణానికి సహవాసి జనసమూహం, సంఘం సంఘం యొక్క తొలిరోజుల్లో మంత్రతంత్రాలు. మతాలు కలగాపులగంగా వుంటాయి ఆ కాలంలో సంఘాభివృద్ధి చాలా స్వల్పంగా వుంటుంది

మంత్రతంత్రాలు బాహ్యజగత్తును కొన్ని నియమాలకు లోబర్చుకొని నిలపడానికి చూస్తాయి. బాహ్యజగత్తేమో ఎదురు తిరుగుతుంది దానివల్ల మాంత్రికుడికి జగత్తు యొక్క తిరుగుబాటు లక్షణం, దృఢవైఖరీ, చక్కగా అర్థమౌతాయి. అలాంటి దృఢ వైఖరితో వున్న ప్రకృతిని ఎదుర్కోవడానికోసం ఇంకా శక్తిమంతాలయిన మంత్రతంత్రాలు కావాలి. దీనివల్ల మనకొక విషయం తెలుస్తోంది. మహామంత్రాల శక్తి వినియోగాన్ని అవసరం ఐనంత తట్టుకొని నిలబడగలిగే బలం బాహ్యప్రకృతిలో వుందని ఇంకా దీన్నిబట్టి- ప్రకృతిలో వుండే బలవద్వైఖరులను అంతకన్నా బలవంతాలయిన దేవతాశక్తులు అధిగమింపగలవని అంగీకరించడం జరుగుతోంది ఆ దేవతాశక్తుల యొక్క ఏకరూపత్వమే విధి. ఎవ్వడూ విధిని తప్పించుకోలేడు విధే నియమం. దాన్ని అతిక్రమించే నియమంలేదు. ఇంద్రజాలి కాలైన మంత్రతంత్ర విద్యలు క్రమంగా మారి అంతకన్నా బలవంతమైన 'విధి' సిద్ధాంతంగా మారింది. ఈ విధిముందు మంత్రతంత్రాలు పనిచేయవు.

బాహ్య జగత్తుకూ, తనకూ వుండే సంబంధం యొక్క జ్ఞానం మానవుడికి సరిగ్గాలేదు అందువల్ల మంత్రతంత్ర విద్య ఆ జ్ఞానానికి తగ్గంతగానే ఉంటుంది. తాను అనుక్షణమూ బాహ్యజగత్తుతో పోరాడ్తూనే వున్నాడు. ఈ పోరాటం వల్లే వాడికి దాని ప్రకృతితత్వం అర్థంకావాలి. పరిసర వాతావరణానికీ స్వాత్మకూ ఉన్న దగ్గరితనం బోధపడాలి ఆదిమ మానవసమాజం నాగరక దశాభిముఖంగా చేసే ప్రయాణంలో మంత్రతంత్రాత్మకత్వం, దేవతాత్మకమైన మతాచార అభినివేశం- అనేవి రెండు మజిలీలు. అప్పుడు కవిత్వం మతాన్ని విడిచి వేరేగాలేదు. కొంతకాలం అలా గడిచింది ఆ కాలమంతా ఒకవిధంగా మానవజాతి శిశుత్వదశ అని అనవచ్చు

## 6

కవిత్వాన్నీ, మతాన్నీ మనం వేరేవేరేగా చూడొచ్చు మతం అచ్చమైన మతంగా పెరుగుతున్నకొద్దీ అందులో కనబడని ఒక విస్పష్టమైన లక్షణం దేశకాలాల్తో నిమిత్తం లేకుండా కవిత్వంలో కన్పిస్తూన్నది కవిత్వం ఫలోత్పాదకమైంది దేశకాలాల్లో పరిణమించేది ఒకతరం కవిత్వం, తర్వాతి తరం వాళ్ళకు తృప్తినివ్వలేదు ప్రతి కొత్త తరం కూడా తనకు వారసత్వంగా సంక్రమించిన ప్రాచీన కవిత్వాన్ని ఆస్వాదించడం- అర్థంచేసుకొని అభినందించడం- తప్పక నేర్చుకోవాలి ఆమీదట తన నిత్యజీవితంలోని కష్టసుఖాలు, సమస్యలు, ఆశనిరాశలు, మంచిచెడ్డల్ని ప్రత్యేకంగా పరిశీలించి కవిత్వం రాయటాన్ని గురించి నిలదీసి అడగవచ్చు. ప్రతితరమూ ఆవిధంగా అడుగుతోంది గనుకే ఎన్నొ కొత్తపాటలు, ఎన్నో కొత్త కథలు, ఎన్నో పురాణాలు, ఎన్నొ ఇతిహాసాలు- తయారవడం ఇదంతా మానవజాతి సాహిత్య జీవితంలోని ప్రత్యేకత

ఈ ప్రత్యేకత ఏం చెప్తోంది సాహిత్యకళకు మార్పు సహజమని చెప్తోంది. సంఘం అనే వృక్షం చిటారుకొమ్మన పూచిన పువ్వే కావ్యకళ. సంఘం మారినట్లల్లా అది మారుతుంటుంది. సంఘం పెరిగినకొద్దీ అది పెరుగుతుంటుంది. సంఘం బలపడిన కొద్దీ అది బలపడ్తుంటుంది. మారినకొద్దీ, పెరిగిన కొద్దీ, బలపడినకొద్దీ సంఘం మొత్తానికి ఉపయోగపడే కళ కవిత్వం, కావ్యకళ ఇంతగా మార్పులకు లోనవడానికది మాయామహితం కావడమే కారణం. మాయామహితత్వం పరిణామ లక్షణరూపం. ఈ మాయాలక్షణం యొక్క పరిజ్ఞానం కల్గింతర్వాత కావ్యం ప్రపంచంతో సరితూగుతూ వుండాలని ఎవ్వడూ భావించడు. ఆ విషయంలో అంత పట్టుదల కూడా ఎవ్వడూ చూపించడు ఇట్లా అనడం వల్ల కావ్య ప్రపంచానికీ-భౌతిక ప్రపంచానికీ ఎలాంటి సమైక్య లక్షణం కనబడదని అంటున్నట్లుగా అర్థం చేసుకోగూడదు కావ్య విషయాలు తు.చ. తప్పని సత్యాలుగా ఎప్పుడూ అంగీకరించము, అదీగాక కావ్య విషయంలోనే పోయి చోటు చేసుకొని కూర్చోవాలనే తొందర వాస్తవికతకు మాత్రం ఏముంది? అది లేదు కనుకే నిరాటంకమైన కావ్యధార ఉత్పత్తి అవుతోంది అసలిది దేశకాలాలతో సంబంధంలేని కవితాతత్వం. ఒకవిధంగా మతలక్షణం కూడా ఇదే సంఘం తొలిదశలో తాను పుట్టినప్పుడు-అప్పుడు కవిత్వంతో కలిసివుండేది కదా. తానింకా పురాణశాస్త్రాదికాన్ని మించి కూడా అప్పుడు లేదు. కాలం సాగిన మీదట, పురాణ శాస్త్ర యుగం ముగిసిన తర్వాత మతం అచ్చమైనదై ప్రవర్తిస్తుంది.

## 7

శ్రమ విభజన వల్ల వర్గ సమాజం ఏర్పడింది ఈ సమాజంలో పాలకవర్గం బలవంతమయి పాలితులయొక్క సామూహికశక్తి ఉత్పత్తి చేసిన వస్తు జాలాన్ని వాళ్ళ నోళ్ళు కొట్టి తమ ఇళ్ళల్లో నింపుకొంటుంది. కనీస పక్షపు దోపిడీ విధానాన్ని అనుసరించినా, అందులోని మంచి వస్తువులూ, ఎంతో అవసరమైన నిత్యావసర వస్తువులూ పాలకులు కాజేస్తారు పాలితులేమో అట్లాగే పీడింపబడ్తూ వుంటారు పాలక వర్గం మొత్తం పెత్తందారీ వర్గం. వాళ్ళంతా బుద్ధిజీవులు. బుద్ధిశక్తినుపయోగించి వాళ్ళు పని చేస్తారు వారికి సర్వ సుఖానుకూలమైన పరిస్థితులున్నవి సుఖానుభవానికి అవసరమైన విరామం(విశ్రాంతి) వుంది ఉత్పాద్య వస్తువుల్లో వాళ్ళ భీముని వాటా వాళ్ళకు ఉంది ఇవన్నీ నెమ్మదిగా ఆ వర్గానికొక ఆలోచనా విధానం, ఒక సంస్కృతీ సంప్రదాయం అభివృద్ధి కావడానికి దోహదం చేస్తవి. పాలితుల్లో అలాంటి అభివృద్ధి కనబడదు. కష్ట భూయిష్టమయిన వాళ్ళ నిత్యజీవిత విధానం అలాంటి అభివృద్ధి విషయంలో పూర్తిగా పెడమొగం పెట్టి ప్రవర్తిస్తుంది.

ఈ విధంగా శ్రమ విభజన ఏర్పడిన కాలం కొంత దాటిన తర్వాత ఇక సంఘం ఎక్కడికక్కడ ముక్కలు చెక్కలు కావడం మరింత ఎక్కువౌతుంది. ఈ వర్గ

విభేదం పీడించే పాలక వర్గాన్ని రోజు రోజుకీ వాస్తవిక ప్రపంచానికి దూరం చేస్తుంది ఆ విధంగా వాళ్ళు దూరమైన కొద్దీ ఏకాంతమైన ఆలోచనా ప్రవాహాల్లో పడిపోవడం ఎక్కువవుతుంది వాటిని నిజానికి ఆలోచనలనడం మంచిది వినోద కాలక్షేపాలవసరం అవుతాయి సంస్కృతీ సంప్రదాయాల సంపద వాళ్ళకు పెంపుగా కన్పిస్తుంది. ఇక పీడితులు. వాళ్ళు ఆలోచనలకు దూరం ఊహలకు దూరం. సంస్కృతీ సంప్రదాయాలు వారి దగ్గరకు పోవు. వాళ్ళది మితిమీరిన శ్రమ జీవనం. వాళ్ళు పరిస్థితుల ఇరకాటంలో బ్రతుకుతారు

వర్గ సమాజంలో శ్రమ విభజన మొదట మంచి ఫలితాల్నే ఇస్తుంది. కాని క్రమంగా అది సమాజాన్ని ఎంతో దయనీయమైన స్థితికి దిగలాగుతుంది ఆలోచనాత్మకమైన జ్ఞానబుద్ధి క్రియాశీలం కాదు. పరపీడన పరాయణమైన పాలక వర్గం పట్టి భోగలాలస అయి పరాన్న భోజన ప్రియమైనప్పుడు భౌతిక సత్యమైన జగత్తు నుండి వాళ్ళ ఆలోచనలు విడివడి శుష్క పాండిత్య ప్రదర్శనానికి వెన్ను బలంగా నిలబడ్తుంది. పీడిత ప్రజానీకం ఇంకా దిగజారి కేవలం బానిసలుగా మారినప్పుడు శ్రమ పూర్తిగా జ్ఞాన బుద్ధితో తెగతెంపులు చేసికొంది. అప్పుడు శ్రమ (కర్మ)గానుగెద్దులాగా సాగింది ఈ స్థితి సంఘ జీవితంలో స్పష్టంగా ప్రతిబింబిస్తుంది. కళాశాస్త్ర విజ్ఞానాల్లో ప్రతిబింబిస్తుంది ఆర్థిక వస్తూత్పత్తి దెబ్బతింటుంది. రాజ్యం అరాచకమవుతుంది ఈ విధమైన క్షీణ దశ అస్వతంత్ర భారత దేశంలో ఉండేది పతనకాలపు రోమను సామ్రాజ్యంలోనూ, ఈజిప్టు, చైనా దేశాల్లో అప్పుడు ఈ క్షీణ యుగమే ప్రవర్తించింది

శ్రమ విభజన వర్గ భేదము లేని సమాజాన్ని వర్గాలుగా విభజించింది. ఒక వర్గమంతా బుద్ధి జీవులు. మిగిలిన వర్గం శ్రమ జీవులు ఇలాంటి సమాజం వల్ల సంఘం ఎంత నీచ స్థితికి చేరుతుందో- అప్పటి మతాలు, కళలు- ఇవి కూడా అట్లాగే దిగజారి పోతాయి అప్పుడిక మతంకాని, కళకాని సంఘ సామూహిక శక్తి చేత ఉత్పన్నం కావు పాలకవర్గమే వాటిని తయారుచేస్తుంది వాళ్ళు శాసనాల్ని అమలు చేసినట్లుగానే తమ మతాన్ని జనం మీద అమలు చేస్తారు.

ఆదిమ సమాజంలో పరిస్థితి వేరు ఒకరు ఇంకొకర్ని పనిచేయమని ఆదేశించేది లేదు వాళ్ళ అవసరం కొద్దీ వాళ్ళు పని చేస్తారు వాళ్ళు గుంపులు గుంపులుగా నివసించే వాళ్ళు కాబట్టి గుంపులుగానే పని చేసికొనే వాళ్ళు. వారికప్పటికున్న కొద్దిపాటి సంప్రదాయం, మతనియమాలు వాళ్ళను కార్యోన్ముఖుల్ని చేసేవి వారికే సమస్య వచ్చినా అది ఆ గుంపులోనే అనుకూలంగా పరిష్కారమయ్యేది ఆ గుంపంతా ఒకటిగానే బ్రతికేది కదా! అందువల్ల అది సాధ్యమయ్యేది వర్గ

సమాజంలో భిన్న వర్గాల ఆలోచనలు వేరు ఆదర్శాలు వేరు అభిరుచులు వేరు పాలితుల్ని పాలకులు శాసిస్తారు ఇప్పుడు వాళ్ళ పరస్పర సంబంధం నిర్బంధ లక్షణంలో ఉంటుంది

ఇహ మతం- అది మూఢాచారాల పుట్ట. సంఘానికి మోహాన్ని, విభ్రాంతినీ బోధిస్తూ అది మనుగడ సాగిస్తుంది. రాజులు పాలించే సమాజంలో పరమేశ్వరుడొకడుంటాడు. సమాజం సామ్రాజ్యభాగమైనప్పుడు దేవతా సమాజం పెద్దది అవుతుంది మానవ లోకపాలకుల్ని అనుసరించే ఈ కాలంలో ఆ దేవలోకంలో కూడా దేవతల్లో అనేకవిధాల అంతస్తులు- హోదాలను బట్టి, అధికారాల్ని బట్టి ఏర్పడ్డవి. భూలోకంలాగానే దేవలోకం కూడా.

వస్తు విభాగంలోని అసమానత్వం వల్ల, పరస్పర వ్యతిరేకమైన కామనలవల్లా విపరీతమైన విరోధం పెరిగి అది సంఘాన్నింకా విభేదాల పాలు చేస్తుంది. ఈ విభేదాల వల్లే అల్లర్లు, తిరుగుబాట్లు చెలరేగడం, అణచివేయటం సాగుతుంది. సంఘ పరంగా ఉండాల్సిన ఉత్పత్తి సాధన వస్తు సామాగ్రి పూర్తిగా పాలక వర్గాల వారి హక్కు భుక్తంగా అయినప్పుడిక పీడిత ప్రజావర్గం బలప్రయోగానికి దిగక తప్పదు. అట్లా హక్కు భుక్తం చేసికొనే లక్షణమే నిరంకుశత్వం మత విషయంలోనూ అంతే. సంఘ సామూహిక జీవిత స్పర్శ ఈషణ్మాత్రమూ లేకుండా, దేవతల్తోనూ, పరలోకంతోనూ నిండి అది నిరంకుశంగానే ప్రవర్తిస్తుంది. తత్ఫలితంగానే దాన్లో మూఢాచారాలు నిండుతవి నిరంకుశత్వం, మౌఢ్యం అటు పరిపాలనలోనూ, ఇటు మతంలోనూ సమానంగానే ఉంటాయి ఆ కాలంలో ప్రభుత్వమూ, మతమూ రెండూ రెండు కావన్నట్లుగా ఉంటాయి. ప్రభుత్వ మతమే ప్రజల మతం భిన్న మతావలంబనం దోషం కూడా పాలక వర్గం సామాజికమైన శ్రమ జీవనాన్ని పూర్తిగా వదలి బ్రదకడానికి పూసుకొనే కాలం వ్యావసాయికంగా అభివృద్ధి చెందిందై ఉంటుంది. వ్యావసాయిక నాగరకతలో ప్రభువు ప్రత్యక్ష దైవంగా సంఘంలో మహోన్నతుడుగా ఉంటాడు అప్పుడు సమస్త సంఘశక్తి వాడి హస్తగతమే అవుతుంది దాన్ని అతడే సంబాళించుకుని పోతున్నట్లుంటుంది బానిసలు తమ శక్తి సామర్థ్యాల్ని తాము తెలిసికోరు. పైగా తమ శక్తిసామర్థ్యాలు తమ ప్రభువువి అనే వాళ్ళు భావిస్తారు. ఆయన నియామకాన్ని అనుసరించే వాళ్ళ శక్తియుక్తులు పని చేస్తవి కదా అందుకని బానిసకు ప్రభువు- ప్రభు వర్గం- అందరూ పూజ్యులే. ఈ విధంగా బానిస, ప్రభువుకు స్వాత్మ సమర్పణం చేస్తాడు. వాడి శక్తి సామర్థ్యాలు ఉత్పాదించిన వస్తు సమూహం ఎలా పాలకవర్గాల పాలవుతుందో వాడి ఆత్మకూడా అట్లాగే అవుతుంది. ఆస్తిపోయింది. మానాభిమానాలు పోయినవి. బానిసలు ఎంత

వినయ విధేయతలతో ఉంటారో ఆ సంఘంలో వాళ్ళ వల్ల అంతటి ఘన కార్యాలు నిర్వహించబడ్తున్నవని అర్థం.

మతం అంటే ప్రపంచం యొక్క విపరీత చైతన్యం. వర్గ సమాజంలో వర్గవిభేదం అధికమవుతున్న కొద్దీ వస్తూత్పత్తి శక్తి సన్నగిల్లింది. అది కొందరి సొత్తు అయింది. అట్లాగే మతం కూడా అనేకరకాల నిర్బంధాలకు లోనయి కరుడుకట్టుకుని చావు బ్రతుకుల నడుమన ఉన్నట్లుంటుంది.

పాలకవర్గం తాను తనమతంలో విశ్వాసం కలిగి ప్రవర్తిస్తూ అందులోని మంచిమంచి అనుకూలమైన వాటినన్నింటినీ స్వాయత్తం చేసుకుంటుంది. సంఘంలోని మేలుజాతి వస్తు సముదాయమంతా దానిసొంతమేకదా! మత విషయంలోనూ అది అట్లాగే ప్రవర్తిస్తుంది. స్వర్గసుఖాలన్నీ దానివే. ఆనందమంతా దానిదే. అట్లా సాగుతున్న కాలంలో ఎప్పుడైనా పీడితుల్లో మరీ మొండికెత్తిన రకం వాళ్ళు కొందరు ఎదురు తిరుగుతారు. అప్పుడు పాలకవర్గం - తమ స్వాధీనంలో వుంచుకున్న ఆనంద భూముల్లో ఇంత చోటిచ్చి వాళ్ళను శాంతింపచేస్తుంది. భౌతిక వస్తువులయితే మరొకళ్ళకిస్తే విలువలు తగ్గిపోతాయి. ఆధ్యాత్మిక వస్తువుని ఎందరికిచ్చినా పోయేదేమీ లేదు. (కీసవెలితికాదు). ఇలాంటి సందర్భాల్లో కొన్నివిచిత్రాలు జరుగుతాయి. ఈజిప్టులో బానిసజాతికి కూడా శాశ్వతస్వర్గసౌఖ్యం అంగీకరించబడింది. ఇంకా కొన్ని అవాంతరమతాలు మొట్టమొదట ప్రభువులపట్ల వుండే దైవభావాన్ని క్రమంగా దిగజార్చి అల్ప విషయాల్లో దైవాంశాల్ని ప్రవేశపెట్టాయి. రోజురోజుకీ ఎక్కువవుతున్న పీడిత ప్రజానీకం యొక్క దౌర్భాగ్యస్థితికి ప్రతిబింబమే - ఇది. ధర్మంగా బ్రతికితే మరణానంతర జీవితంలో సుఖపడవచ్చునే ప్రచార ప్రబోధాలు ధర్మంగా బ్రతకడం అంటే యజమానులకు లోబడి వినయ విధేయతల్లో వుండటమే. వర్గసమాజం స్వర్గలోకపుటూహా సౌఖ్యాల్నే పాలితుల్లో చాలామందికి మరణానంతరం సమకూర్చింది. ఆ విషయాన్నే బుఱ్ఱలకెక్కించింది. స్వర్గాదిలోకాలెంత సత్యాలో మరణానంతర జీవితమూ అంతే సత్యం. ఒక్క పాలక వర్గానికి తప్ప మిగిలిన వాళ్ళకెవరికీ వాస్తవమైన. నిత్యజీవితంలో అనుభవింపదగిన సుఖమేదీ వుండదు. వాళ్ళు పండించిన పంటే వాళ్ళకు దక్కదు కదా!

మత విషయ ప్రయోజనజ్ఞానం యొక్క అభివృద్ధి క్రమంగా పాలకవర్గం వాళ్ళకు మతం విషయంలో అవిశ్వాసాన్ని పెంచుతుంటే తనకవిశ్వాసం పెరుగుతున్న కొద్దీ దాన్ని నిర్బంధం చేసి పరాయివాళ్ళమీద రుద్దుతోంది. అప్పుడింకా పాలకవర్గం ఒక మంచి మనోహరమైన ఆదర్శవాదాన్ని గానీ, రహస్యమైన వేదాంతతత్వాన్ని గానీ పెంచి దాని అండలో తాను నిలద్రొక్కుకుంటుంది.

A. No. 903
హైదరాబాద్ - 500 044.

పాలకవర్గం వారి పరిస్థితి ఇట్లావుంటే పాలితుల్లో కొన్ని మూఢవిశ్వాసాలు ప్రబలుతాయి. కొన్ని గాథలు ప్రచారమవుతాయి. దీనికంతటికీ మూలం జన సామాన్యంలో వ్యాపించిన పౌరాణికతే. కానీ పాలకవర్గం ఇప్పుడు పాలితుల మూఢవిశ్వాసాల్ని అమర్యాదకరంగా భావిస్తుంది. మొత్తం మీద అవమానింపబడ్డా, సన్మానింపబడ్డా అది వ్యాప్తిని పొందుతుంది. ఆ విశ్వాసాలు అదృష్టాలకు సంబంధించినవి. ఆహారం లభించడం, బంగారం చేజిక్కడం, అదృష్టవంతులైన పిల్లలు పుట్టడం ఈ మొదలైనవన్నీ వాటికి సంబంధించి వుంటాయి. ఇలాంటి అదృష్టాలు వాళ్ళకీ జీవితంలో లేనేలేవు. ఆ విశ్వాసాలమీదనే వాళ్ళు బ్రతుకుపోరాటాన్ని సాగిస్తున్నారు. వాళ్ళకీ విశ్వాసం విషయంలో ఏ మాత్రం అపనమ్మకం లేదు. ఎందుకంటే అవి ఎవరో నెత్తిన రుద్దినవి కావుకదా! అందుకోసం - వాటిని సమాజం అంతా కలిసి పెంచుకొన్నది. అందుకని - తన సమాజం అంటే విభజన జరగని తమ వర్గమని అర్థం-మతం కవితా విషయం కాని కాలంలో వారి ఆ విశ్వాసాలే మతకవితా విషయాలు. అణగదొక్కబడిన వాళ్ళ కళావిషయం అది. మానవ సహజాతాలైన కామక్రోధలోభమోహాది వాసనలు సాంఘిక జీవితంలో కలిసిపోవడాన్ని ప్రకటించేటంతవరకూ ఆ విశ్వాసాలే కవితా విషయాలు. కవితా విషయాలు మాత్రమే గాని ఉత్తమ కవితా విషయాలు కావు. అవి బానిసజనం విశ్వాసాలు కదా! సర్వతంత్ర స్వతంత్రులే ఉత్తమ కవితా నిర్మాణ దక్షులు. దీన్లో ఏ మాత్రం అబద్ధం లేదు. ఈ కవిత్వం వాంఛా సాఫల్యభూముల హద్దుకు లోబడే వుంటుంది. ఈ కవితా నిర్మాతల నిత్యజీవితంలోనే స్వేచ్ఛామూలకమైన ప్రవృత్తిలేదు. అందువల్ల వారి కవిత్వం కూడా అట్లాగే వుంటుంది.

## 8

వర్గసమాజంలో యజమానులు చెప్పినట్లు కార్మికులు గుడ్డిగా పనిచేస్తారు. తాజ్‌మహల్ నిర్మాణానికి అందరూ తలా ఒకరాయి ఎత్తినవాళ్ళే. రాయిమోయడమే వాళ్ళకుతెలుసు. తాజ్‌మహల్ నిర్మాణం జరిగినట్లు పాలకులకు మాత్రమే తెలుస్తుంది. పాలితులు ఊరికే లొంగి పనిచేస్తారు. వాళ్ళకేమీ తెలియదు. వారస్వతంత్రులు. 7

పాలకులు స్వతంత్రులు. అందువల్ల వాళ్ళ కళా వ్యాపారం పొనుపొను పూర్తిగా వాళ్ళ అభీష్టాన్నీ, అభిలాషల్నీ వ్యక్తం చేస్తూ వాళ్ళ విశేష ప్రతిపత్తికి నిదర్శనంగా కన్పిస్తుంది. ఒకవర్గం మతంకోసం గాను ప్రత్యేకించడం వల్ల అది వెన్నెముక బలం మీద నిలదొక్కుకుని కళనుండి వేరు పడుతుంది. ఈవిధంగా కళ మతంనుండి దూరమవుతుంది. ఇంతకుముందే పాలకవర్గం వాళ్ళ విశ్వాసాన్ని అది

కోల్పోయింది పాలకవర్గం కంటే ఎక్కువ నిరాఘాటంగా అది ప్రజాపీడనం చేస్తున్నది. వర్గసమాజంలో మతం అవిశ్వాసం పాలవుతున్నకొద్దీ స్వతంత్రులైన పాలకవర్గం వాళ్ళ కళారుచులు విశేషాభివృద్ధి చెందుతాయి. ఇప్పుడు పాలకవర్గంవాళ్ళ భావోద్వృత్తుల్ని అభివ్యక్తీకరించడమే కళాతత్వం అవుతుంది. ఈకాలంలో కొన్నాళ్ళపాటు ఇలా - దోచుకునే పాలకవర్గాలవాళ్ళ భ్రష్టకళాఖండాలు - అటు దోపిడీ పాలయ్యే పాలితుల జానపద గాధావళులు రెండున్నూ పక్కపక్కగానే బ్రతుకుతవి. కానీ ఈ స్థితి ఎంతో కాలం నిలవదు. కవిత్వానికి ఏ మాత్రం అవకాశం లేనంతగా పాలకవర్గం అస్వతంత్ర మయి గుడ్డిదైపోతుంది. ఇక ఇప్పుడు కవిత్వం వెనుకటి నమూనాల మీద కుంటిగా నడవక, గుడ్డినడక నడుస్తుంటుంది. కళాతత్వం నశించిపోతుంది. అది కవిత్వానికి కాలం కాదు. ఇట్లా పాలకవర్గం చెడిపోతున్నకొద్దీ పాలితుల బ్రతుకులు మరింత ఘోరమవుతాయి వాళ్ళింకా పీడింపబడ్తారు. వాళ్ళ జీవితమింకా అస్వతంత్రమయి, బానిసబ్రతుకయి యాంత్రికంగా తయారవుతుంది. సంఘం యొక్క ఆర్థికస్థోమత సేవ్య సేవకతత్వం మీద ఆధారపడుతుంది. జానపద కళలు కానీ, వట్టి మూఢ విశ్వాస విషయాలు కావీ కవిత్వ రూపంలో వెల్వడడానికి కూడా యాదృచ్ఛికత కావాలి. బానిసవర్గానికి అది లేదు. బానిస సమాజానికి కళలు లేవు. కవిత్వాలు లేవు.

## 9

కవిత్వాన్నుండి సంఘాన్ని వేరుపర్చలేము. అది మానవ ప్రవృత్తికి సంబంధించింది సంఘం ప్రవృత్తిమయమైంది. కవిత్వ రహస్యమంతా ఆ ప్రవృత్తిలోనే వుంది. మానవ ప్రవృత్తి - సహజాతాలైన వాసనల్ని బట్టి వుంటుంది. కాని ఇంతకంటే కూడా మానవతకు ఇంకా, చాలా దగ్గరై, మార్పు లక్షణాల్ని కలిగివుంటూ, సహజాతాలకే మాత్రమూ సంబంధంలేని ప్రవృత్తులున్నవి అవి తరతరానికి, వరస తప్పకుండా వారసత్వంగా సంక్రమిస్తవి. ఇంకా అవి ప్రతితరాన్ని, దానిపూర్వతరం కంటే భిన్నంగా తీర్చిదిద్దుతాయి. ఇదంతానాగరకత. మొదటిదంతాసహజత్వం. సహజత్వంతో మానవ తకూ, నాగరికతతో మానవతకూ ఏర్పడ్డ వైరుధ్యమే కవిత్వానికవకాశం కల్పించింది. సహజత్వంతోడి మానవత్వం అంటే స్వతంత్రవ్యక్తి వాటి మీద ఏ విలక్షణ ప్రభావమూ లేదు. నాగరిక మానవుడంటే నాగరికత వల్ల కలిగే అనేక విలక్షణ ప్రభావాలకు లోనైనవాడని అర్థం. ఇట్లా విలక్షణత్వం లేకుండటానికీ - ఉండటానికి గల రాయిడి వల్లే కవిత్వానికొక అర్థం ఏర్పడింది ఆ మేరకు కవిత్వం సత్యమని అందువల్లే అనిపిస్తోంది కవిత్వం ఫలోత్పాదక శక్తి కల్పించి. ఇంకా అది ఆర్థికమైన కృషి కూడా. ఈ పునాది నుండి కవిత్వాన్ని కదిలించి చూస్తె దాని తత్వం అసలర్థమే కాదు.

ఇక ప్రాచీనులు ఈ కవిత్వతత్వాన్నెట్లా భావించారో మనం గమనించాలి. ప్లేటో, అరిస్టాటిల్ తమ సమకాలంనాటి సాంస్కృతిక విషయాలనన్నింటినీ కావ్య కళతో సహా పరిశీలించారు. వారిద్దరున్నూ వర్గపోరాటం ఫలోన్ముఖం కాని కాలాని కన్నా ముందటివాళ్ళే. ప్లేటో అప్పటి పాలకవర్గ ప్రతినిధి. అరిస్టాటిల్ నిత్య జీవితపు బ్రతుకు తెరువులో మొండికిబడి సాగే ప్రజావర్గానికి ప్రతినిధి.

అరిస్టాటిల్ తన సమాజంలో భాషను ప్రయోజనానుకూలంగా ఎట్లా భిన్నభిన్నంగా ప్రయోగిస్తున్నదీ గమనించాడు. జనబాహుళ్యాన్ని ప్రబోధించే వేదికల మీద ప్రయోగించే భాషలో ఎంత వాక్చాతుర్యం వుంటున్నదీ, దాని శక్తి వల్ల వక్త సామాజికుల్ని ఎట్లా తనతో తీసుకొని పోతున్నదీ అరిస్టాటిల్ స్పష్టంగా చూశాడు అది ఆనాడంతగా, సమాజంలో ప్రధానంగా వున్నది కాబట్టే వాక్చాతుర్యాన్ని గురించి అంతగా రాశాడు. మరి కవిత్వం విషయంలో సమసామాజికమైన అనుభూతే అప్పుడుండింది. ఆదిమ సమాజ లక్షణమే అప్పటికింకా వుండింది న్యాయస్థానంలో న్యాయవాదులకూ, రాజకీయరంగంలో ప్రజానాయకులకూ శ్రోతల్ని ముగ్ధుల్ని చేసి తమ పక్షం ఆమోదించేట్లుగా వాళ్ళని ప్రబోధించాల్సి వుండటం చేత వాక్చాతుర్యం తప్పనిసరిగా నేర్వాల్సిన కళ. అరిస్టాటిల్ భావించిన వాగ్వైలక్షణం కవితా ప్రచార సాధనం కాదు. మరి నిత్యజీవితంలో పరస్పర నియోజనావసరాల్లో గాని, ఉపదేశావ సరాల్లో గాని వాడేభాషలో ఉపయోగించే చాతుర్యం, ముందు పేర్కొన్న ప్రయోజన సాధనం వంటిది కాదు ముందు పేర్కొన్న రెండు స్థలాల్లో మాత్రమే వాక్చాతుర్య ప్రసక్తి తక్కిన చోట్ల కాదు ఈ విషయాన్ని అరిస్టాటిల్ స్పష్టంగా చెప్పాడు.

అలంకారికమైన భాషా శైలి వున్న ఉపన్యాస చాతుర్యం కంటే వేరుగా గేయాల్ని, రూపకాల్ని, ఇతిహాసాల్ని, ప్రేమగీతాల్ని గురించి సాహిత్య శాస్త్ర మీమాంస చేశాడు. అది, కావ్య ప్రక్రియలట్లా విడివడ్తున్న కాలం. అందువల్లనే ఆయన కావ్య ప్రక్రియలన్నింటిలోనూ కనిపించే సాధారణ లక్షణమేదీ - అని విచారించాడు. అది కవిత్వమవుతుందా? కాదా? అని తేల్చి చెప్పగల్గే ఏకైక లక్షణం కోసం అతడన్వేషించి - కవిత్వం కథను చెబుతోందని కనుగొన్నాడు. ఇంకా అది దేవతల పద్ధతుల్ని గురించి కానీ, మానవుల పద్ధతుల్ని గురించి కానీ చెప్తున్నదనీ, కాకపోతే కవి యొక్క భావోద్వృత్తుల్ని వ్యక్తం చేస్తున్నదనీ, ఇదంతా నిజం కాకపోయినా నిజమన్నట్లు కన్పిస్తున్నదనీ భావించాడు. ఇతిహాసం అబద్ధపు చరిత్ర, నాటకం - కపట నాటకం. ప్రేమ కవిత్వంకూడా ఆత్మవంచన, పరవంచనల్తో కూడుకున్నదే అందువల్ల గ్రీకులకు కవిత్వం వట్టి మాయగా - అందులోనూ తెలిసిన మాయగా కనిపించేది.

ఈ రకం కావ్య కళ ప్లేటోకు ఎంతో శోచనీయంగా కన్పించింది అందువల్లనే ఆయన తన ఆదర్శ రాజ్యంలో కవులను అనుమతించలేదు. ఒకవేళ వాళ్ళను రానీయాల్సి వచ్చినప్పుడు ముందుగా వాళ్ళ కృతులను గుణ దోషజ్ఞులు బాగా

విమర్శించాలని నియమం చేశాడాయన ప్లేటో ప్రతీప తాత్విక బుద్ధి, అలాంటి వాళ్ళెప్పుడూ ముఖ్యంగా సమకాలీన సంస్కృతిని నిరసిస్తూనే వుంటారు. ప్లేటో సమకాలీన సంస్కృతి ముఖ్యంగా కావ్య సంబంధమైంది. తాత్వికుడుగా ఆయన కవిత్వాన్ని నిరసించాడు. మనిషిగా దానివల్ల ఆనందాన్ని అనుభవించాడు.

కవిత్వం మాయాకల్పనమే ప్రధానంగా కల్గి వుండేదనే నిర్ణయానికి గ్రీకులు వచ్చారు. అందువల్ల కవి, బాహాటంగా మాయను సృష్టించగలదాన్నే నిర్మించడానికి పూనుకున్నాడు. నిత్యజీవితం కంటే సత్యమైన చరిత్రను నిర్మించాడు. కవి అంటే అచ్చంగా ఇట్లాంటి నిర్మాణ దక్షత వున్న వాడేనని గ్రీకులు భావించడం మొదలు పెట్టారు. ఆ భాషలో కవి శబ్దానికి వ్యుత్పత్త్యర్థం చేసేవాడనే. చేయడం అంటే సృష్టించడం అని కూడా అర్థం. ఇలా సృష్టించడం - కవులకీ, దేవతలకీ మాత్రమే తెలిసిన విద్య. 8

కాని వాస్తవ విషయ సంకేతాలైన శబ్దాల వల్ల ఒట్టి శూన్యం నుండి కవి ఏమీ సృష్టించలేడు. మొదటగా కవి వాస్తవికత్వానికి కృత్రిమమైన అనుకరణాన్ని తయారు చేస్తాడని వాళ్ళభిప్రాయపడ్డారు. ప్లేటో దృష్టిలో కవి అన్నవాడు వాస్తవ జీవితానికి అనుకరణాన్ని సృష్టించి శ్రోతల్ని తాను సృష్టించిన ఛాయా ప్రపంచంలో మోసపుచ్చేవాడు.

ఈ అనుకరణ సిద్ధాంతమే సభా సంభాషణా చాతుర్యం నుండి కవిత్వాన్ని వేరుపరచడానికి అరిస్టాటిల్‌కు అవకాశాన్నిచ్చింది. ఇప్పటి మన ఆధునిక మనస్తత్వానికి అప్పటి నుండి ఇప్పటి దాకా వచ్చిన సాహిత్యంలోని మార్పుల వల్ల ఆయన చేసిన వేర్పాటు సర్వసమగ్రంగా కన్పించదు. అయినప్పటికీ అది ఆనాడు అరిస్టాటిల్ కాలానికి యుక్తమైందే.

మనం కవిత్వాన్నినవల, నాటకాల కంటే భిన్నంగా చూస్తాం కదా! అరిస్టాటిల్ అట్లా చూడడు సాహిత్య ప్రక్రియలు శాశ్వతాలుకావు. జీవ శాస్త్ర, శాస్త్రీయ విభాగాలే శాశ్వతాలు కావు. సాహిత్యం, జీవశాస్త్రం రెండూ మారుతుండాల్సిందే ప్రాణికోటి పరిణామం కంటే శీఘ్రంగా సంస్కృతీ పరిణామం జరుగుతుంది అందువల్ల సంస్కృతీ సంప్రదాయ విమర్శనాన్ని తగినట్లుగా మారుస్తూ, చేర్పుల్ని తనలోకి రానిస్తుండాలి. కళా ప్రయోజన పద్ధతుల్ని మనం సమగ్రంగా అర్థం చేసుకోవడానికిఅరిస్టాటిల్ అనుకరణ సిద్ధాంతం అత్యంత ఉపయోగమైంది

అరిస్టాటిల్ దృష్టి కావ్యంమీద - అంటే నాటకం మీద లగ్నమైంది. దానివల్ల ప్రభావితులైన వాళ్ళతోటి ఆయనకు పనిలేదు. దాన్ని సృష్టించిన వాడితోటీ ఆయనకు అంతగా పనిలేదు ఆయన కావ్యానుశీలన పద్ధతి చక్కని వసదృష్టితో వుంటుంది దీనికి ప్లేటో వ్యతిరేకం. రచన అంత ముఖ్యం కాదు. కవి ముఖ్యం. శ్రోత కూడా ముఖ్యమే లేఖనం కనుగొన్నతర్వాత సమష్టి నుండి వ్యష్టికి కవిత్వం మార్పు

చెందుతున్న కాలంలో ఆదిమ సమాజంలో కవి ప్రయోజనాదుల్ని గురించి అధికారికంగా కొంతవరకైనా చెప్పేటట్లు చేసేది సంస్కృతి కాదు, గ్రామ్యతే. ఎంతో ప్రతీపబుద్ధి కలిగి వున్న ప్లేటో విషయంలో కావ్య నిర్మాణం చేయగలిగే మానసిక విజ్ఞానం చాలా ప్రాథమిక విషయమే.

ప్లేటో పూర్వకాలపు మనిషి. తన కళ్ళముందు వచ్చిన మార్పుని కూడా ఆయన గమనించలేదు. అంతకుమునుపు లాగా అతని కాలంలో కవిత్వమంటే ట్రాజెడీయేకాదు. ప్రేక్షకులూ, నటులూ అందరున్నూ కలిసి మిక్కిలి ఉత్సాహంతో జరుపుకొనే ఒక సామూహికోత్సవం. అందరూ కలిసి విహరించే ఒక కళాప్రపంచం అప్పటి ట్రాజెడీ. ప్లేటో కాలంలో స్థితివేరు. సామూహికమైన సంఘజీవితంనుంచి విడిపోయిన వ్యక్తులు లేక వ్యక్తుల గుంపులు అనుభవించడం కోసంగాను కావ్యాలు సంఘంనుంచి తొలగిపోయి చాలా దూరం నిలబడ్డవి. లేఖనం కనుగొనడం ఈ విషయంలో చాలా మార్పులకు దోహదం చేసింది. లేఖనం వచ్చినందువల్ల బహువిషయాల్ని జ్ఞాపకం పెట్టుకోవాల్సిన అవసరం లేకుండాపోయింది. జ్ఞాపకం ఉంచుకొన్నవాడు చెప్పడం మిగిలినవాళ్ళు వినడం పోయింది.

రాసి పెట్టిన విషయాలను ఎవరికివాడు చదివి తెలుసుకోగల్గుతున్నాడు. కవిత్వం రాతరూపంలో వ్యక్తమవుతోంది అది సామూహికమైన సంఘశక్తిచేత ఉత్పన్నం కాదు. అట్లాగే అనుభవం సందర్భంలో కూడా సంఘసమూహంతో దానిక నిమిత్తంలేదు. ఒంటరిగా ఎవడికివాడు దాన్ని చదువుకొని అనుభవించవచ్చును. కాని ప్లేటో ఈ మార్పుల విషయం పట్టించుకోలేదు. వర్గభేదమేర్పడని సమాజంలో సామూహికోత్సాహాల కాలానికి ఆయన విమర్శనలు సరిపోతాయి అవి సత్యాలే. కాని పనికిమాలినవి. ఎందుకంటే తాను నిరసిస్తున్నవి తనకాలంలో వచ్చిన వర్గసమాజంయొక్క ఆర్థికవిధానం లక్షణాలని ఆయన గుర్తింపలేకపోయాడు. అందువల్లే ఆయన ముందుకుసాగి వర్తమాన సమస్యలకు ఒక పరిష్కారమార్గ స్థితిని పొందలేకపోయాడు. ఈ సమస్యలు పుట్టని కాలానికి - అంటే వెనుకకు సాగి చేరుకొన్నాడు. చరిత్ర అనే గడియారపు ముల్లును ఎవ్వడూ వెనక్కు తిప్పలేడు.

ఫాసిస్టు తాత్వికుల్లో ప్లేటో చాలా నాగరికుడు. ఎంతో మానవతా దృక్పథం ఉన్నవాడు ఈనాటి ప్రతీపతాత్వికులలో ఎవ్వడు కూడా ప్లేటో అంత నాగరికుడు కాడు. ఆయనలాగా చిత్తాకర్షణ చేయగలిగే వాడున్నూకాడు. ప్లేటో కవిని గురించి ఇలా భావించాడు. "నిన్ను కదిలించేది ఒక దైవీశక్తి ప్రభావం. అది అయస్కాంత శిలలోని ఆకర్షణ శక్తిలాంటిది ఈ శక్తి చాలా విచిత్రమయింది అది ఒక్క ఇనుపవస్తువుని ఆకర్షించడం మాత్రమేకాదు. తాను ఆకర్షించిన దానికి మరింకొక దానిని ఆకర్షించే శక్తిని అది ప్రసాదిస్తుంది అయస్కాంతశక్తి ఆవిధంగా తన

ప్రభావంలోకి వచ్చిన ఇనుప కొక్కేలన్నింటిగుండా తాను సంచారంచేసి వాటన్నింటినీ ఒక్క గొలుసుగా కలుపుతోంది. వాగ్దేవత అయస్కాంత శక్తిలాంటిది. అది ముందు కవికొక ఆవేశాన్ని కల్గించి అతనిద్వారా అలాంటి సమానధర్ములనందర్నీ ఆవేశపరుస్తుంది. ఆవిధంగా కవిని, సహృదయసమాజాన్ని వాగ్దేవత తన శక్తిచేత నిబంధించుతుంది. మనమిప్పుడు బ్రహ్మాండంగా మెచ్చుకొనే మనపూర్వకవుల కావ్యాలు - కావ్యకళానియమానుసారంగా రచించటంవల్ల గొప్పదనాన్ని పొందలేదు. అవన్నీ వాగ్దేవతా ప్రసాదంవల్ల సిద్ధించిన మహావేశం చేత నిండిన కవి హృదయం తంత్రీలయాన్వితమైన భాషలో ఆవిష్కరించిన భావానుభూతులు.

ఆవిధంగా కవులు దైవీప్రేరణ పొందిన స్థితిలో మహాకావ్యగీతాలు ఆవిర్భవిస్తాయి. ఈ ఆవేశంలో వున్నప్పుడే శ్రోతల్ని ఉఱ్ఱూతలూగించే మధుర నాదావిష్కారం జరుగుతుంది. పూనకం వచ్చిన జానపదులు ఆవేశించిన దేవతాప్రభావంతో అద్భుతాల్ని ప్రదర్శిస్తారు. తేనెల్నీ, పాలనీ నదుల్లోంచి దోసిళ్ళతో తాగిస్తారు. ఆవేశంపోయి మామూలు స్థితికి వచ్చినప్పుడు పాలులేవు గీలులేవు. వట్టినీళ్ళే మిగిలేది. కవుల హృదయాల్లో ఈ పవిత్రాద్భుతశక్తి ఉంది. ఉందని కవులే చెప్తారు. కవిహృదయాలు భ్రమరాల లాంటివి. భావ కుసుమాలు రాలిరాలి అవి ఉద్యానవనాల్లో తేలితేలి, పచ్చిక బయళ్ళలో సాగిసాగి, స్వాదుకవితా మధుమాధురీ ప్రవాహాల్లో మునిగిమునిగి మదించిన, బరువైన, నెమ్మదియైన, సుందరమైన నడకల్తో శ్రోతల్ని చేరి సంతోషపెడ్తవి. అట్లా భావతీవ్రాకృతి అయిన కవి హృదయం సత్యాన్నే పలుకుతుంది. లోకాతిశాయి అయిన చిత్తవృత్తుల్ని కవి కల్గి ఉంటాడు. రెక్కలు కట్టుకొని మహోన్నతమైన సీమలకు ఎగరగల్గుతాడు. పుణ్యశీలుడు, అలాంటి భావావేశంతో నిండేటంతవరకు కవి కవిత్వం రాయలేడు. హేతు విచారణ బుద్ధిలక్షణం ఉన్నంత వరకెవ్వడూ కవిత్వం చెప్పలేడు. భవిష్యత్తును దర్శింపలేడు. దైవీశక్తి ప్రేరితుడు కావడాన్నిబట్టి, కావ్య సరస్వతి వాడికి ప్రసన్నురాలు కావడాన్ని బట్టి కవులల్లో అంతస్తులుంటాయి. ఆప్రేరణ, ఆప్రసన్నత లేకుంటే వాళ్ళు చేయగల్గిందేమీలేదు. వాళ్ళెందుకూ పనికిరారు. ఇట్లా అనడం ఎందుకంటే - వాళ్ళు తాము చదివి సంపాదించుకొన్న కావ్యకళాలక్షణ వ్యుత్పత్తి మీద ఆధారపడికాదు కవిత్వం చెప్పేది. అంతర్వాణి ప్రభావంయొక్క ఆవేశ తీవ్రబుద్ధితో చెప్తారు. శాస్త్ర నియమానుసరణంతో ఏ విషయాన్నైనా పట్టుకొని మంచి కవిత్వం రాయగల్గడం వాళ్ళకు తెలియదు. కవులకీ, మతప్రవక్తలకీ, ఎరుకతలకీ, భగవంతుడు హేతువిచారణ బుద్ధిని పూర్తిగా పూజ్యం చేశాడు. ఎందుకంటే - తన అస్తిత్వాన్ని నిలబెట్టుకోవడానికీ, తన మహిమల్ని వ్యాఖ్యానించి ప్రదర్శించడానికీ అలాంటి వాళ్ళే కావాలి కనుక. పరమాద్భుతంగా రచనలు చేసే వాళ్ళు భగవత్ప్రేరణ వల్లనే మనకోసం కవిత్వం చెప్తారు.''

శ్రోతల చిత్తాన్ని వశపర్చుకోగల్గిన చమత్కారమైన వాగ్విన్యాసం నుంచి ఇక్కడ ప్లేటో కవిత్వాన్ని వేరేగా చూపించాడు. ఆ చమత్కారమైన వాగ్విన్యాసానికి కొన్ని రచనా నియమాలున్నాయి. దాన్ని జాగ్రత్తగా నేర్చుకోవాలి. ప్లేటో దృష్టిలో కవిత్వం తెలిసిచేసే పనికాదు. తెలిసిచేస్తే దానికో నియమం, ఒక ఆలోచన ఉంటాయి కవిత్వానికి అవి లేవు. భగవదావేశంవల్ల కవిత్వం వస్తుంది. ప్లేటో కవినీ, మత ప్రవక్తనీ, ఎరుకతనీ సమానంగా చూశాడు. అదిమ సమాజం నాగరకతని సమీపిస్తున్న దశ. ప్లేటో ఈ ఆవేశం కవికేకాక పాఠకుడికి కూడా వుండాలని చెప్పాడు. కవిని గురించి ప్రసంగించేవాడూ, కవియొక్క కవితా ప్రభావం సోకిన భావుకుడున్నూ భగవదావేశపూరితులు కావాలి. కవిత్వ రచనేకాక దాని అనుభావం కూడా వ్యక్తి చైతన్యమూలకంకాదనేదే దీనికంతటికీ తాత్పర్యం. మాయ చేయడంకూడా ప్లేటోకు ఒక రకం మంత్ర విద్యావేతృత్వమనే అభిప్రాయం. కవులు మాంత్రికులు, వాళ్ళు మతానికి సంబంధించిన శక్తుల్ని మాత్రమే ప్రదర్శిస్తుంటారు. ప్లేటో చెప్పిన అయస్కాంత శక్తి విషయాన్ని బట్టి కూడా ఆయన ఆదిమ మానవ సమాజంలోని సమూహ లక్షణాలచేత కూడిన కవిత్వాన్ని గురించే మాట్లాడుతున్నట్లు స్పష్టమౌతుంది. ఆయన దృష్టిలో వున్నదదే, ఆయన ఆదర్శవాది. కావ్య ప్రయోజనం కంటే కూడా కావ్యానందం ఆయనకు ముఖ్యం. అరిస్టాటిల్ ఈ విషయంలో ప్లేటోకు వ్యతిరేకి.

అరిస్టాటిల్‌కి కవి హృదయంతో నిమిత్తం లేదు. కావ్య నిర్మాణాన్ని, కావ్యానుభావాన్నీ వ్యక్త చైతన్యం చేస్తుందా? అవ్యక్త చైతన్యం చేస్తుందా? అనే విచారణ ఆయనకు అక్కరలేదు. నిర్మిత కావ్యమే ఆయనకు ముఖ్యం. దాన్నిబట్టే విమర్శా, విచారాలు ఉండాలని ఆయన చెప్తాడు. వాటి నావిధంగానే ఆయన క్రమబద్ధం చేసి, విషయానుగుణంగా చేసి కావ్యమంతా కొన్ని నియమాలకు లొంగివచ్చేటట్లుగా చేస్తాడు అందువల్ల అనుకరణ సిద్ధాంతం నిరాఘాటంగా అంగీకరింపదగిన హేతువుల్ని అన్వేషించి సూత్రీకరించినట్లుగా ఆయన రచించాడు.

ప్లేటో కంటే అరిస్టాటిల్ ఒక అడుగు ముందుకు వేసి ట్రాజెడీ యొక్క సాంఘిక ప్రయోజనం ఏమిటని ఆలోచించాడు. అది కెథార్టిక్ అని చెప్పాడు. కానీ ఆ మాటకు స్పష్టార్థ ప్రతిపత్తి లేదు. కొందరు ఫ్రాయిడ్ అనుయాయులు అరిస్టాటిల్ చెప్పింది ఫ్రాయిడ్ ప్రవచించినటువంటి థెరపీబై అబ్రియాక్షన్ కంటే భిన్నం కాదన్నారు. కానీ అది వేరు. ఇది వేరు. అట్లా చెప్పడం రెండింటికీ సంబంధించిన మిడి మిడి జ్ఞాన లక్షణం తప్ప మరేమీ కాదు.

కావ్య ప్రయోజనాన్ని గురించి మనకొక స్పష్టమైన అభిప్రాయం ఏర్పడి, అరిస్టాటిల్ అభిప్రాయాల్ని మన వాటితో పోల్చి చూచుకోగల్గేటంతవరకూ అరిస్టాటిల్ కెథార్టిక్‌ను గురించి మనమంతగా దూరంపోయి విచారించకుండుటయే మంచిది. ట్రాజెడీ విషయంలో ఆయన చూసిందిది. ప్రేక్షకునిలో సుఖకరాలు కాని భయము

- ఆతురత మొదలైన అనుచిత వృత్తుల్ని ట్రాజెడీ కల్పిస్తున్నది. ఇంకా అది ప్రేక్షకుల్ని ఆ అనుభవానికి తిరిగి ఆకర్షిస్తున్నది. ఆ అనుభవం సుఖకరం కాకపోయినప్పటికీ ప్రేక్షకులు మళ్ళీ వస్తున్నారు. కనుక వారికది కొంత మంచి చేసిందనే చెప్పాలి. మింగడానికి చేదైన మందులు ఆరోగ్యాన్ని కలిగిస్తున్నవి కదా! అందువల్ల అరిస్టాటిల్ ట్రాజెడీలు ప్రేక్షకుల హృదయ మాలిన్యాల్ని ప్రక్షాళనం చేసి మనస్సుని నిర్మలం చేస్తవని భావించి వుండొచ్చు. ఒక విరేచనం మాత్ర కడుపులో కుళ్లను బయటకు నెట్టివేసి కడుపును శుభ్రపరుస్తోంది కదా! ఇంత వాస్తవిక దృక్పథంతో అరిస్టాటిల్ ట్రాజెడీ ప్రయోజనాన్ని భావించడం ఆరోగ్యకరమైన మంచి విమర్శనాపద్ధతి. అది అచ్చమైన గ్రీకు పద్దతి ట్రాజెడీ కనుక ప్రేక్షకుల్ని నిర్మల చిత్తులుగా, అంతకుముందుకంటే సుఖంగా వుండడాన్ని భావింపజేయజాలకపోతే అది ట్రాజెడీ అయినా కూడా చెడ్డదనే అర్థం.

వర్గభేదం అప్పుడే మొదలవుతున్న కాలంలో బుద్ధిమంతులైన గ్రీకులసాహిత్య దృక్పథం ఇది. సభా వేదికలమీద నుండి శ్రోతల్నిఉద్రూతలూగించే గంగాప్రవాహం లాంటి వాక్య విన్యాసం యొక్క విలక్షణమైన విజ్ఞానంతో భాషాప్రయోగ నైపుణ్యం - మంత్రముగ్ధుల్ని చేసే సంభాషణా చాతుర్యం - ఇదంతా ఒక కళ. తెలిసి, నేర్చి, అభ్యసించాల్సింది. ఇంకోటికావ్యకళ అది అనుకరణ కళ వాస్తవానుకరణ శీలమైన కావ్యకళ. అది విన్నవాళ్ళల్లోనూ, కన్నవాళ్ళల్లోనూ భావ అనుభావ తీవ్రతను బట్టీ దాని విలువలు నిర్ణయమౌతాయి. ఈవిషయంలో ప్లేటో, అరిస్టాటిల్ ఇద్దరూ ఏకీభవిస్తారు. కానీ ప్లేటో మాత్రం ఆ తీవ్రత కావ్య నిర్మాణ దశలోనూ, అనుభావ దశలోనూ కూడా నియమాలననుసరించడం వల్ల సాధించలేమనే భావిస్తాడు. వ్యక్త చైతన్యం పరిధికి అవతలే కావ్య నిర్మాణమూ - అనుభవ ప్రశస్తీ రెండున్నూ జరుగుతాయని ఆయన విశ్వాసం. మరి ప్లేటో, కావ్యానికి సాంఘిక ప్రయోజనం వుంటుందని అనుకోనే అనుకోడు. ఈ విషయాన్ని మనస్సులో పెట్టుకునే అరిస్టాటిల్ కావ్యశ్రవణంవల్ల కానీ, దర్శనం వల్లగానీ కలిగే తీవ్రమైన భావ అనుభావాలు సాంఘిక ప్రయోజనాన్ని సాధిస్తాయని చెప్పాడు. కెథార్టిక్ ఆ ప్రయోజనమే.

ఆ మాత్రపు ప్రయోజనదృష్టితో చేసిన కావ్య నిర్వచనం ఈ కాలానికి పనికిరాదు గ్రీకులు తప్పు చెప్పారనికాదు పనికిరాదనడం. సంఘం మారిపోయింది. ఈనాడు అరిస్టాటిలే కనుక వుండి నేటి సాహిత్యాన్ని క్రమబద్ధం చేసి వింగడిస్తున్నట్లయితే ఆయన తన అనుకరణ సిద్ధాంతం ఈనాటి సాహిత్య ప్రక్రియలనన్నింటినీ ఒక గాటికి లాగి పట్టించడానికి అవకాశం లేకుండటాన్ని తప్పక చూసికొని వుండేవాడు. అది ఆయన సిద్ధాంతంలోని లోపం కాదు. సాంఘిక పరిణామ మహస్సు సాగిన యింతకాలం మీద కొత్త కొత్త ప్రక్రియలెన్నో పుట్టుకొచ్చాయి అందువల్ల అన్నింటికీ అనుకరణ సిద్ధాంతం పట్టదు. ఆధునిక కాలంలో వచ్చిన

నవల-నాటిక- ఈ రెండు ప్రక్రియల్లోనూ వాస్తవిక సత్యానుకరణం వుంది. ఇప్పుడు మనం కవిత్వమని దేన్ననడానికి అందరమూ అంగీకరిస్తున్నామో అది నవలా నాటకాలకంటే భిన్నమైంది. దాని ప్రత్యేకత్వాన్ని మనంకనుగొనాలి. ఇక మీదట మనమా ప్రయత్నం చేద్దాం.

కానీ అరిస్టాటిల్ చెప్పిన నిర్వచనాన్ని బట్టి మనం కవిత్వ మూలతత్వాన్ని విచారిస్తే - ఇతర సాహిత్యమంతా కవిత్వమే కాబట్టి, విస్మరించలేము. భౌతిక దృక్పథంతో సంస్కృతీ సంప్రదాయ అధ్యయనం చేస్తే మనం ఆ విస్మరించడమనే పొరపాటు చేయనే చేయము. మతము-సాహిత్యము మొత్తం ఒక కవిత్వ రూపంలోనే వున్నకాలం ఒకనాడుందని మనకు తెలుసును అయినా ఆధునికులుగా పెట్టుబడిదారీ యుగంలో నివసించే జనంగా - మనం ముఖ్యంగా బూర్జువా కవిత్వతత్వాన్ని అధ్యయనం చేయాలి. ఆధునిక కవిత్వాభివృద్ధికి సంబంధించిన స్థూల చారిత్రక దృక్పథంతో అధ్యయనం దీని తర్వాత చేద్దాము.

## 10

ఆధునిక కవిత్వం అంటే అది బూర్జువా కవిత్వం అనే అర్థం. ఇంతకూమనం దేన్ని ఆధునికత అంటున్నాం. పదిహేనవ శతాబ్దం నుండి నేటి వరకూ యూరపుఖండంలో అభివృద్ధి అయిన నాగరికత యొక్క మొత్తం ప్రత్యేకత్వాన్ని ఆధునికత అంటున్నాము. ఈ ప్రత్యేకత ఒకానొక ఆర్థికమైన పునాదిబలం మీద ఆధారపడివుంది. ఈ ప్రత్యేకత ఇంకా మార్పు లక్షణాన్ని కలిగివుంటుంది. ఆర్థికమైన పునాదులు పాలెగాండ్ర (ఫ్యూడల్) నుండి పారిశ్రామికులవైపుకు మారినవి. ఈ నాగరికత యొక్క ప్రత్యేకత ఉత్పత్తిలో బూర్జువాలు తెచ్చిన విప్లవ స్వరూపానికి సంబంధించింది. ఈ విప్లవ స్వభావాన్ని మార్క్స్ సంపూర్ణంగా విశ్లేషించి దాస్ కాపిటల్‌లో వివరించాడు. ఆ లెక్కలో ఆధునిక కవిత్వం అని మనం అనేది పెట్టుబడిదారీ కవిత్వమే ఈ ఆధునిక కవిత్వం మనకు చక్కగా అర్థం కావాలంటే దీన్ని మనం గతితార్కిక చారిత్రక దృక్పథంతో అధ్యయనం చేయాలి. అలాకాకుండా కవిత్వాన్ని చైతన్య రహితమూ, జడమూ అయిన కళగా భావించి అధ్యయనం చేస్తే అది ఆ విధంగా మాత్రమే మనకు అర్థం అవుతుంది. అది బొత్తిగా వ్యర్థమైనపని. విపరీత చైతన్యం వున్న సంఘ శక్తి చేత ఉత్పన్నం అయిన కవిత్వం ఉన్నప్పుడు దాన్ని అసలట్లా అధ్యయనం చేయనేకూడదు. అందువల్ల అట్లా చేయడం వ్యర్థం. కానీ బూర్జువా నాగరికతకాలంలోని కవిత్వాన్ని అధ్యయనం చేయడం అంత సులభసాధ్యమైన పనికాదు. ప్రపంచంలోని చాలా జాతులు, చాలా భాషలు బూర్జువా నాగరికత యొక్క మహోద్యమంలో భాగస్వామ్యాన్ని పొందాయి. అదేమైనా

కవిత్వాన్ని అర్థం చేసుకొని ఆనందించాలంటే అది ఏ భాషలో రాసివుందో ఆ భాషలో అత్యంతమైన అభినివేశంతో గాఢమైన పరిచయం వుండితీరాలి. సాహిత్య ప్రక్రియలన్నింటిలోనూ ఒక్క కవిత్వానికే ఈ ప్రత్యేకత వుంది [9]

ఇంగ్లాండ్‌లోని బూర్జువాలే మొట్టమొదట ఆర్థిక విప్లవాన్ని తెచ్చారు. వాళ్ళను చూసే తక్కిన దేశాల వాళ్ళు ఆ మార్గాన్ని అనుసరించారు. క్రీ.శ. 1789 - 1871 సంవత్సరాల మధ్యకాలంలో ఫ్రాన్స్ దేశంలో ఈ బూర్జువా విప్లవం ఇంగ్లాండ్‌లో కంటే ఒక ప్రత్యేక మార్గంలో సాగింది. దాని గమనంలో ఒక విపరీతమైన వేగం వుంది. దాని స్వరూప స్వభావాల్లో ఒక స్పష్టమైన ప్రతిపత్తి వుంది. దాని ప్రవృత్తిలో ఒక గట్టితనం వుంది. దాని ఆదర్శ స్వరూపం - ఎక్కువ గందరగోళం పట్టిన దాని విపరీత వేగం వల్లనే బూర్జువా సాహిత్యాన్ని మొత్తంగా అధ్యయనం చేయడానికి ఆ కాలంలోని ఫ్రాన్స్ విప్లవం ఎంతో ముఖ్యమైనది. కేవలం కవిత్వాధ్యయనానికి అయితే ఇంగ్లాండ్ విప్లవం ముఖ్యం. ఆధునిక కవిత్వంలో వైవిధ్యానికి, విస్తృతికీ ఇంగ్లాండే బాగా దోహదం చేసింది. అది ఇంకా మూడు శతాబ్దాల పాటు ప్రపంచ రాజ్యాల్ని పెట్టుబడిదారీ ఆర్థిక వ్యవస్థకు అభిముఖం చేసి నడిపించింది. ఆ కాలంలో ఆయా దేశాల్లోనే ఈ ఆధునిక కవిత్వం అభివృద్ధి అయ్యేటట్లుగా కూడా అది చూసింది. ఆ ఆర్థిక వ్యవస్థా, ఈ కవిత్వాభివృద్ధి రెండున్నూ పరస్పర సంబంధం లేనివికావు. చారిత్రకగతిలో ఆ సంబంధంతో వృద్ధి కావడం ఒక భాగం. చారిత్రకంగా బూర్జువాలు ఎంతో విప్లవాత్మకమైన పాత్ర నిర్వహించారు.

సంఘ జీవితంలో అధికారికంగా తమది పైచెయ్యి అయినప్పుడు బూర్జువాలు పాలెగాళ్ళనూ, పురోహిత వర్గాన్నీ, అణగదొక్కారు, ఆ విషయంలో కొంత నిర్దాక్షిణ్యంగా కూడా ప్రవర్తించారనవచ్చును. ఇంకా బూర్జువాలు ఉత్పత్తి సాధనాల విషయాలకూ, దాని ద్వారా ఉత్పత్తి సంబంధాల విషయంలోనూ, వాటితో బాటు సాంఘిక వ్యవస్థ విషయంలోనూ తరచుగా విప్లవాన్ని కొనితెస్తుంటారు. దాన్ని తేకుండా వాళ్ళు బ్రతకలేరు. ఉత్పత్తి విషయమైన నిరంతర విప్లవం, అనివార్యమైన సాంఘిక వైపరీత్యాలు, ఎడతెగని అనిశ్చిత పరిస్థితులతో ఆందోళన- ఇవీ బూర్జువా యుగాన్ని ముందు వెనుకల నుండి వేరు చేసి ప్రత్యేకంగా చూపేవి.

పెట్టుబడిదారీ కవిత్వం ఈ విషయాల్ని ప్రతిబింబిస్తుంది. ఈ పరిస్థితుల నుంచే ఆ కవిత్వం పుట్టుకొని వచ్చింది. భేద భావం లేని ఆదిమ సమాజం యొక్క మనోమయ కోశం నుండి కవిత్వం ఆవిర్భవించింది. కవిత్వానికి అందువల్లే పౌరాణికత్వం ఏర్పడింది. వర్గ సమాజం ఏర్పడిన తర్వాత కవిత్వం పాలకుల చేతి కళ అయి మత విషయమైన సంబంధాల నుండి వేరు పడింది.

బూర్జువా ఆర్థికవ్యవస్థలో ఉత్పత్తి సాధనాల్లో ఎట్లా తరచుగా నిరంతర విప్లవం వస్తుందో అట్లాగే కళాభిరుచుల విషయాల్లోనూ తన విశ్వాసాల్ని, సంకేతాల్ని అది తరచు మార్చుకొంటుంది. ఇంతకుముందు చెప్పిన అన్ని విషయాలకు సంబంధించిన హేతువులలోని ఔచిత్యం - అనిశ్చితత్వం వల్ల కలిగే ఆందోళన - ఇవి - బూర్జువా కళాత్మకతను అంతకు పూర్వం నుండి వేరు చేసి చూపుతాయి. బూర్జువా కళాకారుడెవరైనా తన కాలం భావ తీవ్రతల్ని ఎంత పట్టుకొని తరానికితరం కృషి చేసినప్పటికీ అది పాండిత్య రూపాన్ని పొంది, ప్రాణరహితమవుతుంది. ఆధునికాంగ్ల కవిత్వమంతా అట్లా తయారయిందే.

కవిత్వం పుట్టుక మనకు తెలుసును. అది ఊరి పండగల్లో సామూహికమైన భావోద్వృత్తుల నుండి పుట్టింది. అది ఆర్థికమైన సర్దుబాట్ల అవసరాల చేత నియతమవుతున్న సంఘ సామూహిక చైతన్య ప్రతిబింబం. అదొక వర్గ సమాజ నాగరికత. దాన్ని వ్యక్తిత్వమే దానిని సంపాదించింది. అయితే బూర్జువా తత్వం కవిత్వానికి అనుకూలమైంది కాదు. వ్యతిరేకమైంది కూడా. ఏమంటే కవిత్వం సామూహిక లక్షణం నుండి రావాలి. బూర్జువాతత్వం వైయక్తిక లక్షణం నుంచి బయలుదేరింది. అందువల్లే ఆ రెంటికీ పొత్తుపొసగేటట్లుగా కనిపించడం లేదు.[10]

బూర్జువా తనని ఒక మహా పురుషుడుగా భావిస్తాడు. తానే సర్వతంత్ర స్వతంత్రం కోసం పోరాడుతున్నట్లుగా అనుకొంటాడు. సాధారణ మానవుణ్ని, స్వేచ్ఛగా పుట్టి బతుకంతా బంధనాలతో బతికే వాణ్ని, బంధించి పెట్టే అన్ని సాంఘిక సంబంధాలతోనూ తానొక్కడే వైయక్తికంగా ఎదురు తిరిగి పోరాటం సాగిస్తున్నట్లు తనను తాను విశ్వసిస్తాడు. నిజానికి అతని వైయక్తికత సశాస్త్రీయమైన ఎడతెగని అభ్యుదయాన్ని సాధించదు. అందువల్ల అతడు సాధించే స్వాతంత్ర్యం అంతంతమాత్రంగానే వుంటుంది. పాలెగాండ్ర సాంఘిక వ్యవస్థపైన బూర్జువాలు చేసిన తిరుగుబాటు వల్ల సంఘంలోని ఉత్పాదక శక్తులకు కొంత స్వేచ్ఛ లభిస్తోంది. వాటి వైయక్తిక ముద్ర బూర్జువా ఆర్థిక మౌలిక విధానంలోని నిరంతర విప్లవ దృష్టిని ఇంకా అధికంగా పెంచుతుంది.

బూర్జువాకవి కూడా తన వ్యక్తిత్వం వైపే తాను చూసికొంటాడు. తన హృదయాన్ని ప్రకటించుకోవడం ద్వారా స్వాత్మ దర్శనాన్ని అతడు అభిలషిస్తాడు. ఇది బూర్జువా పగటి కల. తానొక్కడే ఈ దృశ్య ప్రపంచ నిర్మాతను అనేటటువంటి కలఅది. బూర్జువాలకు తమ వ్యక్తిత్వం మీద ఇంత ప్రత్యయం ఏర్పడ్డానికి హేతువు పాలెగాళ్ళ సాంఘిక మర్యాదల్ని తుడిచి పెట్టాలనే కోరికే. ఆ కోరికే ఉత్పత్తి సాధనాల విషయంలో బ్రహ్మాండమైన శాస్త్రీయ అభివృద్ధినీ, ప్రగతినీ సాధించింది. ఆ విధంగానే

కవిత్వంలో, రచనా శిల్ప విషయంలో గణనీయమైన ప్రగతిని బూర్జువా వ్యక్తిత్వ దృష్టి సాధించింది. కాని ఇందులో అభ్యుదయ పథంలో పయనించే లక్షణం లేదు. త్వరలోనే పెట్టుబడిదారు తన అహంకార దృష్టి తన సర్వతంత్ర స్వతంత్రత వట్టి యుద్ధోన్మాదాన్ని, అరాజకాన్ని, ఆర్థికమాంద్యాన్ని, విప్లవాన్ని మొదలైన వాటిని మాత్రమే సృష్టిస్తున్నట్లు తెలిసికొంటాడు. అతడు ప్రవేశపెట్టిన యంత్రం, తన వస్తూత్పాదక శక్తి తీవ్రత చేత చివరకు అతణ్నే భయపెడ్తుంది. మార్కెట్ కూడా ఒక భయంకరమైన ప్రకృతిశక్తిగా తయారవుతుంది. అప్పుడది చేలో పడ్డ గుడ్డెద్దులాంటిది.

ఆ మార్కెట్ ద్వారా పెట్టుబడిదారు తన తోటి పెట్టుబడిదారుని శంకరగిరి మాన్యాలు పట్టిద్దామని చూస్తాడు. నిరంతరం వదలకుండా అతడీ ప్రయత్నాన్ని చేస్తూనే వుంటాడు. దాని ఫలితంగా నిన్నటి స్వతంత్ర వృత్తివాడు రేపు ఫ్యాక్టరీ కూలిపని వాడవుతాడు. ఈ సంవత్సరం సొంతంగా కొట్టు పెట్టుకొని వ్యాపారం చేసేవాడు,మరుసటి సంవత్సరం దాన్ని మానుకొని ఎక్కడో ఒకచోట స్టోరు మేనేజరవుతాడు. ఈ వారం బడ్డీకొట్టు పెట్టుకొన్నవాడు దాన్ని వదిలిపెట్టి వచ్చే వారానికి ఒక పెద్ద కంపెనీలో ఏదో యింత జీతం మీద కొలువు చేసేవాడవుతాడు. ఈ విధంగా పెట్టుబడిదారీ విధానం విప్లవ ఫలితాన్ని సాధిస్తుంది. ఇదంతా - అంటే ఈ వ్యక్తిత్వం, ఈ స్వతంత్రత, ఒక విచిత్రమైన అస్వతంత్రతను, పెట్టుబడికయ్యే మూలధనం మీద ఆధారపడేదాన్ని సృష్టిస్తుంది. ఇట్లా ఈ మార్కెట్టు విధానం తానాశించిన, తనకనుకూలమైన ఫలితాన్ని కాక తానాశించని, తనకు అననుకూలమైన ఫలితాల్ని తెచ్చి పెట్టడం చేత బూర్జువా ఆ వ్యవస్థ మీద తిరగబడి ఇంకా అంతకంటే మంచి మార్కెట్టును, మంచి తీవ్రమయిన పోటీని సృష్టించడానికి ప్రయత్నిస్తాడు. ఇట్లా ఈ ప్రయత్నం కొనసాగినకొద్దీ తానాశించిన ఫలితాలు రాక, తాను ద్వేషించి వదిలించుకోవాలని చూసిన బానిసత్వమే ఇంకా చెట్టుకట్టుకొని వస్తుంది. ఈ విధంగా నిజమైన స్వతంత్రత ఎప్పుడూ బూర్జువాకు అందీ అందకపోతూండడం వల్లనే అతడెప్పుడూ స్వేచ్ఛావృత్తిని గురించి మాట్లాడ్తాడు.

బూర్జువా కవి కూడా సరిగ్గా పైన చెప్పిన గాడిలోనే పడి తిరుగుతాడు. తనకున్న స్వాతంత్ర్యం వట్టి బలవంతపు బ్రాహ్మణార్థంలాగానూ, పదికాలాల పాటు పనికివచ్చేది కానిదిగానూ చూసుకుంటాడు. అందువల్ల ఒక ఏకాంతాన్ని అతడు అనుభవిస్తాడు. ఈ విశ్వానికి చెందిన, విశ్వాంతరానికి చెందిన విషయానుభూతి క్రమంగా తన అభిరుచికి దూరమైందిగానూ, తన స్వాతంత్ర్యాన్ని అరికట్టేదిగానూ బూర్జువా కవికి అవగతమవుతుంది. సాంఘిక మర్యాదలన్నింటినీ అతడు తన హృదయం నుంచి దూరం చేస్తాడు. దాన్తో అతడు అల్పుడుగా, దివాలా తీసిన

వాడుగా, స్థిమితం తప్పినవాడుగా అయ్యి అణగదొక్కబడుతున్నట్లు అనుభూతిని పొందుతాడు.

ఈ విధంగా బూర్జువా వ్యక్తిత్వ దృష్టి వ్యక్తిత్వాన్ని నశింపచేసింది అవుతుంది. సాంఘికమైన బంధనాల్ని నిర్మూలించడం కోసం అయిన ఆ బూర్జువా ఆర్థిక విధానం చివరకు అంతకుమునుపు కనీవిని ఎరుగని బలవంతాలైన కట్టుబాట్లతో ఒక గందరగోళమైన సంఘాన్ని సృష్టిస్తుంది. స్వాతంత్ర్యం కోసం బూర్జువాపడిన తహ తహ అతడికి అస్వతంత్రతను ప్రసాదిస్తుంది. అతడు చేసిన ప్రతిపనీ అతడాశించిన దానికి పూర్తిగా వ్యతిరేక ఫలితాల్ని కల్గిస్తుంది.[11]

పెట్టుబడి దారీ వస్తూత్పత్తి విధాన మూలసూత్రాలలోనే ఈ స్వభావ వ్యాఘాత లక్షణంఉంది. దీనివల్లే ఉత్పత్తి తేవాల్సినంత లాభాన్ని తేలేదు. ఎక్కడ చూసినా నిరుద్యోగం విలయతాండవం చేస్తుంది. ప్రపంచానికొక విషమ పరిస్థితి ఏర్పడుతుంది. పెట్టుబడిదారీ విధానం క్రమంగా క్షీణిస్తుంది. అదొక మహాయుద్ధానికి గానీ, విప్లవానికి గానీ దారి తీయవచ్చును. ఈ చివరి దశలో కాని బూర్జువాకు తన స్వేచ్ఛావిధానమే తనకు బంధనమయి, అవసరాలు బలవంతాలై తనను బానిసగా చేసికొంటున్నవని తెలిసిరాదు. అంతకంటే అతడు చేయగలిగిందీ లేదు.

బూర్జువా వస్తూత్పత్తి విధానం ఆ వర్గం మీద నిర్వహణ భారాన్ని పెంచుతుంది. బూర్జువా ఆర్థిక వ్యవస్థ తన జనాన్ని పట్టణాలకు చేరవేస్తుంది. ఫ్యాక్టరీల దగ్గర గుమికూడుస్తుంది. అట్లా చేసి వాళ్ళు పరస్పర సహకారాలతో పనిచేసేటట్లు చేస్తుంది. పోటీ మనస్తత్వంతో కూడిన జీవన విధానాన్ని బూర్జువా వర్గం తాత్కాలికంగా అరికట్టేందుకు సర్వమానవ సౌభ్రాతృత్వాన్ని పైకి తీసుకొని వచ్చి ప్రచారం చేస్తుంది. ఈ ప్రచార ఫలితంగా పాలెగాళ్ళ జులుంను తోసిరాజంటుంది. దీనివల్ల కలిగే ఇంకో ప్రయోజనం ఏమిటంటే కూలినాలి జనానికొక రాజకీయ విద్యా చైతన్యం కలగడం, చివరికి ఆ చైతన్యం వాళ్ళనందర్నీ కలిపి ఒక రాజకీయ పక్షంగా నిలబెట్టడం. కొత్తగా వచ్చిన ఈ కార్మిక రాజకీయ పక్షం క్రమంగా తాను పరిపాలనాధి కారాల్ని చేజిక్కించుకొని తానే ప్రభుత్వాన్ని నడిపిస్తుంది. అదే ఈ వర్గానికి సర్వతంత్ర స్వతంత్ర దశ. అప్పుడు బూర్జువా సమాజం సొంత ఆస్తిపాస్తులు లేనిదై తానుకూడా అసలైన సర్వతంత్ర స్వతంత్ర స్థితికి వచ్చి చేరుతుంది. ఇంతకుపూర్వం ఈ బూర్జువా వ్యవస్థలో సొంత ఆస్తుల్ని పెంచుకోవడానికున్న అవకాశాలే దాని స్వాతంత్ర్య లక్షణంగా చెల్లుబడి అయ్యేవి. ఆ వ్యవస్థ దాన్నే స్వతంత్రతగా భావించింది. కార్మిక రాజకీయ పక్షం నడిపించే ప్రభుత్వాన్ని అందుకొన్నాక కాని బూర్జువాలకు తామనుకొన్నది నిజమైన స్వాతంత్ర్యం కాదని తెలిసిరాదు. ఇది తెలిసి వచ్చిన

తరువాత బూర్జువా వ్యవస్థలేదు. నీళ్ళల్లో ఉప్పులాగా కరిగిపోతుంది. బూర్జువాతోటే ఆ బూర్జువా ఉత్పత్తి విధానం కూడా మాయమైపోతుంది. అప్పుడు - అసలైన స్వాతంత్ర్యంతో మిగతాజాతి తల ఎత్తుకొని లేస్తుంది.

పెట్టుబడిదారి వర్గ సమాజంలో వచ్చినటువంటి కవిత్వాన్ని అర్థం చేసుకోవడానికి ఆ సమాజస్వభావం మనకు తెలియాలి. బూర్జువా వ్యవస్థలో ఉన్న స్వభావ వ్యాఘాత లక్షణాన్ని మనం గుర్తించి ఉన్నాము. బూర్జువా కవిత్వాన్ని అంత శీఘ్రగతితో అంత విపరీతంగా అభివృద్ధి చేసేది ఆ స్వవ్యాఘాత లక్షణమే దైనందిన వాస్తవజీవిత విధానం ఏది వుందో అది బూర్జువా ఆదర్శ జీవనానుభూతిని చక్కదిద్దుతుంది. మొత్తం ఏకరూపమయిన వాస్తవిక సాంఘిక ప్రపంచమే మొత్తం ఏకరూపమైన కళా ప్రపంచాన్ని పోషిస్తుంది. వాస్తవసాంఘిక ప్రపంచం సాంఘిక ప్రయోజనాన్ని ఉద్దేశించి ప్రవర్తించేది. బూర్జువా వ్యవస్థలోని వైయక్తిక దృష్టి, స్వభావ వ్యాఘాత లక్షణం - స్వాతంత్ర్యం అని భ్రమించి సంకెళ్ళను చేతులకు తగిలించుకోవడం - మొదలైన ఇలాంటి గుణ విశేషాలన్నీ పెట్టుబడిదారీ కవిత్వంలో చోటు చేసుకొంటాయి.

బూర్జువా ఎప్పుడున్నూ సచేతనమైన కార్యకారణ పరిజ్ఞానాన్ని కలిగి ఉండడాన్ని స్వాతంత్ర్యంగా భావించడు. ఆ విషయంలో ఎంత అజ్ఞానం వుంటే అంత స్వాతంత్ర్యం ఉన్నట్టుగా అనుకొంటాడు. స్వతంత్రతను సంపాదించి పెట్టే సహజ పాండిత్యంలో అతడికి కొంత విశ్వాసం ఉంది. తానే వుద్దేశంతో క్రియాశీలుడౌతున్నాడో దాన్ని తెలిసి ప్రవర్తించడం స్వతంత్రమని అతడు అనుకొంటాడు. ఉద్దేశం విషయంలో జాగృతుడు కానివాడు కార్యకారణ పరిజ్ఞానం ఉన్నవాడుకాలేడు. కార్యకారణం అంటే కేవలం అవసరం (Necessity) అని అర్థం. కానీ బూర్జువా దీన్ని అంగీకరించడు. అవసరాన్ని అస్వతంత్రతగా అతడు భావిస్తాడు. కాని ఎవడైనా తానే ప్రయోజనాన్ని ఉద్దేశించి అంటే ఏ అత్యవసరం ముంచుకొని రావడం చేత తానాయా పనుల్లో ప్రవర్తిస్తున్నాడో తెలిసి ప్రవర్తిస్తున్నాడో - వాడే నిజానికి స్వతంత్ర బుద్ధి. అట్లా కాకుండా ప్రయోజనదృష్టి లేక స్వభావ ప్రేరణంతో గుడ్డిగా ప్రవర్తించడం పశువులాగా ప్రవర్తించడం. ఎవళ్ళో వెనక నుంచి నెట్టే ముందుకుపడ్డ దానికీ దీనికీ భేదం లేదు. పైన చెప్పినవి తెలిసి ప్రవర్తించడం అన్నది అంతర్దృష్టివల్ల రాదు. వాస్తవ పరిస్థితుల్తో తలపడి పోరాటం సాగించడం వల్ల వస్తుంది. ఈ పోరాటం పరిస్థితులని తెలుసుకొని ఉపయోగపెట్టుకోవడాన్ని నేర్పుతుంది. కాని బూర్జువా ఈ విషయాల్ని అంగీకరించడు. అంగీకరించకుండా ఇంకా చిత్రంగా అతడు - తాను బాహిరమైన సాంఘిక బాధ్యతలనుంచి తప్పుకొంటే

చాలు, తనకు తాను స్వతంత్రుణ్ని అని భావిస్తాడు. కాని వెంటనే పెట్టుబడిదారీ ఉత్పత్తికి సంబంధించిన పరిస్థితులు అతణ్ణి తాను నివసించే సమాజంలోని ప్రజానీకంతో ఇంకా ఇంకా సంశ్లిష్టమైన సంబంధాలు పెట్టుకోక తప్పనివాణ్ణి చేస్తాయి. అందువల్ల అతడు అనుకొన్నట్లుగా సర్వస్వతంత్రుడు కాడు చివరికతడు యుద్ధం వల్ల, ఆర్థిక మాంద్యం వల్ల అనుచితమైన పోటీవల్ల అణగారిపోతాడు. అతడు చేసినపన్లవల్లే అవన్నీ అయినవి అవి అవాలని అతడు అనుకోకపోవడం- అది వేరే విషయం. స్వతంత్రత ఎప్పుడున్నూ కార్యకారణ రూపమైన నిత్యావసర జ్ఞానంలోనే వుంటుంది. సాంఘిక సంబంధ బాంధవ్యాల నియమ లక్షణం యొక్క అవగాహన లేకుండా మానవుడు ఎప్పటికిన్నీ నిజంగా సర్వస్వతంత్రుడు కాలేడు.

స్వాతంత్ర్యానికి సంబంధించిన, మానవ సహజాతాలతో కూడుకొన్నటువంటి సాంఘిక ప్రయోజనాలకు సంబంధించిన భ్రమ ప్రమాదం బూర్జువాకు బూర్జువా వ్యవస్థలోని అస్తవ్యస్తం నుంచే పుట్టింది. సాంఘికాలు కావాల్సిన ఉత్పత్తి సాధనాలు వ్యక్తిగతమైన సొంత ఆస్తిపాస్తులుగా ఉండడమే అస్తవ్యస్త లక్షణం. తన సాంఘిక సంబంధ నియతియొక్క వివేకం కలిగిన మరుక్షణం ఇక బూర్జువా బూర్జువా కాడు. మనస్సును ఊరికే ఏకాగ్రం చేయడం మాత్రమే వివేకమూ, జ్ఞానమూ కాదు. అది తీవ్రమైన కర్మాచరణలోంచి పుట్టుతుంది. ఇంకా అది-వాడి యొక్క సాంఘిక సంబంధాలను నియమించుకోవడానికి సంబంధించిన ప్రయోగాలనుంచి పుట్టుతుంది. ప్రకృతిని నియమించుకోవడానికి సంబంధించిన ప్రయోగాలనుంచే కదా ప్రకృతి యొక్క స్వభావ పరిజ్ఞానం కలిగింది? ఇదిన్నీ అట్లాగే. కాని మానవజాతి తనయొక్క సాంఘిక సంబంధబాంధవ్యాలను ఒక కట్టుబాటుకు తెచ్చే ప్రయత్నం చేయడానికి ముందు దానికా .శక్తి వుండాలి. అంటే సాంఘిక సంబంధాల కాధారభూతమైన "వస్తూత్పత్తి సాధనాల్ని అదుపులో పెట్టుకోగలిగిన శక్తి అన్నమాట"'''

పాలెగాళ్ళ పాలన సాగిన కాలంలో బూర్జువాలకు స్వతంత్రత అంటే వాళ్ళపాలన అంతంకావడం మాత్రమే. బూర్జువాలు పాలన సాగించే కాలంలో కార్మికులకు స్వతంత్రత అంటే ఆ ఉన్న పరిపాలనా వ్యవస్థ నిర్మూలనమవడం మాత్రమే. పూర్ణ స్వాతంత్ర్యం ఉన్నటువంటి - అంటే వర్గరహితమైన సమాజం ఏర్పడడానికి పూర్వం-తత్పూర్వం ఉన్న వ్యవస్థ అట్లాగే కావాలి. అలాంటి సమాజంలో మాత్రమే, సామాజికులందరున్నూ, సంఘానికి అభ్యుదయాన్ని కల్గించే విధుల్ని, అభీష్టానుగుణంగా నియమించుకోవడం ద్వారా, సాంఘిక నియతి యొక్క లక్షణ వివేకం, పరిజ్ఞానం ఎంతో పెంచుకొంటారు. స్వాతంత్ర్యం అంటే అట్లా

చేసికోగల్గడమే సర్వజనుల యొక్క స్వాతంత్ర్యం విషయం ఇది. బూర్జువాకిది అక్కరలేదు. అతడు బూర్జువాగా ఉన్నంతవరకూ స్వాతంత్ర్యం యొక్క ఈ నిర్వచనాన్ని అంగీకరించడు. కాని అతడు ఎల్లకాలం అట్లాగే ఉండలేడు.

బూర్జువాలు భావించిన స్వాతంత్ర్యం విషయంలో ఉన్న వైరుధ్యం, క్రమంగా ఆ సమాజం క్షీణిస్తున్న కొద్దీ, విస్పష్టం కావడం మొదలు పెట్టుతుంది. ఆ బూర్జువా వర్గం యొక్క స్వాతంత్ర్య భావం మొత్తం సమాజం యొక్క స్వాతంత్ర్యంతో విరోధాన్ని ఇంకా ఎక్కువగా పెంచుకొంటుంది. మొత్తంసమాజం యొక్క స్వాతంత్ర్యం దాని ఆర్థికోత్పత్తి శక్తి యొక్క స్వరూపంలో వుంటుంది ఇది మానవుడు ప్రకృతితో ఎదురు తిరిగి పోరాడి సాధించుకొన్నది. క్రమంగా ఆర్థికోత్పత్తి సాధనాలు విరివిగా అవుతున్న కొద్దీ బూర్జువా తాను సర్వస్వతంత్రుణ్ణని భావిస్తాడు. తక్కిన సమాజం ఆ ఉత్పత్తి ఫలితాల్ని తానుకూడా అనుభవిస్తూ ఆ పరిస్థితులకి ఎదురు తిరిగి విప్లవం తేవాలని అనుకోదు. పైపెచ్చు నెమ్మదిగా ఆ పరిస్థితుల్ని అంగీకరిస్తుంది కూడా. ఈ దశలో బూర్జువా భావించిన స్వాతంత్ర్య నిర్వచన విధానం స్థిరపడడం కనిపిస్తుంది. ఇలా కనిపించినంతవరకు బూర్జువా స్వాతంత్ర్య నిర్వచనం సత్యంగానే అనిపిస్తుంది. కాని అదొక మిథ్యాకల్పనం. అదొక ఇంద్ర జాలికమైన మాయామోహం. అనుభవంలో ఆ విషయం అర్థమౌతుంది. సాంఘిక సంబంధాల్ని తోసి పారేయడం చేత మానవుడు తనను స్వతంత్రుడనుకోవడం పాలెగాళ్ళ నాగరికత. బూర్జువా విధానం అభివృద్ధి కావడం చేత ఆ నాగరికత చెలామణి లేనిదయింది. ఇక్కడ నాగరికత అంటే అది వారి ఆర్థిక విధానమని అర్థం.

అభ్యుదయ పథంలో నడిచేటటువంటి సంఘం దాన్ని పూర్తిగా వ్యతిరేకించడంచేత బూర్జువాలు కల్పించిన స్వాతంత్ర్య నిర్వచనం యొక్క బండారం బయటపడి, అదేమీ కాకుండాపోయి, కొత్త నిర్వచనానికి చోటిస్తుంది. ప్రతివిషయాన్ని స్వతంత్రంగా ఆలోచించి నిశ్చయించుకొనే జ్ఞానం ఎంత ఉంటే వాడంత స్వతంత్రుడు. స్వతంత్రత అంటే అలాంటి జ్ఞానం, సాంఘిక సంబంధాల్ని అంటే ఉత్పత్తి శక్తుల్నీ వాటి ప్రవృత్తుల్నీ అదుపులో పెట్టుకోగల్గే జ్ఞానమే మానవుని స్వాతంత్ర్య లక్షణం. కాని ఈ లక్షణం విప్లవం చేత ప్రాణం పోసుకొంటుంది. ఈ విప్లవం సామ్యవాదానికి, కార్మిక ప్రభుత్వ శక్తికీ అభిముఖమయింది. దీనికి బూర్జువా అంగీకరించడు. అతడనుకొన్న స్వాతంత్ర్యానికి ఇది పూర్తి వ్యతిరేకం కదా- అందుకని. ఈ పరిస్థితిలో బూర్జువా మొత్తం సంఘం కోసమే తన బదుకన్నట్లుగా మాట్లాడి తనని తాను నిలబెట్టుకోజూస్తాడు. కాని సంపూర్ణ సామ్యవాద సాంఘిక వ్యవస్థకోసం విప్లవిస్తున్న మహాజన సంఘం ఆ విధంగా బూర్జువాను నిల్వనియ్యదు, మాట్లాడనియ్యదు.

వ్యక్తి స్వాతంత్ర్యం అంటే సమాజంతో కలిసిపోయినప్పటికీ తననితాను దర్శించుకోవడం, అట్లా కలిసిపోవడానికి వున్న అనువైన పరిస్థితులే స్వాతంత్ర్య లక్షణాలు. ఇలాంటి లక్షణాలున్న సంఘం స్వాతంత్ర్య దర్శనానికి సాధనం. వాస్తవమిలావుంటే బూర్జువాకి వున్న స్వాతంత్ర్య విషయంలోని భ్రమ ప్రమాదం ఈవిషయాన్ని పరిగణించనే పరిగణించదు. అతడెప్పుడూ వివేకంతో పనిలేని స్వాతంత్ర్యాన్ని, సంఘంతో పనిలేని వ్యక్తిత్వాన్ని మహావిషయాలుగా భావిస్తుంటాడు. పై భ్రమ ప్రమాదంనుంచే ఈ భావించడం మొదలైంది. బూర్జువా పరిపాలన సాగడానికి ఆధారమైన ఏ విశేషమైన ఆధిక్యంవుందో దాని ప్రతిబింబమే ఆ భ్రమ ప్రమాదం. ఇంకా అది ఒకానొక ప్రత్యేకమైన వర్గసమాజంనుంచే ఉత్పన్నం అయింది. అది తానున్నంతవరకూ సంఘాన్నింకా చీల్చియేజూస్తుంది.

అన్నివర్గ సమాజాలకు వాటి మిధ్యాభ్రమలు వాటికున్నాయి. బానిస సమాజంలో స్వాతంత్ర్యం అంటే నిర్బంధ పద్ధతి, బానిసవిధానం లేకపోవడం కాదు. అదొక విలక్షణమైన బలాత్కారంలో స్వాతంత్ర్యాన్ని చూస్తుంది ఈ విలక్షణత్వం ఆజ్ఞారూపంలో వుంటుంది. యజమాని ఆజ్ఞాపిస్తాడు. దానిమేరకు దాన్ని బానిస నెరవేరుస్తాడు. అలాంటి సమాజంలో ఆజ్ఞ ఇవ్వగల్గడమే స్వాతంత్ర్యం. వర్గాలు అభివృద్ధి అవుతున్నకొద్దీ మొత్తంమీద ఆజ్ఞలిచ్చే మనస్తత్వాన్ని వాస్తవం నుంచి తొలగించడానికి నియమించే జ్ఞానం సడలిపోతుంది. గుడ్డిగా యజమానుల ఆజ్ఞల్ని శిరసావహించి పనిచేసేటటువంటి బానిస వాస్తవ పరిస్థితుల్తో తెగించి పోరాడాల్సి వస్తుంది. దీని ఫలితంగా వచ్చే ఆర్థికమైన బడుగుతనం- నిరంతరం పెరిగిపోతున్న మానవుని నిత్యావసర విషయ పరిజ్ఞాన శూన్యతవల్ల కలిగే అస్వతంత్రతకు ప్రతిబింబం. ఈ బడుగుతనంలో జ్ఞానానికీ, స్వతంత్రతకూ వాహకం కావాల్సిన వర్గ సమాజం నిశ్చైతన్యం అవుతుంది. అది క్రియాశూన్యతతో నిండిపోతుంది. వివేకం (Conseousness) ప్రకృతితో మానవుడు చేసే తీవ్రపోరాటం నుంచి పుట్టుకొని వస్తుంది. ఆపెనుగులాట ఆగిపోతే వట్టిచూపుసరిపోని మూర్ఖాచారాల అనుసరణ కాలంలో, వివేకం రూపుమాసిపోతుంది. సంఘంలో ఆ వివేకం యొక్క పురోభివృద్ధిని కుంటుపడచేసే చూపుచాలనటువంటి మూర్ఖత్వంవల్ల జరిగే నిలువుదోపిడీ విధానాన్ని తోసిరాజు అనడానికి నిరంతరమైన సంకుల సమరం కొనసాగుతుండాల్సిందే. అలాంటి తీవ్ర సంచలనం ఉన్నప్పుడే వివేకం -స్వతంత్రత సంఘగర్భం చీల్చుకుని కాగడాలు వేసికొని బయలుదేర్తాయి. అప్పుడుకాని అసలైన స్వాతంత్ర్యం యొక్క అంతస్సత్యం అవగతం కాదు. అలాకావాలంటే ముందుగా సమాజంలో వర్గాలు లేకుండా పోవాలి. నిజంగా స్వతంత్రులవడానికి మానవులకి అన్ని మార్గాలూ తెరచుకోవాలి. అవి అట్లాగే తెరుచుకుంటాయి. అట్లా కావడానికి పెట్టుబడిదారీవర్గమే కావాల్సిన అన్ని ఏర్పాట్లని చేసివుంచుతుంది. దాని గోతిని అదే తవ్వుకుంటుంది.[12]

# కాడ్వెల్ ప్రాపంచిక దృక్పథం గురించి

- కాత్యాయనీ విద్మహే.

క్రిస్టోఫర్ కాడ్వెల్ అటు భౌతిక సాంకేతిక శాస్త్రాలను, ఇటు సామాజిక శాస్త్రాలను విస్తృతంగా అధ్యయనం చేశాడు. తద్వారా అలవడిన సునిశిత హేతుబద్ధ దృష్టితోను, గతితార్కిక, చారిత్రక భౌతికవాద అవగాహనతోను, సాహిత్యాన్ని, మత సాంస్కృతికాంశాలను సామాజిక పరిణామాల సంబంధంలో వ్యాఖ్యానిస్తూ విస్తృతంగా వ్రాశాడు. ఇల్యూషన్ అండ్ రియాలిటీ (భ్రమ - వాస్తవికత) పూర్తిగా సాహిత్య కళా విమర్శ శాస్త్ర రచన *స్టడీస్ ఇన్ ఎ డైయింగ్ కల్చర్* (మరణోన్ముఖమైన సంస్కృతిపై అధ్యయనం) *ఫరదర్ స్టడీస్ ఇన్ ఎ డైయింగ్ కల్చర్* (మరణోన్ముఖమైన సంస్కృతిపై మరికొంత అధ్యయనం) - ఈ రెండు పుస్తకాలు కొంత అనువర్తిత సాహిత్య విమర్శ విధానంతోను, మరికొంత ప్రత్యక్షంగా కాకపోయినా, పరోక్షంగానైనా సాహిత్య అధ్యయనానికి కొత్త జ్ఞానాన్నిచ్చే భావనల పరిచయ విశ్లేషణలతోనూ వున్నాయి. మొత్తానికి సాహిత్య అధ్యయనానికి, విమర్శకు మార్క్సిస్టు మార్గాన్ని చూపించే మూడు పుస్తకాలివి.

కాడ్వెల్ ఈ పుస్తకాలు వ్రాసి ఇప్పటికి అరవై ఏళ్ళు దాటింది ఈ మధ్యకాలంలో అంతర్జాతీయ, రాజకీయార్థిక రంగాలలో వచ్చిన పరిణామాలను అనుసరించి మార్క్సిస్టు సాహిత్య విమర్శ కూడా కొత్త భావనలతో విస్తరించింది. ఆ దృష్ట్యా ఇప్పుడీ కాడ్వెల్ విమర్శ నమూనా కొంత యాంత్రికమైనదిగానో, ప్రాథమికమైనదిగానో అనిపించవచ్చు. కానీ ఆనాడు తనకున్న పరిమిత అవకాశాలలో, సమయంలో సాహిత్య, సాంస్కృతిక రంగాల గురించి కాడ్వెల్ అపరిమితంగానూ, నిజాయితీతోను, నిబద్ధతతోను చేసిన ఆలోచనలు, ఆ ఆలోచనల వెనుక వున్న

తాత్త్వికత వర్తమాన ప్రపంచ విధానాలను, పోకడలను అర్థం చేసుకొనడానికి తప్పనిసరిగా ఉపకరిస్తాయి. అందుకు ప్రేరకంగా వుంటుందనే ఇప్పుడీ పుస్తకాన్ని తీసుకురావడం.

## II

*ఇల్యూషన్ అండ్ రియాలిటీ* పన్నెండు అధ్యాయాల పుస్తకం. ఇందులో ది బర్త్ ఆఫ్ పొయట్రీ, డెత్ ఆఫ్ మైథాలజీ, ది డెవలప్‌మెంట్ ఆఫ్ మోడరన్ పొయట్రీ అనే మొదటి మూడు అధ్యాయాలకు స్వేచ్ఛానువాదం "కవిత్వం - సమాజం క్రిస్టోఫర్ కాడ్వెల్ విశ్లేషణ" అన్న ఈ పుస్తకం. ఈ మూడు అధ్యాయాలలోను కాడ్వెల్ కవిత్వ ఆవిర్భావ వికాస చరిత్రను ఉత్పత్తి కారకాలలో, ఉత్పత్తి విధానంలో, సంబంధాలలో వచ్చిన పరిణామాలతో అన్వయించి విశ్లేషించాడు. కవిత్వమంటే ఆర్థిక వ్యవస్థతో సహ సంబంధంలో వుండే మనుషుల అసలు తత్త్వం యొక్క అభివ్యక్తేనని కాడ్వెల్ అభిప్రాయం. పెట్టుబడిదారీ ఆర్థిక వ్యవస్థ అభివృద్ధి అయ్యే క్రమంలో బూర్జువా వ్యవస్థలో వేళ్ళూనుకొన్న వైరుధ్యాలననుసరించి కవిత్వమంతా 'మాయ' యొక్క చలన అభివ్యక్తే అవుతుందని కాడ్వెల్ తేల్చి చెప్పాడు. బూర్జువా సమాజం సృష్టించే భ్రమలు కవిత్వావిర్భావానికి దారితీసిన విధానాన్ని, కవిత్వంలో ఈ స్వీయ వైరుధ్యాలు పనిచేసే విధానాన్ని అర్థం చేసుకోవాలంటే అధ్యయనం చేయాల్సిన అంశాలను కాడ్వెల్ మూడవ అధ్యాయం చివర సూచించాడు.

1) ఇంగ్లీషు కవిత్వాభివృద్ధికి ప్రాతినిధ్యం వహించే కవుల ఆలోచనా విధానాలను, ధోరణులను, 2) కవిత్వ శిల్పకళను, 3) భాషతో కవిత్వానికి వున్న సంబంధాన్ని, 4) వాతావరణం మీద కవి జీవిత ప్రభావ స్వభావాన్ని, 5) అది కవిత్వావిర్భావానికి దారితీసిన ప్రత్యేక విధానాన్ని -అధ్యయనం చేయటం అవసరమని ప్రతిపాదించిన కాడ్వెల్ ఆ ప్రాతిపదిక మీదనే తరువాతి అధ్యాయాలలో విషయచర్చ చేశాడు.

నాలుగయిదు ఆరు అధ్యాయాలు మూడింటిలోను ఇంగ్లీషు కవుల కవిత్వ శిల్ప వైశిష్ట్యాన్ని ఇంగ్లీషు సమాజంలో ఉత్పత్తి రంగాలలో వచ్చిన మార్పులతో అనుసంధించి వ్యాఖ్యానించాడు. పెట్టుబడి సంచయనపు ప్రాథమిక దశ లక్షణాలు -బూర్జువా వర్గం ఇంకా పూర్తి రూపాన్ని తీసుకొనకపోవటం, శ్రమ విభజన విస్తృత స్థాయిలో జరగకపోవటం - అని చెప్పి షేక్స్‌పియర్ ట్రాజెడీలలో ఈ వ్యవస్థను నడిపించిన వైరుధ్యాలు తిరిగి తిరిగి అభివ్యక్తమవుతాయని, ఎలిజిబెత్ యుగ కవితావిర్భావానికి ఈ దశే కారణమని విస్తృతంగా సోదాహరణంగా వివరించాడు కాడ్వెల్.

ప్రాపంచిక దృక్పథం

18వ శతాబ్దిలో కవిత్వం పెద్ద పెద్ద భూకమతాలు కలిగిన పెట్టుబడిదారుల రెక్కల మాటున ఉనికిలోకి వస్తున్న చిన్న తరహా ఉత్పత్తిదారులైన బూర్జువా వర్గపు వస్తూత్పత్తి తత్వాన్ని అభివ్యక్తీకరించిందని చెబుతూ అయినా ఈ దశలో కవి ఇంకా ఉత్పత్తిదారుడి వలె పక్కా బూర్జువాగా మారలేదని, స్వేచ్ఛా మార్కెట్ కోసం కవిత్వం వ్రాయలేదని అంటాడు కాడ్వెల్.

పారిశ్రామిక విప్లవంతో పెట్టుబడిదారీ వ్యవస్థ దాని పూర్తి రూపాన్ని తీసుకొన్నదని, ఆ క్రమంలోనే వర్డ్స్‌వర్త్, షెల్లీ మొదలైన వాళ్ళ కవిత్వంలో ప్రత్యేకతలు చోటు చేసుకొన్నాయని నిరూపించాడు కాడ్వెల్. స్వేచ్ఛా విపణికై ఉత్పత్తి చేయవలసిన వాడుగా ఈ దశలో గొప్ప ఘర్షణకు లోనైన కవి కీట్స్ అని ఆయన అభిప్రాయపడ్డాడు.

బూర్జువా ఆర్థిక వ్యవస్థ అభివృద్ధి కవిని మార్కెట్ కోసం ఉత్పత్తి చేసేవాడిగా మార్చింది. వస్తూత్పత్తి ఆర్థిక వ్యవస్థ మీద నిర్మితమయ్యే సమాజంలో ఉత్పత్తి అయిన వస్తువుకు అనితర ప్రాధాన్యం ఏర్పడి అది ఉత్పత్తిదారుడినే అధిగమించి నియంత్రిస్తుంది. తత్ఫలితంగా సరుకుల ఆరాధన పెరుగుతుంది. ఆ క్రమంలోనే కళ కళకోసమే అన్న వాదం ముందుకు వస్తుంది. కవికి ప్రజలంటే మార్కెట్టే అవుతుంది. ప్రచురణ రంగం అభివృద్ధి చెందటంతో కవి తనకు తెలియని దేశాల ప్రజల కోసం, ఎవరి ఉనికి గురించి, సామాజిక జీవితం గురించి, జీవిత విధానం గురించి తనకేమాత్రమూ తెలియదో వారి కోసం సాహిత్య సృజన చేస్తాడు. గుడ్డిది, కొత్తది, జడము అయిన మార్కెట్టే అతని పాలిట జనం. ఆ రకంగా కవి వ్యక్తిగత ప్రపంచంలోకి తనను తాను ఉపసంహరించుకొని ఒంటరివాడుగా మారటం- కవిత్వంలో సర్రియలిస్టు వంటి శిల్పధోరణులకు దారి తీసిందని కాడ్వెల్ సూచించాడు.

ఏడవ అధ్యాయం 'ది కారక్టరిస్టిక్స్ ఆఫ్ పొయట్రీ' ఆధునిక కవిత్వ లక్షణాల గురించి వివరిస్తుంది. లయాత్మకత, అనువాదానికి లొంగకపోవటం, అహేతుకత, అప్రతీకాత్మకత, నిర్దిష్టత, సాంద్రీకృత సౌందర్య ప్రభావ స్వభావం- మొదలైన అంశాలు ఇందులో చర్చించబడ్డాయి.

ఎనిమిదవ అధ్యాయం ది వరల్డ్ అండ్ ఐ. భాషా స్వభావం వల్ల, సమాజానికి, మనిషికి, వాస్తవికతకు వుండే సంబంధం నుండి రూపొందే కవిత్వ ప్రయోజనం వల్ల కవిత్వ లక్షణాలు సమకూరుతాయని కాడ్వెల్ యిందులో ప్రతిపాదించాడు. సమాజంలో మనిషికి ప్రకృతికి జరిగే నిరంతర సంఘర్షణ ఆలోచనా రంగంలో వాస్తవికత లేక సత్యంగా ప్రతిఫలిస్తుందని, ఇంద్రియాల ద్వారా గ్రహించే వాస్తవానుభవాల నుండి రూపొందే సత్యం ప్రతిమనిషిలోను జ్ఞానరూపాన్ని తీసుకొంటుందని అది క్రమంగా అనేకమంది మనుషుల అదేవిధమైన అనుభవాల పరంపరతో కలిసి వ్యవస్థీకృతమవుతుందని కాడ్వెల్ ఈ అధ్యాయంలో పేర్కొన్నాడు

భాషా వికాసం గురించి, శబ్దశక్తి గురించి కూడా ఇందులో వివరించాడు భాష బాహిర వాస్తవాన్ని గురించిన భావచిత్రాన్ని అందించటంతో పాటు దాని పట్ల మనకొక దృక్పథాన్ని కూడా కలిగిస్తుందని సూచించాడు.

తొమ్మిదవ అధ్యాయం 'సైకీ అండ్ ఫాంటసీ' .సహజాతాలకు, అనుభవానికి మధ్య వుండే వైరుధ్యాల నుండి కవిత్వం చిగురిస్తుందని చెప్తూ ఈ వైరుధ్యాల ఉద్వేగమే కవిని భ్రమాత్మక ప్రపంచ నిర్మాణానికి ప్రేరేపిస్తుందని అయితే కవి సృజనలో ఆ కల్పనా ప్రపంచానికి వాస్తవ ప్రపంచంతో నిర్దిష్టమైన ప్రయోజనాత్మకమైన సంబంధం వుంటుందని ప్రతిపాదించాడు ఈ అధ్యాయంలో.

కల్పనా స్వభావాన్ని గురించి వివరిస్తూ మనస్తత్వ అధ్యయనాలను, అందులో ముఖ్యంగా ఫ్రాయిడ్ మనో విశ్లేషణా సిద్ధాంతాలను విమర్శకు పెట్టాడు. వాస్తవ జీవిత సమస్యల పట్ల మనస్తత్వ విశ్లేషకులు ఆదర్శవాద దృక్పథాన్ని కనబరిచారని, నిజానికది ఉన్నతవర్గాల మత దృక్పథం కంటే భిన్నమైనది కాదని తేల్చి చెప్పాడు. మనుషుల ఆత్మాశ్రయ బాధలకు, అసౌకర్యాలకు, దు:ఖానికి బాహిర భౌతిక ప్రపంచం కాక 'పాపం', కారణమని మతం చెప్తే ఆత్మాశ్రయన్యూనతాధిక్యతాది భావాలు కారణమని మనస్తత్వ శాస్త్రం చెబుతున్నదని పేర్కొని అటువంటప్పుడు మనుషుల కష్టాలు, దు:ఖం, అసౌకర్యం మొదలైనవి పాపం నశించినప్పుడో, ఆత్మ సంయమనం వల్లనో తొలగిపోతాయనటానికి వీలుంటుందని కాడ్వెల్ ఈ అధ్యాయంలో అభిప్రాయపడ్డాడు. అంతేగాక ఫాంటసీని -కల్పనను-కల, పగటి కల, స్వేచ్ఛా సంసర్గం, నిర్దేశిత ఆలోచన, అనిర్దేశిత అనుభూతి అని ఐదు రకాలుగా వర్గీకరించవచ్చని చెప్పి వాటిని వివరించాడు.

పదవ అధ్యాయం 'పొయిట్రీస్ డ్రీమ్ వర్క్ కవిత్వశిల్పం - కళల నిర్మాణంతో పోల్చదగినదని కాడ్వెల్ ఈ అధ్యాయంలో నిరూపించాడు కలకనేవాడు ఇతరేతర ప్రపంచ వాస్తవికతతో సంబంధం లేకుండా కలలోని భావచిత్రాలలో భాగమై జీవిస్తాడు. కవిత్వం చదివే పాఠకుడు కూడా అంతే. బాహిర ప్రపంచంతో సంబంధం లేకుండా కవిత్వ ప్రపంచంలో జీవిస్తాడు. కవిప్రపంచమే అతని ప్రపంచమవుతుంది. కవిత్వం చదువుతూ కవి ఉద్వేగాలను తాను అనుభూతి చెందుతాడు. ఈ రకమైన అనుభూతిని వివరించే సందర్భంలో కాడ్వెల్ మనస్తత్వ శాస్త్రపరమైన 'తనలోకి తాను చూచుకొనటం' అనే అంశాన్ని గురించి చర్చిస్తూ కధ, నవల మొదలైన ప్రక్రియలలో కంటే కవిత్వంలో దాని అవసరం ఎక్కువ అని పేర్కొన్నాడు. నవలకు, కవిత్వానికి వున్న తేడాను గురించి వివరించాడు.

కవిత్వాన్ని కలతో సమానం చేసి చెప్పినప్పుడు కవిత్వ నిర్మాణ కళ కలల

నిర్మాణ విధానాన్ని పోలి వుండటం సహజం అంటాడు కాడ్వెల్. కలలో ఒక పొర ప్రత్యక్ష విషయం అయితే మరొకపొర అప్రత్యక్ష విషయం. ఒకటి భావనాత్మక కల్పన అయితే రెండవది బాధిత వాస్తవం. కవిత్వం కూడా కలలాగానే ఈ రెండు పొరలనే కలిగి వుంటుంది అని వివరించి చెప్పాడు అయితే కవిత్వానికి కలకు కొంత తేడా కూడా వుందని కవిత్వం సృజనాత్మకతకు సంబంధించినది కాగా కలకు ఆ స్వభావమే లేదని చెప్పాడు. కవిత్వం నిర్దేశిత అనుభూతుల సంయోజనం కనుక సృజనాత్మకం - కలలో వాస్తవానికి సంబంధించిన భావచిత్రాలు జాతి ఆకాంక్షల ననుసరించి రూపొందేవి. అక్కడ సృజనాత్మకతకు తావులేదు. కవిత్వం ఉద్వేగాలను బహిర్గతపరుస్తుంది. ఆత్మను అభివ్యక్తీకరిస్తుంది. 'కల'. నిర్మాణంలో మానవశ్రమలేదు. కవిత్వ నిర్మాణంలో శ్రమవుంది. కల చేయలేని సామాజిక వస్తూత్పత్తిని కవిత్వం చేస్తుంది. కవిత్వనిర్మాణాన్ని గురించి వివరిస్తూ యూంగ్ వంటి మనస్తత్వ శాస్త్రవేత్తల ఆవిష్కరణల గురించి విపులంగా చర్చించాడీ అధ్యాయంలో కాడ్వెల్.

పదకొండవ అధ్యాయం 'ది ఆర్గనైజేషన్ ఆఫ్ ది ఆర్ట్స్'. మిగిలిన కళల కంటే కవిత్వం దాని శిల్పవిశేషం చేత ప్రత్యేకంగా వుంటుందని చెప్పి కవిత్వ కళావిమర్శ కొద్దిగానో గొప్పగానో మిగిలిన కళల శిల్పవైఖరులమీద వెలుగును ప్రసరింపచేస్తుందని అంటాడు కాడ్వెల్. ఈ సందర్భంలో కవిత్వానికి నవలకు వుండే సంబంధాన్ని గురించి విస్తృతంగా చర్చించాడు.

కవిత్వం లాగానే శబ్దప్రభావంకల కళానిర్మాణ వ్యవస్థ కథ లేక నవల. పద్యనిర్మాణంలో కవి పాఠకుడి మనసు శబ్ద ప్రపంచం సృష్టించిన బాహిర వాస్తవాన్ని అధిగమించి పోకుండా జాగ్రత్త వహిస్తాడు. కాని కథలో, నవలలో సంగతి అట్లాకాదు అక్కడపాఠకులు తమంతట తాము వర్ణిత ప్రపంచంలో ప్రత్యక్షసంబంధం ఏర్పరచుకొంటారు. కవిత్వ పాఠకులు కవితో తాదాత్మ్యం చెందినట్లు అంత తక్షణమే నవలా పాఠకులు రచయితతో తాదాత్మ్యం చెందలేరు. కవిత్వ పాఠకుడు కవి ఉద్వేగాలను తనవిగానే అనుభూతి చెందుతాడు. కవి ఏమి చెప్తున్నాడో దానినే తాను చెప్తున్నట్లు కనబడతాడు. కానీ నవలా పాఠకుడు అలాకాదు. నవలలో కథ తాను చెప్తున్నట్లు కనపడదు. కథలో జీవిస్తాడు. కవిత్వం, కథ లేక నవల రెండూ బాహిరవాస్తవాన్ని గురించిన భావచిత్రాలను పాఠకులలో మేల్కొలిపే శబ్ద సంపుటిని ఉపయోగించే ప్రక్రియలే అయినా కవిత్వం దానిని భాషా నిర్మాణ వ్యవస్థ ద్వారా ప్రతిఫలింపచేస్తుండగా నవల దానిని బాహిరవాస్తవ చిత్రణా వ్యవస్థ ద్వారా ప్రతిఫలిస్తుంది.

ఈ విధంగానే కాడ్వెల్ సంగీత నిర్మాణ వ్యవస్థతో కూడా పోల్చి కవిత్వ నిర్మాణవ్యవస్థ గురించి చర్చించాడు. అంతేకాదు. దృశ్యకళలైన చిత్రశిల్ప భవన నిర్మాణ వ్యవస్థలతోను, నృత్యనాటక నిర్మాణ విధానాలతోను పోల్చి కవిత్వ నిర్మాణ వ్యవస్థ గురించి వివరంగా వ్రాశాడు.

కళా ప్రయోజనం ఏమిటన్న విషయాన్ని కూడా ఈ అధ్యాయంలో చర్చించాడు. మన అభివ్యక్తితో బాహిర వాస్తవాన్ని ప్రకాశింపచేయటం ద్వారా కళ మన గురించి మనకు తెలియజేస్తుంది. ఏ మనిషీ తనవైపు తాను చూసుకోలేడు. కానీ కళ ప్రపంచాన్ని ఒక అద్దంగా చేసి మనకు మనం దృశ్యమానం అయ్యేట్లు చేస్తుంది మనం ఎట్లా వున్నామో చూపించటం కాదు, మనం సమాజం ద్వారా వాస్తవాల సంబంధంలో ఏ క్రియాత్మక శక్తితో వున్నామో కూడా చూపిస్తుంది. కళ ఒక అద్భుతమంత్రదీపం. అది మన అసలు రూపాన్ని కనబరచటమే కాకుండా మన ఆకాంక్షల కనుగుణంగా, అవసరాల కనుగుణంగా ప్రపంచాన్ని మార్చుకొనవచ్చని కూడా మనకు సూచిస్తుంది. అయితే మనం చేయాల్సిందల్లా మన నిజమైన ఆకాంక్షలేమిటో మనం బాగా తెలుసుకొని వుండాలి. మన గురించిన పూర్తి చైతన్యపూరిత అవగాహన మనకుండాలి అంటాడు కాడ్వెల్. సైన్స్ చెప్పలేనిది, మతం ఒక్కటే చెప్తున్నట్లు భ్రమ కల్పించింది-అయినా జీవితవాస్తవికత గురించి అందులో భాగమైన మనం ఏమిటి? ఎందుకు? ఎందుకీ ఆశలు, నిరాశలు, ప్రేమలు, చావులు? - ఈ మొదలైన వాటన్నిటి గురించి చెప్పగలిగింది కళలేనని కాడ్వెల్ స్పష్టం చేశాడు.

ఈ సందర్భంలో కాడ్వెల్ సైన్స్‌కు కళకు వున్న భేదాన్ని, సంబంధాన్ని గురించి కూడా చెప్పాడు. బాహిర వాస్తవాల గురించిన జ్ఞానం సైన్స్ అయితే మన గురించిన జ్ఞానం కళ అని పేర్కొన్నాడు. కళ అనుభూతికి సంబంధించిన శాస్త్రం అయితే, సైన్స్ ఎరుకకు సంబంధించిన కళ అంటాడు.

సమాజంలో కల్పనకు వాస్తవానికి మధ్య విరోధం వుంటుంది. కనుక ఈ రెంటిమధ్య జరిగే సంఘర్షణ నుండే కళ ఆవిర్భవిస్తుంది. కల్పనకు, వాస్తవానికి మధ్య వుండే విరోధం నరాల బలహీనతకు, మనస్తత్వానికి సంబంధించినది కాదని అది సాంఘిక సమస్య అని, కళాకారులచేతనే పరిష్కారమవుతుందని కాడ్వెల్ స్పష్టం చేశాడు. ఈ సందర్భంలో మనోవైజ్ఞానిక విమర్శకున్న పరిమితులను అయన ప్రస్తావించాడు.

ఈ అధ్యాయంలోనేకాడ్వెల్ 'భ్రమ' గురించి కూడా చర్చించాడు. కవిత్వంలో ఏది వాస్తవం ఏది భ్రమ అని తర్కిస్తూ, ఉద్వేగాలను చైతన్యంతోటే అనుభవించటం,

అనుభూతి చెందటం జరుగుతుంది కనుక ఉద్వేగాలు వాస్తవమేనంటాడు. ఇక కవిత్వంలో భ్రమకు నిలయమైంది బాహిర వాస్తవ శకలమే అవుతుందని చెప్తాడు. ఉద్వేగాలు అనుసంధానమయ్యేది ఈ బాహిర వాస్తవ శకలాలకే. కవిత్వంలో అది 'అర్థం' రూపంలో వుండవచ్చు. నవలలోనైతే కథ కావచ్చు. వాస్తవ ప్రపంచం నుండి ఎన్నుకొనే జీవిత శకలమే అయినా అది వాస్తవ ప్రపంచం నుండి దూరం చేయబడి మన సౌకర్యం ప్రకారం మన ప్రయోజనాల కనుగుణంగా అమర్చబడుతుంది. కనుక 'భ్రమ'లకు అక్కడ అవకాశం ఏర్పడుతుంది అంటాడు కాడ్వెల్.

పన్నెండవ అధ్యాయం 'ది ఫ్యూచర్ ఆఫ్‌ది పొయట్రీ'. ఈ అధ్యాయంలో కాడ్వెల్ చారిత్రకంగా చలనంలో వున్న సమాజంతో విడదీయరాని సంబంధంలోవున్న అంశంగా కవిత్వాన్ని అధ్యయనం చేయాల్సిన అవసరాన్ని పదే పదే నొక్కి చెప్పాడు . కవిత్వం భవిష్యత్తును దర్శించటానికి వీలుగా సమాజంలో ఉత్పత్తి సంబంధాలలో వచ్చిన, వస్తున్న మార్పులను గురించి విస్తృతంగా చర్చించాడు. వర్గ చైతన్యం గురించి చెబుతూ శ్రామికవర్గ చైతన్యంనుండి వచ్చే కళాసాహిత్యాలు క్రమంగా కమ్యూనిస్టు కళా సాహిత్యాలుగా పరిణామం చెందుతాయని నిరూపించాడు. బూర్జువా కళలలో మనిషికి బాహ్య వాస్తవాల అవసరాన్ని గురించిన చైతన్యం వుంటుంది కానీ తన గురించిన చైతన్యం వుండదు. తననావిధంగా తయారు చేసిన సమాజాన్ని గురించిన చైతన్యం అతనికి వుండకపోవటమే అందుకు కారణం. ఆ రకంగా బూర్జువా కళలో కనిపించే మనిషి సగం మనిషే. కమ్యూనిస్టు కళ అట్లాకాదు. అది సమగ్రం,. సంపూర్ణం. ఎందుకంటే అది మనిషిని బాహిర వాస్తవాల గురించి చైతన్యవంతం చేయటమేకాక స్వీయ అవసరాల గురించిన చైతన్యం కూడా పొందేటట్లు చేస్తుంది.

ఈ విధంగా కాడ్వెల్ *ఇల్యూషన్ అండ్ రియాలిటీ* పుస్తకంలో సాహిత్యానికి సమాజంతో, సమాజంలోని ఇతర శాస్త్రాలతో, కళలతో వుండే సంబంధాన్ని విస్తృతంగా చర్చించి సాహిత్యాన్ని ప్రాపంచిక జ్ఞాన సంపదతో అన్యోన్య సంబంధంగల అంశంగానిరూపించాడు. మతాన్ని, మనస్తత్వాన్ని, సాహిత్యకళారంగాలను, భావజాలాన్ని రాజకీయార్థిక దృక్పథంతో వివేచించిన పుస్తకంగా ఇది అటు సాహిత్యరంగంలో పనిచేసేవాళ్ళకు, ఇటు సామాజిక శాస్త్రరంగాలలో పనిచేసే వాళ్ళకు సమానంగా ఉపకరిస్తుంది. ప్రత్యేకించి మనోవైజ్ఞానిక విమర్శవంటి పాత సాహిత్య విమర్శ విధానాల పరిమితులను బయటపెట్టి మార్క్సిస్టు సాహిత్య విమర్శ సర్వసమగ్రతను నిరూపించిన పుస్తకంగా సాహిత్య విద్యార్థులకిది తప్పనిసరిగా చదువదగినది. షేక్స్పియర్, మిల్టన్, షెల్లీ, వర్డ్స్‌వర్త్, కీట్స్ మొదలైనవారి సాహిత్యంపై కొత్తవెలుగును ప్రసరింపచేయటం కూడా ఈ పుస్తకం ప్రత్యేకత.

# III

కాడ్వెల్ తాత్త్విక ఆలోచనా విధానానికి ఇరుసు భ్రమ-వాస్తవం అనే రెండు విరుద్ధాంశాల మధ్య సంబంధం- సంఘర్షణ. ఈ కీలకసూత్రాన్ని ప్రపంచగతి క్రమ విశ్లేషణకు, సాహిత్యగతి క్రమవిశ్లేషణకు సమాంతరంగా సమర్థవంతంగా ఉపయోగించుకొన్నాడు. ఆ క్రమంలోనే సంస్కృతీ విశ్లేషణకు కూడా దాన్నినే కీలక సూత్రంగా చేసుకున్నాడు

బూర్జువా సంస్కృతి శాస్త్ర సాంకేతిక రంగాలలో ఎంతోప్రగతి సాధించినప్పటికీ ప్రతిదీ మరొకవైపు అంతులేని నిరాశను మిగులుస్తూనే వుందని, ఉత్పత్తి శక్తులలో వచ్చిన అమేయమైన అభివృద్ధి శాంతిని, సమృద్ధిని, సంతోషాన్ని కాక యుద్ధాన్ని, కర్వువును కష్టాన్ని సృష్టిస్తున్నదని కాడ్వెల్ గుర్తించాడు. బూర్జువా సంస్కృతిలో వచ్చిన తీవ్ర సంక్షోభానికి ఇది సంకేతమని భావించాడు. బూర్జువా సంస్కృతి పతనోన్ముఖమవుతున్నదని ఇది ఆర్థిక సాంఘిక సాంకేతిక శాస్త్రసాహిత్య కళారంగాలన్నింటిలో అనివార్యంగా ప్రతిఫలిస్తుందని అభిప్రాయపడ్డాడు.

బూర్జువా సంస్కృతి భ్రమల వల్ల కాక భ్రమలు లేవను కొనటం వల్ల బాధితమవుతున్నదని అంటాడు కాడ్వెల్. భ్రమల కంటే భ్రమలులేవని నమ్మటం మరింత ప్రమాదకరం. బూర్జువా సంస్కృతి మతం, దేవుడు, నీతి, ప్రజాస్వామ్యం, తాత్త్వికత మొదలైన వాటికి సంబంధించిన రెండవస్థాయి భ్రమలను పోగొట్టగలిగింది. కానీ ప్రాథమిక భ్రమ నుండి మాత్రం తాను బయటపడలేక పోయింది. ఎందుకంటే ఆ భ్రమ గురించి దానికసలేమీ తెలియదు. అంతేకాదు ఆ భ్రమే ఇప్పుడు నగ్నంగా, భయంకరంగా సమకాలీన భావజాల నిర్మాణాన్ని తప్పుడు త్రోవ పట్టిస్తున్నది అని చెప్పి కాడ్వెల్ 'మనిషి ప్రకృతి సహజంగా స్వేచ్ఛాజీవి', అన్నదే ఆ ప్రాథమిక భ్రమ అని తేల్చి చెప్పాడు.

స్వేచ్ఛ, సహజాతాల నుండి కాక సాంఘిక సంబంధాల నుండి పుడుతుంది. మనిషి సాంఘిక సంబంధాలకు బయట మనిషిగా మనలేడు. అయితే ఆ సాంఘికసంబంధాలకు కళ్ళుమూసుకొని వాటిని వస్తువులతోటి, మార్కెట్‌తోటి, డబ్బుతోటి, పెట్టుబడితోటి సంబంధాలుగా మార్చుకొనటం జరుగుతుంది. దానితో సాంఘిక సంబంధాలు సరుకుల సంబంధాలుగా మారతాయి, మనిషి సరకు కంటే ఉన్నతుడు కనుక ఆధిక్యతను, స్వేచ్ఛను కలిగి వున్నట్లు కనబడతాడు. కానీ ఇది భ్రమ అని అంటాడు కాడ్వెల్. ఇది ఎట్లా భ్రమ అవుతుందో వివరించి నిరూపించటం కోసం ఆయన స్టడీస్ ఇన్ ఎ *డయింగ్ కల్చర్* పుస్తకం వ్రాశాడు. ఆ పుస్తకానికి ఉపోద్ఘాతం వ్రాసిన జాన్ స్ట్రాచీ (John strachey) ఇది స్వేచ్ఛ అంటే ఏమిటో వివరించటానికి చేసిన బరువైన, సంక్లిష్టమైన, విస్తృతమైన, తీవ్రమైన ప్రయత్నం

అని, కమ్యూనిస్టులు దానికోసం ఎందుకు పోరాడతారో ఎందుకు మరణిస్తారో, అంతిమ విశ్లేషణలో కమ్యూనిజమే స్వేచ్ఛఅని ఎందుకు తెలుసుకోగలుగుతారో వివరించిన పుస్తకం - అని పేర్కొన్నాడు. జార్జి బెర్నార్డ్‌షా . పి.ఇ.లారెన్స్, డి.హెచ్. లారెన్స్, హెచ్.డి. వెల్స్, పాసిఫిజమ్ అండ్ వాయిలెన్స్, లవ్, ఫ్రాయిడ్, లిబర్టీ - అనే ఎనిమిది వ్యాసాలున్నాయి ఈ పుస్తకంలో. ఈ వ్యాసాలన్నింటినీ కలిపే అంతస్సూత్రం మాత్రం మానవస్వేచ్ఛాభావన. బూర్జువా సంస్కృతి సృష్టించిన అతీతమానవుడి గురించి, నాయకుడి వీరోచిత కృత్యాల గురించి, కళాకారుడి గురించి. ఊహాజనితలోకం గురించి, మనస్తత్వశాస్త్రం గురించి, షా, లారెన్స్, వెల్స్, ఫ్రాయిడ్‌లపై వ్రాసిన వ్యాసాలలో చర్చించాడు కాడ్వెల్. బూర్జువా నైతికత గురించి పాసిఫిజమ్ అండ్ వాయిలెన్స్, మారుతున్న విలువల గురించి లవ్, బూర్జువా భ్రమల గురించి లిబర్టీ వ్యాసాలలో విశ్లేషించాడు.

పాసిఫిజమ్ అంటే విశ్వశాంతి. విశ్వశాంతి బూర్జువా విశ్వాసం. విశ్వశాంతిని ఆకాక్షించడం బాగానే వుంటుంది. కానీ అందుకోసం ఇతరులను నిరోధించే ఏ సామాజిక ప్రక్రియ అయినా లేక ఏ హింసా చర్య అయినా తప్పేనంటాడు కాడ్వెల్. హింసను అంతం చేయటానికి హింసను ప్రయోగించటంలోనే తార్కిక వైరుధ్యం వుంది. కమ్యూనిస్టు విశ్వాసం ప్రకారం శాంతిని సాధించే ఏకైక మార్గం సాంఘిక వ్యవస్థలో విప్లవాత్మకమైన మార్పులు తీసుకొని రావటమే.అయితే పాలకవర్గం విప్లవాన్ని హింసాత్మకంగా అణచివేసి శాంతిని సాధించాలనుకొనటంలోనే వైరుధ్యం వుంది. బూర్జువా నీతి ఈ విధమైన బూర్జువా హింసకు న్యాయ సంబద్ధతను సమకూర్చిపెడుతుంది మనిషి మీద మనిషి పెత్తనం చెడ్డదని బూర్జువానీతి వ్యతిరేకిస్తుంది కానీ వస్తువుల మీద, సంపద మీద పెత్తనం మాత్రం అంగీకారయోగ్యమైంది. ఆ క్రమంలో హింస ఒక అంతర్భాగమై విశ్వశాంతిని ఆకాంక్షగానే మిగులుస్తున్న రాజకీయార్థిక పరిస్థితి గురించి కాడ్వెల్ ఇందులో సూచన చేశాడు. విశ్వశాంతికి హింసకు వుండే వైరుధ్య సంబంధాల నుండి రాజకీయార్థిక వ్యవస్థలో శ్రామికవర్గ నియంతృత్వం వరకు జరగాల్సిన ప్రస్థానాన్ని గురించి వివరిస్తూ, శ్రామికవర్గ నియంతృత్వ రూపంలో వుండే రాజ్యం కూడా అదృశ్యమయ్యే క్రమంలోనే మానవప్రపంచం నుండి హింస నిష్క్రమిస్తుందని, శాంతికాముకుల కల ఫలిస్తుందని, మనిషి ఎట్టకేలకు స్వేచ్ఛా జీవి కాగలుగుతాడని కాడ్వెల్ ఈ వ్యాసంలో స్పష్టం చేశాడు.

జీవితం సంగతి అలా వుంచితే సాహిత్యంలోనూ, సినిమాల్లోనూ, ఈ రోజు ప్రధానమైన సమస్య ప్రేమ. ఇది కూడా అంత సులభంగా బోధపడే అంశం

కాదు. బోధపడిందన్న భ్రమలోనే ప్రపంచం నడుస్తున్నది. ప్రేమ గురించిన భ్రమలను బద్దలుకొట్టి ప్రేమ భావనను సామాజికార్థిక పరిణామాల సంబంధంలో ఏ విధంగా అర్థం చేసుకోవాలో కాడ్వెల్ లవ్ అనే వ్యాసంలో వివరించి చెప్పాడు. లైంగిక సామాజిక ఉద్వేగాలు రెండింటినీ వ్యక్తీకరించటానికి వాడే పదం ప్రేమ. మానవ సమాజంలో వ్యక్తికీ ఆర్థిక సంబంధాలకు, ప్రేమకు జీవరాశులలో వచ్చే రసాయనిక మార్పులకు మధ్య జరిగే అంతులేని సంఘర్షణే నిరంతరాయమైన సామాజిక పురోగమనానికి కారణమవుతున్నదని కాడ్వెల్ అభిప్రాయపడ్డాడు.లైంగికత వ్యక్తిత్వ వికాసానికి కారణమైంది కనుక అది చైతన్య వికాసానికి కూడా దోహదకారి అవుతుందని అదేవిధంగా లైంగిక ప్రేమ నిరంతరం ఆర్థిక సంబంధాల వల్ల మారుతూ సంపద్వంతమవుతూ వచ్చిందని, అదే సమయంలో ప్రేమ వల్ల ఆర్థిక సంబంధాలు కొత్తవేడిని సంక్లిష్టతను సంతరించుకొన్నాయని ప్రేమకు తదితర సామాజిక చైతన్యాంశాలతో వుండే అన్యోన్య సంబంధాన్ని ప్రతిపాదించాడు. అయితే మనిషికి మనిషికి మధ్యసామాజిక సంబంధం మార్కెట్ మాత్రమేనని నమ్మటం వల్ల ప్రేమ సామాజిక సంబంధాలలో విడదీయరాని భాగంగా వుంటుందన్న విషయాన్ని బూర్జువావర్గం పూర్తిగా విస్మరిస్తుంది. ప్రేమకు సంబంధించిన సున్నిత మానవీయాంశను తన సాంఘిక చైతన్యంలో అణచివేసిన మనిషి అంతిమంగా ప్రేమ కోసం పడే ఆరాటం నరాలజబ్బుగా, ద్వేషంగా, కల్పనగా బైటపడుతుంది అంటాడు కాడ్వెల్

బూర్జువా సంబంధాలు ప్రాథమిక దశలో వ్యక్తివాదాన్ని సాంద్రీకరించటం ద్వారా లైంగిక ప్రేమకు ఉన్నతస్థానాన్ని కల్పించాయి. డబ్బు సంబంధాలుగా బూర్జువా సంబంధాలు ఘనీభవించక పూర్వం అవి సాంఘిక సంబంధాల నుండి మనిషి స్వేచ్ఛను కాంక్షించాయి. వ్యక్తిత్వాభివ్యక్తికైన ఈ ఆరాటం అప్పుడు అభ్యుదయకరమైన పాత్రనే నిర్వహించింది. ఇది మనుషులలో ఒకరిపట్ల ఒకరికి సున్నితత్వాన్ని, సుహృద్భావాన్ని పెంచింది. ప్రతి ఒక్కరికి స్వేచ్ఛకోసం, ప్రతి ఒక్కరి వ్యక్తిగత అభ్యున్నతి కోసం ఆలోచించేట్లు చేసింది. అయితే బూర్జువా సామాజిక సంబంధాలలోని వైరుధ్యాల వల్ల కొద్ది కాలంలోనే స్వేచ్ఛా స్వాతంత్ర్య భావనలు పూర్తి వ్యక్తిగతము అసాంఘికము కావటం జరిగింది. అభివృద్ధి చెందుతున్న పారిశ్రామిక పెట్టుబడిదారీ సంబంధాలు, ఆధునిక బూర్జువా రాజ్యం రెండూ అన్ని సాంఘిక సంబంధాలలోని మృదుత్వాన్ని పీల్చివేశాయి లైంగిక ప్రేమ సంబంధాలను కూడా అవి ప్రభావితం చేశాయి.

బూర్జువా వివాహవ్యవస్థలో ఆర్థిక సంబంధాలు ప్రేమను కూడా ఆస్తి

సంబంధంగా మార్చివేశాయి అంటాడు కాడ్వెల్. భార్య జీవితకాలపు ఆస్తి అయ్యింది భర్త సహజాతాలను సంతృప్తి పరచటానికి ఆమె సౌందర్య స్పృహతో వుండాలి. ఆస్తి అతని నుండి వేరుగా వుండనట్లే ఆమె కూడా అతని నుండి వేరుగా వుండకూడదు. విశ్వాసపాత్రురాలై వుండాలి. కానీ అతను మాత్రం ఆస్తికి స్వంతదారుడు కనుక అవిశ్వాసంగా వుండవచ్చు. ఎందుకంటే అతను ప్రస్తుతం తనకున్న సంపదల మీద పట్టును కోల్పోకుండానే ఇతరేతర సంపదలను పోగు చేసుకోవచ్చు- ఈ విధంగా స్త్రీ పురుష సంబంధాలను గురించి కాడ్వెల్ వ్యాఖ్యానించి చెప్పిన విషయాలు పితృస్వామ్యం మీద, లైంగికత, లైంగిక స్వేచ్ఛ మొదలైన అంశాల మీద చర్చ సాగుతున్న దృష్ట్యా మళ్ళీ అధ్యయనం చేయవలసినవి అవుతున్నాయి.

లిబర్టీ వ్యాసంలో స్వేచ్ఛకు సార్వజనీన నిర్వచనం ఏదీ లేదని, ఒకరికి స్వేచ్ఛగా పైకి కనబడేదంతా నిజమైన స్వేచ్ఛ కాదని మరీ ముఖ్యంగా బూర్జువా సామాజిక సంబంధాలు బూర్జువాల స్వేచ్ఛను, శ్రామికులకు స్వేచ్ఛ లేకుండా పోవటాన్ని ఉత్పత్తి చేస్తాయని, అనేకమందికి స్వేచ్ఛలేని పరిస్థితుల పునాది మీద కొంతమందికి స్వేచ్ఛను ప్రసాదించే బూర్జువా సామాజిక సంబంధాలు రూపొందుతాయని. బూర్జువావర్గం, శ్రామికవర్గం, యథాతథంగా కొనసాగటానికి ఒకళ్ళకు స్వేచ్ఛ మరొకళ్ళకు స్వేచ్ఛ లేకపోవటం తప్పనిసరి అని కాడ్వెల్ వివరించి చెప్పాడు.

అవసరాలకు సంబంధించిన చైతన్యం స్వేచ్ఛ ఆర్థిక ఉత్పత్తి క్రమంలో ఉద్భవించే అవసరాల గురించిన సామాజిక చైతన్య స్పృహ నుండి స్వేచ్ఛకు సంబంధించిన ముఖ్యమైన అంశం - చర్యకు సంబంధించినది- మనమేది అనుకొంటున్నామో దానిని చేసే స్వేచ్ఛ లభిస్తుందని చెప్తూ ఆర్థిక ఉత్పత్తి మనిషికి తాననుకొన్నది చేసే స్వేచ్ఛను ఇస్తుంది నిజమే కానీ అసలు తానేం చేయాలో తాను నిర్దేశించుకోగల స్వేచ్ఛ మనిషికి వున్నదా అన్న ముఖ్యమైన ప్రశ్నను లేవనెత్తాడు. సామాజిక ఆర్థిక ఉత్పత్తి సూత్రాలు, సంబంధాలు, విధులు, విలువలు ఇవన్నీ మానవస్వేచ్ఛను తదితర మానవ సమాజసంబంధాలలో సాధించవలసినదిగా నిర్దేశిస్తాయి అంటే బాహిర అవసరాలకు సంబంధించిన చైతన్యాన్ని పొందటం ద్వారా మాత్రమే మనిషి తానేమి చేయాలో నిర్ధారించుకోగలుగుతాడు. ఇదెంత వాస్తవమో ఆంతరిక అవసరాల చైతన్య స్పృహ వల్ల మాత్రమే తన ఇష్టం ఏమిటో నిర్ధారించుకోగలుగుతాడన్నది కూడా అంతే వాస్తవం. ఇంకా చెప్పాలంటే యీ రెండూ విరుద్ధాంశాలు కాదు. ఈ రెండూ ఒకటే. ఈ అంతరంగిక స్వేచ్ఛ కూడా సామాజిక ఉత్పాదితమేనని స్వేచ్ఛకు సంబంధించిన మూలతత్వాన్ని వివరించాడు కాడ్వెల్.

స్వేచ్ఛ గురించి ఏ నిర్వచనం అయినా వట్టి దగా వ్యవహారమంటాడు కాడ్వెల్. తమకు కావసినదానిని పొందే స్వేచ్ఛ, తాను ద్వేషించే దుర్మార్గానికి దూరంగా వుండే స్వేచ్ఛ ఎంతమందికి వుంది అని ప్రశ్నిస్తాడు. ఓటు వేసే హక్కు, మాట్లాడే హక్కు వున్న వాళ్ళకు కూడా స్వేచ్ఛ అనేది అనుభవంలో లేదని, పరిస్థితుల ప్రాబల్యంతో నిరుద్యోగానికి దారిద్ర్యానికి గురి అవుతూ జీవితాన్ని ఆనందించలేని స్థితిలో వున్న కోట్లాది మంది జనానికి స్వేచ్ఛ లేదని కఠినంగానే చెప్పాడు కాడ్వెల్. ఇంతా చేస్తే బూర్జువా కూడా స్వేచ్ఛగా లేడని హద్దులు లేని స్వేచ్ఛా భావనకు, భ్రమకు బానిస అయినాడని కాడ్వెల్ పేర్కొన్నాడు. వలసదోపిడి, గుత్త వ్యాపార విధానం ఇవన్నీ బూర్జువా వర్గంలో అంతర్గత స్వేచ్ఛకు అవరోధం కావటం గురించి కాడ్వెల్ చెప్పాడు.

బహుళజాతి సంస్థలు, ప్రపంచ వాణిజ్య ఒప్పందాలు, అంతర్జాతీయ ద్రవ్యనిధి మొదలైన వాటి ద్వారా మూడవ ప్రపంచ దేశాల కదలికలను రాజకీయార్థిక విధానాలను నిర్దేశిస్తున్న అమెరికన్ సామ్రాజ్యవాద స్వభావాన్ని, సంస్కృతిని అర్థం చేసుకొనటానికి ఉపకరించే కీలక భావనలు 'లిబర్టీ' వ్యాసంలో కనబడతాయి. ఆ రకంగా *స్టడీస్ ఇన్ ఎ డైయింగ్ కల్చర్* ఈ నాటి సమాజాన్ని అర్థం చేసుకొనేందుకు కావలసిన ప్రాపంచిక దృక్పథాన్ని అందిస్తుంది.

## IV

బూర్జువా మతాన్ని, సౌందర్య శాస్త్రాన్ని, చరిత్రను, మనోవైజ్ఞానిక శాస్త్రాన్ని, తత్త్వశాస్త్రాన్ని చర్చకు పెడుతూ కాడ్వెల్ వ్రాసిన మరొక అయిదు వ్యాసాల సంపుటి *ఫరదర్ స్టడీస్ ఇన్ ఎ డైయింగ్ కల్చర్* దీనిలోని *ది బ్రెత్ ఆఫ్ డిస్‌కన్టెంట్* అనే వ్యాసంలో మతం పుట్టుపూర్వోత్తరాల గురించిన చర్చవుంది. మతం ఆత్మ చైతన్యానికి సంబంధించినది. తనను తానింక కనుగొనని మనిషి లేదా తనను తాను కోల్పోయిన మనిషి స్వీయానుభూతి నుండి మతం పుట్టింది. మతభావాలు స్వచ్ఛందంగా పుట్టేవికావు. క్రియాత్మక వాస్తవికత నుండే పుడతాయి. మత విశ్వాసాల పుట్టుకకు నిజమైన కారణాలను మరింత లోతుగా విశ్లేషించి చెప్పగలిగింది మార్క్సిజమ్-

అని పేర్కొన్నాడు కాడ్వెల్. మాయాజాలం నుండి గతితార్కిక భౌతికవాదం వరకు జరిగిన ప్రస్థానంలో మతం మధ్యదశ. ఆదిమసమాజంలో మనిషి తనను తాను తెలుసుకొనకముందరి దశలో మాయాజాలం (మాజిక్) పుట్టిందని, వర్గ సమాజంలో మనిషి తననుతాను కోల్పోయిన దశలో మతం పుట్టిందని, అదే వర్గ సమాజంలో మనిషి మళ్ళీ తనను తాను తెలుసుకొన్న దశలో గతితార్కిక భౌతికవాదం పుట్టిందని ప్రతిపాదించి చెప్పి కాడ్వెల్ ఆ తరువాత వాటిని వివరించాడు.

## ప్రాపంచిక దృక్పథం

ఆర్థిక ఉత్పత్తి క్రమంలో పుట్టిన సామాజిక సంబంధాలకు సమాంతరంగా మాజిక్ పుట్టింది కనుక అది ఆదిమ సమాజంలోని ఉత్పత్తితో పాటు అభివృద్ధి చెందుతూ ముందుకు సాగింది. మాజిక్ నలుపు, తెలుపు అనే రెండు రకాలుగా వుంటుందని ఆర్థిక వుత్పత్తితో సంబంధం వున్నది తెలుపు మాజిక్ అని, మానవ శ్రమకు తోడుగా ధైర్యాన్నిచ్చే శక్తిగా అది వుంటుందని చెప్తాడు కాడ్వెల్. సైన్స్, కళలు అభివృద్ధి చెందేకొద్దీ జీవితంలో మాజిక్ పాత్ర అదృశ్యమవుతుంటుందని, కానీ అదే సమయంలో నలుపు మాజిక్ మరింత శక్తివంతమైన కొత్తరూపంలో తిరిగి ప్రత్యక్ష మవుతుందని అంటాడు. అదే మతంగా మారుతుందని చెప్తాడు ఆర్థిక వ్యవస్థల్లో వచ్చిన మార్పులకు మత వ్యవస్థ ఘనీభవించటానికి మధ్యవున్న సంబంధాన్ని విమర్శనాత్మకంగా వివరించిందీ వ్యాసం. పెరుగుతున్న ప్రజల బాధలకు సేఫ్టీవాల్వుగా తయారయింది కనుకనే మత్తుమందు అని మతాన్ని వ్యవహరించటం జరిగింది. ఆత్మలేని ప్రపంచానికి ఆత్మ అయికూర్చున్న మతంతో కమ్యూనిస్టు అయినవాడు పడవలసిన సంఘర్షణను చేయవలసిన పోరాటాన్ని సూచిస్తుందీ వ్యాసం

బ్యూటీ(అందం) వ్యాసంలో కాడ్వెల్ చేసిన చర్చ చాలా ముఖ్యమైనది అందాన్ని గురించిన భావన ఎప్పుడూ ఒకరకంగాలేదని, అది విస్తరిస్తూ సంకుచితమవుతూ నిరతరం మార్పుకు లోనవుతున్నదని, అందం అనేది పర్యావరణంలో వుందని, తనచుట్టుప్రక్కల వుండే వస్తుసముదాయ సంబంధంలో ఏర్పడే మానవచైతన్యభూమికలో సౌందర్యం ప్రత్యక్షమవుతూ, అదృశ్యమవుతూ వుంటుందని కాడ్వెల్ చెప్పాడు. ప్రతియుగంలోను, అన్ని కాలాలలోను మనుషులు భిన్న భిన్నమైన వస్తువులను అందమైనవిగా ఎంపికచేస్తున్నారని, లేదా అప్పటికే అందమైనవిగా గుర్తించిన వస్తుసముదాయంలోని భిన్న పార్శ్వాలను అందమైనవిగా గుర్తిస్తున్నారని, మనుషులు ప్రకృతి పరిసరాలలోని వస్తువుల నుండి అందమైనవని కొన్నింటిని ఎంచుకొనటమేకాదు, విభిన్నమైన అందమైన వస్తువులను తయారుచేస్తున్నారని కళా సౌందర్య ప్రపంచం దానికి సంబంధించినదేనని కాడ్వెల్ అభిప్రాయపడ్డారు. అందాన్ని గురించిన అంచనాలు కాలానుగుణంగా తరానికి తరానికి మారుతున్నాయంటే అందుకు కారణం సమాజమేనని మనం అంగీకరించినట్లేనని అంటాడు కాడ్వెల్

అందం గురించి చర్చించే సందర్భంలో ఉద్వేగాల గురించి, చైతన్యం గురించి, సత్యం గురించి కూడా విస్తృతంగా విశ్లేషించాడు. సత్యసౌందర్యాలకున్న సంబంధం గురించి ఆదిమ సమాజాలలోని శ్రమ సంబంధ సంస్కృతి నేపధ్యం నుండి వివరించాడు బూర్జువా సంస్కృతిలో సత్య సౌందర్యాల కున్న సహజసంబంధం తెగిపోయిందని అక్కడ సత్యం అమానవీయతను,సౌందర్యం ఊహాత్మకతను

సంతరించుకొన్నాయని అంటాడు కాడ్వెల్ సామాజికంగా తెలిసిన వస్తు సముదాయంలోని సమర్థవంతమైన మూలకాలు ఎప్పుడయితే ఒక సాంఘిక క్రమాన్ని కనబరుస్తాయో అక్కడ సౌందర్యం వున్నట్లని కాడ్వెల్ అభిప్రాయం సాంఘికక్రమంతో సంబంధంలేని బూర్జువా మార్కెట్ పనితీరు సౌందర్యాన్ని చంపేస్తుందని, సాంఘిక ఉత్పత్తులన్నీ వ్యాపార ప్రయోజనాలకే కావటం వల్ల వచ్చిన దుష్ఫలితం ఇదని కాడ్వెల్ వివరించాడు. సాహిత్య కళారంగాల మీద దీనిప్రభావాన్ని గురించి కూడా చర్చించాడు. ఇటువంటి ప్రపంచాన్ని శ్రామికవర్గం విప్లవం ద్వారా మార్చే క్రమంలోనే మళ్ళీ అందం ఒక జీవిత విలువగా సామాజిక నిర్మాణంలోకి ప్రవేశిస్తుందని శ్రమైక జీవన సౌందర్యమే సౌందర్యమని ప్రతిపాదిస్తూ ఈ వ్యాసాన్ని ముగించాడు

అందం పోటీ అయినచోట అందం ఎంతగా అభావమవుతుందో, బహుళజాతి సంస్థల ఉత్పత్తులకు మార్కెట్‌ను పెంచేందుకు సాధనంగా మార్చిన 'అందం' ఎంత భ్రమాత్మకమైందో - అందాల పోటీల వర్తమాన సంస్కృతీ సందర్భం నుండి అర్థం చేసుకొనటానికి ఈ వ్యాసాంశాలు ఎంతోగానో ఉపకరిస్తాయి.

మనిషి, ప్రకృతి, చరిత్ర, మనస్తత్వం, తత్వశాస్త్రం - వేటి గురించి మాట్లాడినా కాడ్వెల్ సరుకుల ఉత్పత్తి ప్రధానమైన ఆర్థికవ్యవస్థ, మార్కెట్ సంబంధాలు ఆయా అంశాలలోని అసలు సమష్టిమానవీయ సారాన్ని పీల్చేసి సామాజికక్రమాన్ని భగ్నం చేసి అమానవీయ హీన సంస్కృతిని ఎట్లు సృష్టించాయో ఆ క్రమంలో తలక్రిందులైపోయిన ప్రపంచాన్ని సరిగా కాళ్ళమీద నిలపాలంటే శ్రామిక వర్గ రాజ్యం, సంస్కృతి మాత్రమే ఎట్లా సమర్థవంతమైనవో వివరిస్తూ నిరూపిస్తూ వచ్చాడు. పతనోన్ముఖ లక్షణాలు బూర్జువా సంస్కృతిలో ఎట్లా చోటుచేసుకుంటు వేళ్ళూనుకొన్నాయో తన శాస్త్రీయ విశ్లేషణా పద్ధతిలో చెప్పి ఒప్పించటమే గాక ఆ సంస్కృతిపైన పోరాటం చేయగల ఏకైక సాధనంగా మార్క్సిజాన్ని గొప్ప గౌరవంతో, విశ్వాసంతో పేర్కొన్నాడు మార్క్సిస్టు దృక్పథంతో సాహిత్యాన్ని, సమాజాన్ని, ఉత్పత్తి విధానాలను- సంబంధాలను, మతాన్ని, కళలను శాస్త్ర సాంకేతికాది సర్వవిషయాలను అధ్యయనం చేయటానికి తన రచనల ద్వారా ఒక నమూనాను అందించాడు. ఎర్నెస్ట్‌ఫిషర్, జార్జిథామ్సన్ లాంటివాళ్ళు సాహిత్య కళా విమర్శలో ఈ మార్గాన్ని కొనసాగించారు.

సాహిత్య కళారంగాలలో ఆధునికానంతర ధోరణులు ప్రబలమవుతున్న ఈ రోజులలో కాడ్వెల్ ఆలోచనలు, ప్రతిపాదనలు, విమర్శలు, విశ్లేషణలు అందరికీ ఆమోదయోగ్యం కాకపోవచ్చు కానీ కాడ్వెల్‌ను చదివిన తరువాత మన ప్రాపంచిక జ్ఞాన నేత్రం కొత్త వెలుగుల వైపుకు విచ్చుకుంటుందని మాత్రం కచ్చితంగా చెప్పవచ్చు. కాడ్వెల్ రచనలను చదవటానికి సామాజిక సాహిత్య శాస్త్ర విద్యార్థులను అధ్యయనపరులను ఎంతగా ప్రేరేపించగలిగితే ఈ పుస్తకానికి అంతగా సార్థకత

## పాద సూచికలు :

1. Art is the product of society, as the pearl is the product of the oyster and to stand out side art is to stand inside society - Illusion and Reality, P : 18.(మిగిలినవి కూడా యీ గ్రంథంలోనివే)
2. This poetry is not "Pure" poetry in any modern sense. We may describe it as a heightened form of ordinary speech, whithout committing ourselves to this is an adequate definition of poetry - P : 19.
3. In this sence poetry is the child of Nature, just as the developed novel is the child of the sophistication of modern culture - P : 28.
4. Poetry is characteristically song, and song is characteristically something which, because of its rhythm, is sung in unison, is capable of being the expression of a collective emotion - P : 33.
5. Poetry is the nascent self - consciounsness of man, not as an individual but as sharer with others of a whole world of common emotion. P : 39.
6. A pianola rou is pierced with holes. Those holes are real concreate entities. But they are not the music. The music is what happens when it is played. The poem is what happens when it is read. P : 40.
7. In a class society the workers do their tasks blindly as they are told by supervisors. They build pyramids but each contributes as stone; only the rulers know a pyramid is being built ... The ruled obey blindly and are unfree. P : 51
8. "To build from matter is sublimely great, But only gods and poets can create" P : 58
9. ..... It is the characteristic of poetry that it demands for its apprecia- tion a more intimate knowledge of the language in which it was written than any other form of literature. P : 65.
10. Now bourgeois culture is the culture of class to whom freedom - man's realisation of all his instinctive powers - is secured by "individualism". It might, there fore seem that bourgeois civilisation should be antipoetic, because poetry is collective and the bourgeois is an individualist" P : 70.
11. His demand for freedom is a negation of freedom. He is a mirror revolutionary" and continually revolutionises society by asking for that which will procure the opposite of what he desires. P : 72.
12. P : 79.

AC No. 903

సంతరించుకొన్నాయని అంటాడు కాడ్వెల్. సామాజికంగా తెలిసిన వస్తు సముదాయంలోని సమర్థవంతమైన మూలకాలు ఎప్పుడయితే ఒక సాంఘిక క్రమాన్ని కనబరుస్తాయో అక్కడ సౌందర్యం వున్నట్లని కాడ్వెల్ అభిప్రాయం. సాంఘికక్రమంతో సంబంధంలేని బూర్జువా మార్కెట్ పనితీరు సౌందర్యాన్ని చంపేస్తుందని, సాంఘిక ఉత్పత్తులన్నీ వ్యాపార ప్రయోజనాలకే కావటం వల్ల వచ్చిన దుష్ఫలితం ఇదని కాడ్వెల్ వివరించాడు. సాహిత్య కళారంగాల మీద దీనిప్రభావాన్ని గురించి కూడా చర్చించాడు. ఇటువంటి ప్రపంచాన్ని శ్రామికవర్గం విప్లవం ద్వారా మార్చే క్రమంలోనే మళ్ళీ అందం ఒక జీవిత విలువగా సామాజిక నిర్మాణంలోకి ప్రవేశిస్తుందని.శ్రమైక జీవన సౌందర్యమే సౌందర్యమని ప్రతిపాదిస్తూ ఈ వ్యాసాన్ని ముగించాడు

అందం పోటీ అయినచోట అందం ఎంతగా అభావమవుతుందో, బహుళజాతి సంస్థల ఉత్పత్తులకు మార్కెట్‌ను పెంచేందుకు సాధనంగా మార్చిన అందం ఎంత భ్రమాత్మకమైందో - అందాల పోటీల వర్తమాన సంస్కృతీ సందర్భం నుండి అర్థం చేసుకొనటానికి ఈ వ్యాసాంశాలు ఎంతోగానో ఉపకరిస్తాయి

మనిషి, ప్రకృతి, చరిత్ర, మనస్తత్వం, తత్వశాస్త్రం - వేటి గురించి మాట్లాడినా కాడ్వెల్ సరుకుల ఉత్పత్తి ప్రధానమైన ఆర్థికవ్యవస్థ, మార్కెట్ సంబంధాలు ఆయా అంశాలలోని అసలు సమష్టిమానవీయ సారాన్ని పీల్చేసి సామాజికక్రమాన్ని భగ్నం చేసి అమానవీయ హీన సంస్కృతిని ఎట్లు సృష్టించాయో ఆ క్రమంలో తలక్రిందులైపోయిన ప్రపంచాన్ని సరిగా కాళ్ళమీద నిలపాలంటే శ్రామిక వర్గ రాజ్యం, సంస్కృతి మాత్రమే ఎట్లా సమర్థవంతమైనవో వివరిస్తూ నిరూపిస్తూ వచ్చాడు. పతనోన్ముఖ లక్షణాలు బూర్జువా సంస్కృతిలో ఎట్లా చోటుచేసుకుంటు వేళ్ళూనుకొన్నాయో తన శాస్త్రీయ విశ్లేషణా పద్ధతిలో చెప్పి ఒప్పించటమే గాక ఆ సంస్కృతిపైన పోరాటం చేయగల ఏకైక సాధనంగా మార్క్సిజాన్ని గొప్ప గౌరవంతో, విశ్వాసంతో పేర్కొన్నాడు. మార్క్సిస్టు దృక్పథంతో సాహిత్యాన్ని, సమాజాన్ని, ఉత్పత్తి విధానాలను- సంబంధాలను, మతాన్ని, కళలను శాస్త్ర సాంకేతికాది సర్వవిషయాలను అధ్యయనం చేయటానికి తన రచనల ద్వారా ఒక నమూనాను అందించాడు. ఎర్నెస్ట్‌ఫిషర్, జార్జిథామ్సన్ లాంటివాళ్ళు సాహిత్య కళా విమర్శలో ఈ మార్గాన్ని కొనసాగించారు.

సాహిత్య కళారంగాలలో ఆధునికానంతర ధోరణులు ప్రబలమవుతున్న ఈ రోజులలో కాడ్వెల్ ఆలోచనలు, ప్రతిపాదనలు, విమర్శలు, విశ్లేషణలు అందరికీ ఆమోదయోగ్యం కాకపోవచ్చు కానీ కాడ్వెల్‌ను చదివిన తరువాత మన ప్రాపంచిక జ్ఞాన నేత్రం కొత్త వెలుగుల వైపుకు విచ్చుకుంటుందని మాత్రం కచ్చితంగా చెప్పవచ్చు. కాడ్వెల్ రచనలను చదవటానికి సామాజిక సాహిత్య శాస్త్ర విద్యార్థులను అధ్యయనపరులను ఎంతగా ప్రేరేపించగలిగితే ఈ పుస్తకానికి అంతగా సార్థకత.

## పాద సూచికలు :

1. Art is the product of society, as the pearl is the product of the oyster, and to stand out side art is to stand inside society - Illusion and Reality, P : 18.(మిగిలినవి కూడా యీ గ్రంథంలోనివి)
2. This poetry is not "Pure" poetry in any modern sense. We may describe it as a heightened form of ordinary speech, whithout committing ourselves to this is an adequate definition of poetry - P · 19.
3. In this sence poetry is the child of Nature, just as the developed novel is the child of the sophistication of modern culture - P : 28
4. Poetry is characteristically song, and song is characteristically something which, because of its rhythm, is sung in unison, is capable of being the expression of a collective emotion - P : 33.
5. Poetry is the nascent self - consciounsness of man, not as an individual but as sharer with others of a whole world of common emotion. P : 39.
6. A pianola rou is pierced with holes Those holes are real concreate entities. But they are not the music. The music is what happens when it is played. The poem is what happens when it is read. P 40.
7. In a class society the workers do their tasks blindly as they are told by supervisors. They build pyramids but each contributes as stone; only the rulers know a pyramid is being built .. The ruled obey blindly and are unfree. P : 51
8. "To build from matter is sublimely great, But only gods and poets can create" P · 58
9. ..... It is the characteristic of poetry that it demands for its apprecia-tion a more intimate knowledge of the language in which it was written than any other form of literature. P : 65.
10. Now bourgeois culture is the culture of class to whom freedom - man's realisation of all his instinctive powers - is secured by "individualism". It might, there fore seem that bourgeois civilisation should be antipoetic, because poetry is collective and the bourgeois is an individualist". P : 70.
11. His demand for freedom is a negation of freedom. He is a mirror revolutionary" and continually revolutionises society by asking for that which will procure the opposite of what he desires P · 72.
12. P : 79.



AC No. 903

# ఉత్తమ నవలలు - కథలు

| | | |
|---|---|---|
| ★ తెలుగుగడ్డ | - గొల్లపూడి నారాయణరావు | 40-00 |
| ★ ఉక్కుపాదం | -జాక్ లండన్ | 20-00 |
| ★ దిటవు గుండెలు | -ద్మిత్రియ్‌మెద్వెదేవ్ | 24-00 |
| ★ దాహం | - చిన్నప్పభారతి | 16-00 |
| ★ ఎదురీత | - యూరీజుకోవ్ | 5-00 |
| ★ సంఘం | - చిన్నప్పభారతి | 5-00 |
| ★ విప్లవ తెలంగాణా పోరాట గాధలు | | 12-00 |
| ★ ఆమె సారథి (తమిళకథానికలు) | | 6-00 |
| ★ నగరం | - గోర్కి | 10-00 |
| ★ ఆశయపథం | - తెలకపల్లి రవి | 15-00 |

ప్రతులకు :

## ప్రజాశక్తి బుక్‌హౌస్

| | | |
|---|---|---|
| కారల్‌మార్క్స్ రోడ్డు,<br>విజయవాడ-520 002<br>ఫోన్: 432 792 | 1-8-52/2<br>శ్రీరామా కాంప్లెక్స్<br>చిక్కడపల్లి<br>హైదరాబాద్-20<br>ఫోన్: 760 8107 | 5, ఎ.జి.కె.కాంప్లెక్స్<br>గాంధీరోడ్డు,<br>తిరుపతి-517 501 |
| బాలాజీనగర్<br>సుందరయ్యభవన్<br>ఖమ్మం 507 001 | | 6-2-250,<br>విజయటాకీస్‌రోడ్డు, చౌరస్తా,<br>హన్మకొండ-506 011 |